విద్యాపతి

రమానాథ ఝా

భారతీయ

TL
811.22
V 669 J



INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA



భారతీయ సాహిత్య నిర్మాతలు

విద్యాపతి

ఆంగ్ల మూలం :

రమానాథఝా

తెలుగు సేత :

బాలాంత్రపు రజనీకాంతరావు

సాహిత్య అకాదెమీ

Vidayapathy : Telugu translation by B. Rajanikantha Rao of Ramanath Jha's in English. Sahitya Akademi, New De
SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

© తెలుగు అనువాదం : సాహిత్య అకాదెమీ

First Published : 1985

TL
811.22
V 669 J

సాహిత్య అకాదెమీ

ప్రధాన కార్యాలయం :

రవీంద్ర భవన్, న్యూ ఢిల్లీ–110 0

Library IIAS, Shimla
TL 811.22 V 669 J
00117728

ప్రాంతీయ కార్యాలయాలు :

29, ఎల్డామ్స్ రోడ్, తేనాంపేట, మద్రాస్-600 018.

బ్లాక్ V-బి, రవీంద్ర సరోవర్ స్టేడియమ్, కలకత్తా-700 029.

172, ముంబయి మరాఠీ గ్రంథ సంగ్రహాలయ మార్గ్, దాదర్, బొంబాయి-400 014

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

Indian Institute of Advanced Study
117728
20/12/04
SHIMLA

Printed at :
WELDUN PRESS, 2, Dr. Radhakrishna Nagar, Ist St., Madras-600 021

విద్యాపతి

విద్యాపతి భారతీయ సాహిత్యకారులలో తనకుతానే సాటియైన అగ్రశ్రేణికి చెందినకవి. ఆర్యావర్తం అంతటా సంస్కృతమే భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే ప్రధానభాషగా పెత్తనం చేస్తున్నకాలంలో ఈ మహాకవి తన ప్రాంత ప్రజనులు నిత్యవ్యవహారంలో మాటాడుకొనే మైథిలీ భాషనే మధుర మోహనమైన తన కవితారచనకు ఆలంబంగా వాడుకొన్నాడు. ఆయన రచనల ద్వారా మైథిలీ మాండలికానికి ఉత్తమసాహిత్యభాషకు కావలసిన అర్థపుష్టి, భావగాంభీర్యమూ కలిగాయి. తరువాతి తరపు కవులనెందరినో అనుకరణకు ప్రోత్సహించే అందాలను ఆయన తన కవితలో కూర్చాడు. ఆర్యావర్తంలో ఆయనకు చుట్టుపక్కల ప్రాంతాలలో అటుతర్వాత వచ్చిన సాహిత్య రీతులలో ఆయన కవితా మాధుర్య నైపుణ్యాల ప్రభావానికి లోనుగాని రచనలే లేవు. మైథిలీకోకిల అనే బిరుదానికి ఆయన అన్నివిధాలా అర్హుడు. ఆ కోకిల ఈశాన్య భారతంలోని ఆధునికభాషా కవితోపవనాలలో అనేక మధురకుహూరుతాలని పలికించింది.

2

విద్యాపతి ప్రాచీన మిథిలా ప్రాంతపు (ప్రస్తుత బీహార్‌లోని) దర్భంగా జిల్లాకు చెందిన మధుబనీ తాలూకాలోని 'బిసపి' అనేగ్రామంలో అయిదుతరాలు మించి విఖ్యాతి చెందిన మైథిలీ విద్వత్సమాజంలోని రాజకీయ తంత్రజ్ఞుల కుటుంబంలో క్రీ.శ. 1350లో జన్మించాడు.

అత్యంత ప్రాచీనకాలంనుంచీ మిథిలాప్రాంతం మేధావులకు విద్వచ్చర్చలకు పేరుపడింది; కాని, గౌతమబుద్ధుని కాలంనుంచీ రాజకీయంగా మగధ సమ్రాట్టుల సామంతరాజ్యంగా ఉండేది. గుప్తవంశపురాజులకు తర్వాత సాహసికులైన అనేక రాజన్యులకు భారతదేశం యావత్తూ నాల్గు దిక్కులా జైత్రయాత్ర (వీలైనంతవరకు) చేసి, అశ్వమేధయాగం చెయ్యడమే ఆదర్శమైపోయి, గంగను దాటి, ఆనాటి వారిప్రపంచపు ఉత్తరసీమ అయిన హిమాలయాలను చేరుకోవడం

కోసం దారిలోని మిథిలపైని పరాక్రమం చూపించి, దాడిచెయ్యడం తప్పనిసరి అవుతూవచ్చింది. మిథిలనుపాలించిన ఏరాజూ ఆభూమికి చెందినవాడు కాకపోవడంతో, ఆ రాజ్యానికి శాంతి కరవైపోతూ ఉండేది. రాజకీయచరిత్ర కల్లోలమయంగా సాగిపోతూ ఉంటే మిథిలాప్రాంతపు సాంస్కృతిక వ్యక్తిత్వం ఎంతమాత్రమూ చెక్కుచెదరలేదు. నిరంతరాయంగా, నిరాటంకంగా ప్రజల సాంప్రదాయిక జీవనం సాగిపోతూ ఉంటే రాజకీయపు మార్పులను అంతగా లక్ష్యపెట్టని మైథిలీ జీవనవిధానమే దానికి కారణము. మైథిలీ ప్రజలు సాహిత్యకళాపోషకులని చెప్పలేము. అందుచేతనే అక్కడ పుట్టిన కవి పండితులు ఇతర రాష్ట్రాలకు పోవలసివచ్చింది.

బౌద్ధం పునరుజ్జీవిత హిందూధర్మంలో లీనమై, చాతుర్వర్ణ్య విభజనం విస్పష్టంగా పునః ప్రతిష్ఠితం కావడంతో వైదిక బౌద్ధవాదాల మధ్య వైషమ్యం అణగిపోతూ ఉండిన కాలంలో కర్ణాటకులు మిథిలలో ఏలుబడిని ఏర్పాటుచేసుకున్నారు. సామాజిక జీవనవిధానంలో కొత్తప్రమాణాలను గుర్తించడంతో పాతపద్ధతులంతరించి, కొత్తధర్మాలుచోటుచేసుకొంటూ వచ్చాయి. ప్రాచీన ధర్మసూత్రాలను మారిన కాలపు అవసరాలకు అనుకూలమైన నూతనవ్యాఖ్యలతో అవలంబించేవారు. ఇంకొకపక్క, మహమ్మదీయులు పశ్చిమంనుంచి క్రమంగా తూర్పునకు వ్యాపిస్తూంటే, ఆర్యావర్తంలోని ఒకరాజ్యం తరువాత మరొకరాజ్యం వారి సాహసిక మతపరివర్తన పూర్వకమైన దాడులకు తలఒగ్గుతూ లొంగిపోతూ ఉంటే, కర్ణాటకులు మిథిలలో స్థిరపడేనాటికి వెనువెంటనే ఆర్యావర్తం అంతా మహమ్మదీయులకు దాసోహం అంది. ఉదారాశయులూ, ప్రజాహితైషులూ అయిన కర్ణాటరాజుల ఏలుబడిలో మైథిలీ సమాజపుపెద్దలు తమ సామాజిక సాంస్కృతిక మూలవిధానాలు చెక్కుచెదరని ఏర్పాట్లు కట్టుదిట్టాలు చేసుకొని మహమ్మదీయులదాడివల్ల హాని జరగకుండా చూచుకొన్నారు. ఒక్కొక్కకులానికి, వర్ణానికి, వ్యక్తికి నడవడిక, ఒండొరులపట్ల వ్యవహరించే విధులు ఈ రీతిని ఉండవలెనని శాసిస్తూ, ధర్మశాస్త్రములు కూర్చబడినవి. ఈ శాస్త్రముల ద్వారా వచ్చిన మార్పులు సామాజిక జీవితంలో ప్రతిపర్వాన్నీ పూర్తిగా రూపుమార్చినా, ప్రాచీన సూత్రాలకిచ్చిన కొత్తవ్యాఖ్యలే ఈ మార్పులకు దారితీయడంచేత, మార్పులో క్రమపరిణామమేకాని, హఠాత్ విప్లవమని అనిపించలేదు. ప్రాచీన మౌలికసంస్కృతి సూత్రాలతో ఒక పారంపరిక క్రమపరిణామము నామమాత్రముగానైనా కనబడుతూ వచ్చింది.

విద్యాపతి వంశస్థులను ఠాకూరులంటారు. అంతేరాజులనుండి భూము లను ఇనాములుగా పొందిన మైథిలీ బ్రాహ్మణకుటుంబం! ఈ కుటుంబంవారు కాశ్యపగోత్రికులు. శుక్లయజుర్వేదులయిన మాధ్యందిన శాఖకు చెందినవారు. ఈ కుటుంబం ఆదిలో దర్భంగాకు 16 మైళ్ళు వాయవ్యదిశలో ఉండిన 'బిసపి' గ్రామంలోనే తలయెత్తింది. ఈ గ్రామం ఇప్పటికీ మూడుపువ్వులూ ఆరుకాయ లుగా సాగుతోంది. విద్యాపతి జన్మించిన రోజులలో ఆయన వంశంవారు ఆ గ్రామంలోనే ఉండేవారు అందుచేత ఆ కుటుంబం వారిని 'బిసాయిబర్ బిసపి' అంటారు. మైథిలీ సంస్కృతికి, పవిత్రగ్రంథ రచనకి ప్రసిద్ధిపొంది, కర్ణాటక రాజుల కొలువులో విశ్వసనీయమైన, బాధ్యతాయుతమైన ఉన్నతపదవులను అలం కరించిన విద్వద్రాజకీయ ధీమంతులకు ఆలవాలం ఈ వంశం! విద్యాపతికి ఆరు తరాల ముందరివాడయిన కర్మాదిత్యుడు మైథిలీపాలకులకు మంత్రిగా చేరినాడట; ఆయన కుమారుడు దేవాదిత్యుడూ, మనుమడు వీరేశ్వరుడూ, ముని మనుమడు చండేశ్వరుడూ సంధివిగ్రహ నిపుణులయిన మంత్రులుగా మైథిలీరాజుల కొలువులో పనిచేశారు. దేవాదిత్యుని మరియొక కుమారుడయిన గణేశ్వరుడు సామంతరాజుల మండలికి అధ్యక్షుడుగా మహాసామంతాధిపతి అనే పదవిని నిర్వహించి, మహా రాజాధిరాజ బిరుదము వహించినాడు. విద్యాపతి రచించిన 'పురుషపరీక్ష'అనే గ్రంథంలో వీరేశ్వర, గణేశ్వరులను గురించిన గాథలలో, గణేశ్వరుడు గొప్ప జ్ఞానిగా భారతదేశపు ప్రఖ్యాతిగాంచిన వాడని తెలుస్తుంది. భావాదిత్యుడనే దేవాదిత్యుని తమ్ముడు ప్రసిద్ధరాజపురుషుడుగాను, వీరేశ్వరుని సోదరులూ, సవతితమ్ములూ, కోశరక్షకుడూ, వినిమయ శాఖాధ్యక్షుడూ, రాజముద్రారక్షకుడూ వంటి ఉన్నతోద్యోగాలను నిర్వహించిన వారనీ తెలుస్తుంది. సామవేదా ధ్యాయు లైన ఛాందోగ్యులు నిర్వర్తింపవలసిన కర్మకాండని వివరిస్తూ వీరేశ్వరుడు రచించిన 'పద్ధతి' అనే గ్రంథమూ, ఆయన మూడవసోదరుడయిన గణేశ్వరుని కుమారుడు రామదత్తుడు రచించిన శుక్లయజుశ్శాఖీయులైన వాజసనేయుల కర్మకాండ వివరణముతో కూడిన మరొక 'పద్ధతి' మిథిలాప్రాంతములో నేటి వరకూ కూడా ఆయాశాఖీయుల నిష్ఠా నియమాలను శాసిస్తున్నాయి. మిథి లలో ఈనాటికికూడా చాలమంది బ్రాహ్మణ వర్గీయుల శ్రాద్ధకర్మవిధాన మును వివరించే 'సుగతిసోపానము' అనే గ్రంథము మొదలుగా ఎన్నో స్మృతులను గణేశ్వరఠాకూరే రచించాడు విద్వత్తులో అందరినీ మించిన ప్రశస్తి పొందినవాడు వీరేశ్వరుని కొడుకయిన చండేశ్వరుడు. ఆయన ఏడుభాగా

లుగా విభక్తమైన 'రత్నాకర' అనే స్మృతిసారమయిన ధర్మశాస్త్రగ్రంథం రచించారు. ధర్మశాస్త్ర నిర్ణయాలతోను కర్మకాండ విధానాలతోను నిండిన యీ గ్రంథం కడచిన ఆరుశతాబ్దాలుగా మిథిలా సమాజ ప్రజాజీవితానికి శిరోధార్యమై, అనుసరించబడుతూ ఉంది. ఈ ఏడు రత్నాకరములను మాత్రమే కాక, చండేశ్వరుడు సంకలనము చేసిన 'రాజనీతి రత్నాకరము' 'ఒయినబర' వంశీకులయిన మిథిలాపరిపాలకులకు అన్నివిధాలా ఆలంబనం అయింది. వారు ఢిల్లీసమ్రాట్టులకు సామంతులుగా తల వంచినందుకు, బ్రాహ్మణులు కావడంచేతను, పట్టాభిషేక అధికారం స్వతః లేనివారు కావడంచేతనూ మొదటిలో మిథిలాప్రజ'ఒయినబర' వంశీకులను రాజులుగా గుర్తించకపోవడంచేతను, ఈ రాజనీతిరత్నాకరం వారికి పట్టాభిషేకమునకు అర్హతను, ప్రసాదిస్తూ, రాజులుగా గుర్తింపు కలిగేటట్లు చేసింది. మారిన దేశకాలపరిస్థితులలో తేలిన యథార్థస్థితులను గుర్తించి, చండేశ్వరుడు అద్భుతంగా ప్రకటించిన నిర్ణయాలు, శతాబ్దుల సంఘర్షణలకు, ప్రయాసలకు తట్టుకొని ఈనాటివరకు నిలదొక్కుకొన గలిగిన ఒక నూతన సమాజమునకు పునాదులు వేశాయి. ఈ పునరుజ్జీవనకాలంలో దేశప్రజల జీవిత విధానాన్ని దిద్దితీర్చి ఒక రూపాన్నిచ్చిన విద్వద్రాజనీతిజ్ఞులలో ఒకడుగా చండేశ్వరుడు ప్రశస్తిపొందాడు. విద్యాపతి అదేస్వర్ణయుగానికి చెందిన అపరూప ప్రతిభాశాలి; శాశ్వతప్రేమ గాయకుడైన అమరజీవి, మనిషిగా రాజనీతిజ్ఞ మనీషిగా పూర్ణపురుషుడుగా ఖ్యాతిని పొందిన చిరస్మరణీయుడు!

3

మిథిలలో అటువంటి సాంఘిక, వైదుష్యక్షేత్రాలలో గొప్ప పునరుజ్జీవనం నెలకొంటున్న కాలంలో విద్యాపతి జన్మించాడు; అటువంటి సాంస్కృతిక పునరుత్థానానికి కారకులైన కులపతుల వంశాంకురంగా ఆయన జన్మించాడు; నాలుగు తరాలకు చెందిన ఏడుగురు 'ఒయినబర' వంశీయులైన రాజులతోను వారి ఆస్థానంతోను నిరంతర సన్నిహిత సంబంధం కలిగి, (రాజకీయ, సాహిత్య, సాంఘికరంగాలలో) చరితార్థమైన సేవచేశాడు! ఆయన కృతులు తన కాలపు ఆలోచనాశయములను ప్రతిబింబించే చక్కని ఆదర్శప్రాయములు; వాటి అన్నిటికి 'ఒయినబర' రాజుల ఆస్థానములలోని సంఘటనలే కారణములు, ఉద్బోధకములు!

'ఒయినబర' రాజుల చరిత్ర మిథిలలోనే అంతబాగా తెలియదు. అందుచేత, 'ఒయినబర' వంశీయులైన మిథిలరాజుల చరిత్రను క్లుప్తంగా సంస్మరిస్తే తద్వారా విద్యాపతి జీవితవిశేషాలు, ఆయన రచనా వ్యాసంగములు చక్కగా అవగాహన కావడానికి వీలు!

క్రి.శ. 1323 లో హరిసింఘదేవుని పరాజయంతో మిథిలారాజ్యంలో కర్ణాటక రాజుల పరిపాలన ముగిసి, రాజ్యపాలనా బాధ్యతను కామేశ్వర ఠాకూర్‌కు అప్పగించారు; కాని, 'ఒయినబర' రాజులు కొంతకాలంవరకు అధికారార్హతగల వారుగా గుర్తింపబడలేదు కామేశ్వరుని తరువాత అతని పెద్ద కొడుకు భోగీశ్వరుడు రాజ్యాధికారం స్వీకరించాడు; కాని కామేశ్వరుని తమ్ములలో చిన్నవాడయిన భావసింఘు—భోగీశ్వరుని అధికారాన్ని సవాలు చేసి, రాజ్యమును రెండువాటాలుగా పంపకం చేయించాడు. ఈ రెండు శాఖలవారికి కొన్ని తరాలు ప్రత్యర్థిత్వం కొనసాగింది. భోగీశ్వరుడు అల్పాయుష్కుడు కావడం వల్ల, అతనికొడుకు గణేశ్వరుడు రాజ్యానికి వచ్చాడుకాని, లౌకిక శకం 252*లో భావసింఘు ఠాకూర్ కుమారుల కుట్రలవల్లా విద్రోహంవల్లా హతుడయినాడు. గణేశ్వరుని కొడుకులు వీరసింఘు, కీర్తిసింఘు ఠాకూరులు పారిపోయి, దేశదేశాలు తిరిగి, చిట్టచివరికి జౌన్‌పూర్ పాలకుడయిన ఇబ్రహీంషా వద్దకు చేరుకొని, తమ తండ్రి హత్యకు పగదీర్చుకొనడానికి, న్యాయంగా తమకు రావలసిన రాజ్యపాలనాధికారం సంపాదించడానికి సహాయం అర్థించారు. ఈలోపున భావసింఘు ఠాకూర్ రాజ్యమంతా తన ఏలుబడిలోనికి తీసుకొని, కులవృద్ధుడైన చండేశ్వరుని ఆశీస్స్పహకారాలతో 'తిరుహూత్‌రాజా' అనే బిరుదూ, రాజవంశప్రతీకగా 'సింఘు' అనే బిరుదునూ స్వీకరించాడు. మిథిలారాజ్య పారంపరిక చరిత్రలో 'ఒయినబర' వంశపు రాజులలో రాజబిరుదప్రథమగణ్యుడు భావసింఘు ఠాకూరే!

భావసింఘుకు తరువాత అతని కుమారుడు దేవసింఘు రాజయాడు కాని, తమ దాయాదులతో సాగుతూవచ్చిన కుటుంబకలహం వల్ల ఏర్పడిన పరిస్థితులు నచ్చక, రాజ్యాధికారాన్ని 16 ఏళ్ళ వయస్సుగల తన కుమారుడు శివసింఘుకు అప్పగించి, తాను నైమిశారణ్యం (కాన్పూరు వద్ద నింసార్)లో వానప్రస్థ జీవితం గడపడానికి వెళ్ళిపోయాడు. శివసింఘు-ధీరోదాత్తుడైన రాజుగా, శక్తిమంతుడుగా, ప్రజాహితైకమతిగా, స్వతంత్రుడుగా, వంగదేశంలోనీ, పాట్నాలోనీ మహమ్మ

L: Sam Year 252.

దీయ నవాబులతో ఎన్నో యుద్ధాలు చేసి పేరుకెక్కాడు. లౌకికశకం 298 వ సంవత్సరం దేవసింఘ చనిపోయిన తరువాత శివసింఘ తన రాజ్యాధికారాన్ని స్పష్టంగా ప్రకటించాడుగాని, మూడున్నర ఏళ్ళు మాత్రమే ఆ ఏలుబడి సాగింది. లౌకికశకం 296-297 సంవత్సరంలో శివసింఘ అప్పటికే గణేశ్వరుని హత్యకు పగదీర్చుకోడానికి తిరుహూత్ చేరుకొన్న కీర్తిసింఘతోను, బహుశా అతనికి సహాయంగా వచ్చిన జౌన్‌పూర్ సుల్తాన్ ఇబ్రహింషాతోను యుద్ధం చేయవలసి వచ్చి ఉండెను. ఈ యుద్ధంలో శివసింఘ పరాజితుడయాడు కాని, ఆ తరువాత అతడు సజీవుడో, మృతుడో తెలియకుండా పోయింది. జయలక్ష్మి వరించిన నవాబు తిరుహూత్ రాజ్యం ఢిలీ సామ్రాట్టుకు కాకుండా, జౌన్‌పూరు నవాబుకు సామంత రాజ్యంగా ఉండే ఒప్పందంతో సంతృప్తుడై వదలి వెళ్ళిపోయాడు. కాని, శివసింఘ భార్యలు మాత్రం తమంత తాము అజ్ఞాతవాసంలోకి వెళ్ళి, నేపాలులోని సప్తరి రాజ్యపాలకుడయిన పురాదిత్యుని రక్షణలో ఉంటూ, 12 ఏళ్ళవరకు, జాడ తెలియకుండాపోయిన తమ భర్త తిరిగి రాగలడని ఎదురు చూశారు. కాని, ఆ తర్వాత శాస్త్రోక్తంగా అపర కర్మలు మాత్రం జరిపించారు. ఈ కాలంలో తిరుహూత్ రాజ్యాన్ని శివసింఘకు తమ్ముడయిన పద్మసింఘ, ఆతడు చనిపోయాక, అతని భార్య విశ్వాసదేవీ, పరిపాలించారు. లౌకికశకం 309 లో శివసింఘకు అపరకర్మలు జరిపించినపుడు అతని భార్య సహగమనం చేసింది; రాజ్యాధికారం తదనంతర పురుషవారసుడయిన (అప్పటికి వృద్ధుడు ముందటితరంలోని భావసింఘకు మరొక భార్య ద్వారా జన్మించినవాడూ అయిన) కనిష్ఠ పుత్రుడు హరసింఘను వరించింది. అతని తరువాత అతని కుమారుడు నరసింఘ రాజయినాడు కాని, తిరిగి వారసత్వపు పోటీ వచ్చింది. నరసింఘ తరువాత అతని పెద్దకొడుకు ధీరసింఘ రాజ్యానికి వచ్చాడు, కాని ఆతని తరువాత అతని కనిష్ఠ సోదరుడు భైరవసింఘ రాజయినాడు కాని ధీరసింఘ కుమారుడు కాలేదు లౌకికశకం 320 ప్రాంతంలో విద్యాపతి చనిపోయినాడు; అప్పటికి తిరుహూత్ రాజు ధీరసింఘ; శివసింఘ జాడ తెలియకుండాపోయి 32 ఏళ్ళయింది.

విద్యాపతి స్పష్టంగా ఎప్పుడు జన్మించాడో మనకు తెలియదు. తన తండ్రి చనిపోయేనాటికి ఏబదిఏళ్ళవాడయిన శివసింఘకంటె విద్యాపతి 2 ఏళ్ళు పెద్ద అని అంటారు. శివసింఘ తండ్రిపోగానే లౌకికశకం 293 (శకసంవత్సరం 1324 అనగా క్రీ.శ. 1402) చైత్ర బహుళ షష్టి గురువారం నాడు రాజ్యాధికారం

స్వీకరించాడు. అందుచేత, విద్యాపతి క్రీ. శ 1350 ప్రాంతంలో జన్మించి ఉంటాడు అని చెప్పవచ్చు. అంటే కర్ణాటకరాజుల వంశం అంతరించి 27 ఏళ్ళు అయి ఉండాలి; జ్యోతిరీశ్వరఠాకూర్ రచించిన వర్ణన రత్నాకరం వెలువడి 23 ఏళ్ళు అయి ఉండాలి కనుక, గణేశ్వరుడు విద్రోహపూర్వకంగా చంపబడి, తిరుహూత్ రాజ్యం అంతా భావసింఘు ఏలుబడిలోనికి వచ్చేనాటికి విద్యాపతి సుమారు 10 ఏళ్ళ బాలుడయి ఉండాలి. తనకు పినతాత అయిన చండేశ్వర ఠాకూర్ ఇంకా బ్రతికి ఉండగానే విద్యాపతి జన్మించినట్లు కనబడుతుంది.

మహావార్తిక నైబంధకుడని ప్రసిద్ధి పొందిన ధీరేశ్వర ఠాకూరుకు విద్యాపతి ప్రపౌత్రుడు; అయితే, ఈ నైబంధకుని రచనలేవీ ఈ నాడు లభించ లేదు. చండీశ్వరుని తండ్రియైన వీరేశ్వరునికి, చిట్టచివరి కర్ణాట రాజునకు అమాత్యధీమంతుడని పేరుపడినగణేశ్వరుడికి సోదరుడు ఈ ధీరేశ్వరఠాకూరు. పురుషపరీక్ష అనే (విద్యాపతి) గ్రంథంలో వీరేశ్వర గణేశ్వరుల గాథలు వర్ణితము లయినాయి. ధీరేశ్వరుని కొడుకు జయదత్తు, ఆయన కుమారుడు గణపతి మన విద్యాపతికి తండ్రి!

వర్ణన రత్నాకర గ్రంథకర్తా, ధీరేశ్వరుని కుమారుడూ అయిన కవిశేఖర జ్యోతిరీశ్వరుడు, మన విద్యాపతి పితామహుడైన జయదత్తుని సోదరుడేమో అని చాలామంది భ్రమించడానికి జయదత్తుని తండ్రి పేరు కూడా ధీరేశ్వరుదే కావడము కారణము! కాని అది తప్పు! ఎందుకంటే, జ్యోతిరీశ్వరుని తండ్రి యైన ధీరేశ్వరుని తండ్రి పేరు రామేశ్వరుడు. వారి గోత్రం వాత్స్యన గోత్రం! కాగా, విద్యాపతి ప్రపితామహుడైన ధీరేశ్వరుడు దేవాదిత్యుని కుమారుడు; వారిది కాశ్యపసగోత్రం! అదే విధంగా, విద్యాపతికి తండ్రియైన గణపతీ–గంగాభక్తి తరంగిణీ గ్రంథకర్తయైన గణపతీ ఒకరే అని కొందరనుకోవడం కూడా పొరపాటే! విద్యాపతి తండ్రియైన గణపతి తండ్రి జయదత్తుడుకాగా, గంగాభక్తి తరంగిణీ కర్త తాను ధీరేశ్వరుని కుమారుడనని వ్రాసికొన్నాడు. మిథిలలో విద్యాపతి పేరు కూడా తరతరాల వినబడుతుంది. ఠాకూర్ ఉపనామంకల విద్యాపతులు చాలమంది గ్రంథకర్తలే కనిపిస్తారు. వారిరచనలు కూడా ఈనాటికి మనకి లభిస్తూంటాయి. అందుచేత, విద్యాపతి చరిత్ర పరిశోధనలో ఆ పేరుమాత్రం తీసుకొని, ఆయనే మన కవి విద్యాపతి అని పూర్వపక్షం చెయ్యడానికి వీలులేని సాక్ష్యం దొరికే వరకు నిర్ణయించడానికి వీలులేదు. ఇందులో చాలా చిక్కులు

వస్తాయి; వాటిని మెలకువగా విడదీసుకోకపోతే. గంగాభక్తి తరంగిణీ కర్తతోను, వర్ణన రత్నాకర కర్తతోను, వచ్చిన నామసామ్యపు చిక్కులు వచ్చి, అసందర్భపు నిర్ణయాలకు దారితీయగలవు.

విద్యాపతి తన వంశకర్తలకు తరతరాలుగా స్వగ్రామమైన 'బిసపి'లో జన్మించాడు. ఆ కాలంలో జరిగిన మైథిలీ నవ సమాజ నిర్మాణ చరిత్రలో విద్యాపతి వంశకర్తల మూలస్థానముగా 'బిసపి'కే ప్రాముఖ్యం యిచ్చినందువల్ల ఆ వంశానికి 'బిసయిబర' అనే ఖ్యాతి వచ్చింది. విద్యాపతి తన జీవితమంతా 'బిసపి'లోనే గడిపాడు; అంతేకాక, శివసింఘ సింహాసనాధికారం స్వీకరించిన శుభసమయంలో రాజు, విద్యాపతి తమ రాచరికంవారికి చేసిన సేవలకు కృతజ్ఞతతో 'బిసపి' గ్రామాన్ని ఆ రాజాస్థానపండితునికి (విద్యాపతికి) ధారాదత్తం చేశాడు. ఇప్పటికి 300 ఏళ్ళ క్రితం మధుబనికి దగ్గరగా ఉండిన సౌరత గ్రామానికి వలసపోయిన విద్యాపతి వంశస్థులు అప్పటివరకు అరణగ్రామమయిన బిసపిలోనే కాపురం ఉండినారు. ఇప్పటికి వారు సౌరతగ్రామంలో ఉన్నారు. 'బిసపి' గ్రామం బ్రిటిషువారు మనదేశానికి వచ్చినంతవరకు విద్యాపతి వంశీకుల అనుభవంలో ఉన్నది,

'బిసపి' గ్రామానికి 'గఢ్' అనే వ్యవహారం ఉండేది. 'గఢ్' అంటే దుర్గం అన్న మాట. అంటే, తరతరాలుగా రాజనీతిజ్ఞులుగా రాజమాన్యతా ప్రజా గౌరవమూ పొందిన విద్వత్కుటుంబానికి నెలవుగనుకను, ఆ వంశజులలో అంతా అగ్రశ్రేణికి చెందిన విద్వాంసులే; సంస్కృతి పీఠంగా అందుచేత ఆ గ్రామానికి 'దుర్గం' అనే గౌరవం రావడం సహజమే! ఆ వంశపువారి బిరుదమైన ఠాకూర్ అనేది కూడా రాజమాన్యతవల్ల ధారాదత్తమైన మాన్యములుగల భూస్వామిత్వమును స్ఫురింపజేస్తుంది; అంతేకాక ఆ వంశకర్తలలో అధమం ఒక్కడైన గణేశ్వర ఠాకూర్ మహాసామంతాధిపతి అనే పదవిని అలంకరించినట్లుగా అ వంశస్థులను గురించిన వ్రాతలలో తరచుగా కనబడుతుంది.

తిరుహుత్ రాజులకు అత్యంత సన్నిహితంగా మసలే కుటుంబంలో పుట్టిన విద్యాపతి కొత్తగా నెలకొన్న రాజకుటుంబ పరివారంలోకి చాలా సులభంగానే ప్రవేశాన్ని సంపాదించి ఉంటాడు. 'ఒయినబర' రాజులు తిరుహుత్ రాజ్యాన్ని పాలించిన మొదటి శతాబ్దంలో చాలా ప్రముఖపాత్రను వహించిన రాజకుమారులైన కీర్తిసింఘ, శివసింఘ, పద్మసింఘ, హరసింఘ వంటి వారితో

సమ వయస్కుడైన విద్యాపతి వారి బాల్యక్రీడలలో పాల్గొని ఉంటాడు. అయితే ఆ రాకుమారులందరిలోను శివసింఘుతో మాత్రం ప్రత్యేకాకర్షణ ఏర్పడి విద్యాపతి అతనికి ప్రాణమిత్రునిగా, మనస్సు కలిసిన సలహాదారుగా, శాశ్వత సహచరుడుగా, విశ్వసనీయుడైన రాజకీయోద్యోగిగా నడుచుకొన్నాడు. వారిద్దరి సాహచర్యము ఆ యుగపు చరిత్రకు, ముఖ్యముగా మైథిలీ సాహిత్యవికాసానికి ఒక విశిష్ట వరాన్ని ప్రసాదించింది. శివసింఘ రాజా ఉదారపోషణలో ప్రశంసాపూర్వక ప్రోత్సాహంలో మహాకవియైన విద్యాపతి ప్రతిభ శతపత్ర శోభతో వికసించింది.

విద్యార్థిగా విద్యాపతి అధ్యయనము చేసి ఉండిన సాంప్రదాయిక శాస్త్రాదుల వివరాలుగాని పరిమితిగాని మనకేమీ తెలియదు. ఆయన హరిమిశ్రుడనే ప్రఖ్యాత గురువువద్ద కొన్నాళ్ళు శిష్యరికం చేసినట్లు పారంపరికంగా తెలిసినమాట! ఈ హరిమిశ్రుడు ప్రసిద్ధనైయాయికుడయిన జయదేవమిశ్రునికి పినతండ్రీ, గురువు కూడ! ఈ జయదేవమిశ్రుడే పక్షధరుడనే ప్రజ్ఞానామంతో గంగేశుని తత్త్వచింతామణి అనే గ్రంథానికి 'ఆలోకం' అనే భాష్యం వ్రాసి, అందులో తన గురువును పినతండ్రినీ గురించి ప్రశంసించాడు. విద్యాపతి ఏ గురువువద్దా ఎక్కువ కాలం గడిపినట్లు కనబడదు. ఎందుకంటే, క్రి.శ. 1368లో రాజకుమారుడైన శివసింఘును రాజ్యరక్షకుడుగా నియమించి, నైమిశారణ్యానికి వానప్రస్థానానికి వెళ్ళిపోయిన దేవసింఘురాజా పరివారంలో నైమిశారణ్యం విద్యాపతి కూడా చేరుకొన్నట్లు అప్పుడే అక్కడ విద్యాపతి తన ప్రథమ గ్రంథం 'భూపరిక్రమం' అనేదాన్ని రచించాడని తెలుస్తోంది. ఇది పద్యగద్యములతో కూడిన సంస్కృత చంపూ కావ్యము! పౌరాణిక పద్ధతిని సాగిన రచన! నైమిశారణ్యమునుండి తిరుహూత్‌కు పోయే ప్రయాణమార్గమును వర్ణిస్తూ మధ్య మధ్య ఎనిమిది కథలను చొప్పించిన స్థలపురాణం అది. దానికొక కృత్యాది అవతారిక కూడా ఉంది. ఇన్నిటితోను కూడిన ఈ రచన అంతా విద్యాపతి తరువాత రచించిన 'పురుషపరీక్ష' అనే గ్రంథంలో ఒక భాగంగా యథాతథంగా చేర్చుకొన్నాడు! అయితే పురుషపరీక్షలో పౌరాణికధోరణి కనబడదు. 'భూపరిక్రమ' అవతరణికలో అరవైయైదు దేశాలను గురించి వర్ణిస్తూ, 65 గాథలను చెప్పగలనని చేసిన వాగ్దానము ఎనిమిదిదేశాల వర్ణనమును ఎనిమిదిగాథలను దాటి పైకి పోలేదు. ఈ దేశవర్ణనలూ, ఈ గాథలూ, పౌరాణికపద్ధతిని కాకపోయినా 'పురుషపరీక్ష' గ్రంథంలో అవే మాటలతో చెప్పి ఉండడం చేతనూ, నైమిశా

రణ్యం నుంచి తిరుహూత్ వరకుగల ఎనిమిది దేశాలకు పైగా వర్ణించి 'భూపరిక్రమం' గ్రంథం పూర్తి చేసే అవకాశం లేకపోవడానికి కారణం, నైమిశారణ్యంలో విద్యాపతి మరికొంత కాలం ఉండక పోవడమూ, ఆ ఎనిమిది దేశాలనుమించి మిగిలిన దేశాలకు ప్రయాణం చేసే అవకాశం లభించక పోవడమూ కావచ్చు. వెంటనే యువరాకుమారుడైన శివసింఘుకు ఆంతరంగిక సచివుడుగా తిరుహూత్ రాజకీయాలలోనికి తలమునకలుగా ప్రవేశించడానికి ఆయనకు పిలుపు వచ్చింది.

విద్యాపతి గురుముఖతః నేర్చుకొన్న విద్య ఆయనకు తెలిసినంతలో ఏకొద్ది భాగమోమాత్రమే అయి ఉండాలి. ఆ యుగం మిథిల అంతటా విద్వత్తరంగాలు పరవళ్ళు తొక్కుతూండిన కాలం; ఆర్యావర్తం అన్ని ప్రాంతాలనుండీ సంస్కృత విద్యలో వివిధశాస్త్రాలను విశిష్టంగా అధ్యయనం చెయ్యడానికి మిథిలకి వస్తూండే వారు. విద్యాపతివంటి క్రియాశీలియైన కవీశ్వరుని ఏ ప్రత్యేక విద్యా తన సంకుచిత పరిధిలో బంధించి ఉంచజాలదు. బుద్ధి సూక్ష్మతా, సునిశితమైన గ్రహణ శక్తికల విద్యాపతికి అక్షరప్రపంచమునుండి గ్రహించిన దానికంటె తన చుట్టూగల విశాలజగత్తునుండి నేర్చుకొన్నదే అపారము! ఆయన స్వగృహమే ఒక అపరూప విద్యాకేంద్రమూ, సారస్వత జ్యోతిర్నిలయమూ! దేశం అన్నిపక్కలనుండి విద్యాంసులు అక్కడచేరుకొని, శాస్త్రవిషయములు, ధర్మసూక్ష్మములు, రాజనీతి, సాంఘిక ప్రమాణములు మున్నగువాటిని చర్చించేవారు; విద్యాపతికి నిత్యమూపీల్చే ప్రాణ వాయువుతోపాటు అన్ని విద్యలూ కరతలామలకమయ్యేవి! ఇతరులు సమర్థులైన గురువులవద్ద అత్యంత పరిశ్రమతో పొందగలిగిన అనేక అపూర్వ విషయాలను గురించిన జ్ఞానం తన ఇంటిలోని సారస్వతపరిసరంలో విద్యాపతికి అప్రయత్నంగా అవలీలగా లభించేది. అంతేకాక ఆయన మనస్సు చాలా చురుకయి, నిత్యకుతూహలితమై ఉండడంచేతను, నిత్యశోధనశీలి కావడంచేతను ఆయన గ్రహణధారణలకు ఎటువంటి విషయమైనా ఇట్టే వశమైపోయేది. ఆయన ఆదరపాత్ర విషయాల అవధి అపరిమితము; సర్వంకషము, జీవితంపైని అతని దృక్పథం ఉదారము! ప్రాథమికాంశములలో అవసరమైన శిక్షణ పూర్తి కాగానే శాస్త్ర విషయాలలో గహనమైన అంశాలను గ్రహించే శక్తి ఆయనకు వశం కావడంతో విద్యార్థి జీవితపునిష్ఠురాలను విడిచిపెట్టి ఆదర్శప్రాయమైన, తన వంశ పారంపర్య వ్యావృత్తిని చేపట్టి తన రాజ్యమునకు ప్రజలకు సేవచేయడానికి కంకణం ధరించాడు.

అయితే విద్యార్థి దశతోపాటు ఆయన అధ్యయనదీక్ష ఆగిపోలేదు. జీవిత మంతా నిరంతరాయంగా స్వాధ్యయనం సాగుతూ ఉండినట్లు వార్ధక్యంలో వెలు వడిన ఆయన గ్రంథాలలోని ఉల్లేఖనాలను బట్టి తెలుస్తుంది. మహాభారత రామా యణాలు, పురాణాలు, ఆగమాలు, తంత్రాలు, ధర్మశాస్త్రాలు నిబంధగ్రంథాలు, కావ్యనాటక సాహిత్యానికి తోడు ఆయన ఎంతగా పఠించి ఉండాలో తెలిపే ప్రతి ధ్వనులు ఆయన గేయకవితలో అడుగడుగునా వినిపించడంకద్దు. అదీగాక, ఆయన రాజాశివసింఘ స్థానంలో రాజపండిత పదవిని అలంకరించినందువల్ల ఆస్థానానికి వచ్చే కవిపండితులందరితోను అయనకు సన్నిహిత సంపర్కంఉండేది. చురుకైనమనస్సూ, సుదృఢమైన ధారణాశక్తిగల విద్యాపతి చదివినదీ విన్నదీతన రచనలలో సందర్భోచితంగా కావలసినట్లు వినియోగించుకొనేవాడు. అందుచేత ఆయన జ్ఞానసంపద గంభీరమైన విద్వత్తుద్వారా కంటే విస్తృతమూ అపరిమితమూ అయిన అధ్యయనం ద్వారా నెలకొన్నది అని చెప్పాలి. ఒకే అంశంలో పారదర్శి త్వాన్ని సంపాదించే వేత్తలు ఉండే యుగంలో విద్యాపతి విజ్ఞానము బహుముఖ స్ఫూర్తియై లోకవృత్త పరిశీలనలో ఆయన ఉదారబుద్ధిని ప్రకాశింపజేసింది.

అధ్యయనాసక్తికితోడు విద్యాపతికి రచనాసక్తి మిక్కుటంగా ఉండేది. కీర్తిలత అనే తన గ్రంథంలో విద్యాపతి అంటాడు:

"అక్షరస్తంభములపైన అర్చా పీఠమొకటి నిర్మితము కానిచో
కీర్తిలతిక ముల్లోకముల నల్లుకొనగ ముచ్చటపడునా?"

తన పితృపితామహాదులు నిరంతర రాజకార్యమగ్నులైనా విఖ్యాత రాజనీతిజ్ఞులైనా విఖ్యాత గ్రంథ రచయితలుగా ఏ మాత్రము తీసిపోని కీర్తి గడించినవారు కావడంవల్ల, విద్యాపతికి బాల్యమునుండి కూడ గ్రంథ రచన ఆదర్శముగా పెంపొందింది. చండేశ్వరుని పరంపరకు చెందినందుకు అతని వలెనే చిన్నవయస్సులోనే అప్పటికే తనకు కరతలామలకమైన సంస్కృత భాషలో రచనలు ఆరంభించిన విద్యాపతి 20 ఏళ్ళు నిండకుండానే సాంప్ర దాయిక పురాణ శైలిలో 'భూపరిక్రమము' అనే తన అభిమాన గ్రంథాన్ని రచించడానికి ప్రణాళిక వేసుకొన్నాడు. ఇందులో స్థలపురాణవర్ణనమూ ఉత్తమ మానవా దర్మమును నిరూపించు నీతికథలనూ జోడించాడు. అయితే 'భూపరి క్రమం' రచించడానికి ముందే 'మణిమంజరి' అనే నాటకం రచించినట్లు తెలుస్తోంది. ఈ నాటకంలో గ్రంథకర్త రచనానైపుణ్యం కొంచెం 'నాట్లు'గా

ఉంటుందిగాని, దానిలో అభిజ్ఞాన శాకుంతలము, ఉత్తరరామచరితం, రత్నావళి వంటి ఉత్తమ నాటకాల ఛాయలు ప్రతిధ్వనించడమే కాకుండా, విద్యాపతి ప్రణయకవితల్లో విస్తృతంగా స్పష్టంగా కనబడే స్త్రీ హృదయా విష్కరణ ద్వారా ప్రకటితమయే విద్యాపతి పరేంగితజ్ఞత విస్మయంగొలుపుతుంది. తనయౌవన వయస్సు నాటినుంచి జీవితపుచరమదశవరకు అతని గ్రంథ రచన కొనసాగింది. అతని చిట్టచివరి రచన 'దుర్గా-భక్తి-తరంగిణి'లో ధీరసింహు ఏలుబడి గురించిన ప్రశంసనుబట్టి, అప్పటికి ఆయనకు ఎనభైయేళ్ళు పైబడి ఉండాలి. అధమం ఒక సహస్రందాకా కనబడే ఆయన గేయకవితలు మినహాయిస్తే, పైగా పంద్రెండుగ్రంథాలు అయన సాహిత్యకృషివల్ల గలిగిన సత్ఫలాలు! అయితే, విద్యాపతి కేవలం గ్రంథకర్త మాత్రమేకాదు; బహుముఖవ్యాపకాలతో జీవించిన ఆయన తన జీవితంలో అత్యధికభాగం తన కాలపు రాజనైతిక సంఘటనలలో చాలా శ్రద్ధాళువై పాల్గొన్నాడు. ఆయన 'కీర్తిలత' అనే తన గ్రంథంలో ''అక్షర స్తంభములపైన ఆర్చాపీఠం నెలకొంటేనే కీర్తిలతిక సర్వవ్యాప్తి పొందగల''దని వ్రాసిన సూక్తి ఆయన వ్యక్తిగత మహదాశయమే; యశఃకాముడై ఆయన గ్రంథరచన చేశాడు; ఆయనకు యశస్సు తన జీవితకాలంలోనే చాలినంత లభించింది; మరణానంతరం మరెంతో!

విద్యాపతి—'ఒయిన బర' రాజుల కొలువులో చేరుకొన్నది దేవసింహు పరిపాలన కాలంలోగాని, అంతకు కొంచెం ముందుగాని జరిగి ఉండాలి. దేవసింహు నైమిశారణ్యంలో వానప్రస్థం ఆరంభించినపుడు ఆయనకు సహచరుడుగా అక్కడ గడపుతూ ఉండిన విద్యాపతి 1370లో శివసింహు తన రాజ్యాధికారాన్ని కట్టుదిట్టంచేసుకొంటూ ఉండిన సమయంలో అతని పిలుపువల్ల తిరిగి తిరుహూత్ చేరుకొన్నాడు. అప్పటినుండి శివసింహుపాలన చివరిదశవరకు విద్యాపతి రాజుకి నిరంతరము సన్నిహితుడుగా అత్యంత భక్తి విధేయతలతో విశ్వసనీయుడైన మిత్రునిగా జ్ఞానియైన ఉపదేశకునిగా సేవించాడు.

ఉద్యోగరీత్యా ఆయన రాజపండిత పదవినిర్వహిస్తూ, ఆగంతుకులు, ఆహూతులూ అయిన కవిపండితులకు ఎదుర్కొలిచ్చి, వారికి తగు సౌకర్య మర్యాదలను, బహుమాన పురస్కారములను ఏర్పాటులు చేసేవాడు. కాని, వాస్తవానికి ఆయన రాజుకు సన్నిహితమిత్రుడూ, విధేయుడైన సలహాదారూ, నిరంతర సహచరుడూ; విశ్వసనీయుడైన రాజోద్యోగి! ఆయనపట్ల రాజుకు పరిపూర్ణ విశ్వాసం ఉండేది,

రాజుపట్ల ఆయన అఖండ గౌరవం కలిగి ఉండేవాడు. సామ్రాట్టయిన నవాబు నకు చెల్లింపవలసిన శిస్తు బకాయి తీర్చలేదని ఒకసారి శివసంఘును నవాబు తాబే దారులు చెరసాలలో ఉంచగా, విద్యాపతి దివానుకొడుకైన అమృతకరునితో కలిసి, నవాబుకొలువుకు వెళ్ళి, కవితా పఠనముతో నవాబును మెప్పించెనట అప్పుడు నవాబు శివసింఘను చెరవిడిపించి, అటువంటి ఉత్తమకవులను పోషి స్తున్నందుకు ఆయనను గొప్పగా సన్మానముచేసి, విద్యాపతిని కవిశేఖర బిరుద ముతో సత్కరించెనట! శివసింఘ సింహాసనం అధిష్ఠించిన సందర్భంలో ఆయన విద్యాపతికి 'బిసపి' గ్రామాన్ని ధారాదత్తంచేసి, అభినవజయదేవ బిరుదంతో సత్కరించాడు. ఆయన తిరిగి రాజధానికి రాకుండా యుద్ధానికి వెళ్లిపోయినపుడు తన ఆరుగురు భార్యలను విద్యాపతి రక్షణలో ఉంచాడు. శివసింఘ రాజాకు విద్యాపతిపైని అంతటి విశ్వాసం ఉండేది. దానికి ఆయన అన్ని విధాలా అర్హుడు.

ఈ విధంగా విద్యాపతి శివసింఘ ఆస్థానంలో కొలువుచేసినకాలం దాదాపు 36 సంవత్సరాలు. మిథిలారాజ్య చరిత్రలో శివసింఘ అంతటి ఖాసమాన రాజ శ్రేష్ఠుడు మరొకడులేడు; శౌర్యవంతుడే కాని దయాళువు; దృఢమనస్కుడే కాని, ప్రజాహితైషువు. మిథిలాప్రజలలో తరతరాల ఆనోటినుండి అనోటికి వ్యాపించిన సూక్తియిది:

'కొలనంటూ ఉన్నది ఒకటే—రజోఖర్,
గోతులే తక్కినవన్నీ—
రాజంటూ ఏలినవాడొక్కడే శివసింఘు,
మిగిలినవారు కుర్రకారుమాత్రం!'

'కీర్తిపతాక' గ్రంథంలోని చివరిశ్లోకంలో విద్యాపతి 'రాజ్యంలోని ప్రతినగర పురంధ్రీ దిశదిశలా యుద్ధరంగాలలో శివసింఘ విజయ పరంపరలను గూర్చిగానం చేస్తుంటా'రని వర్ణించాడు. 'పురుషపరీక్ష' గ్రంథంలోని చివరి శ్లోకంలో 'శివసింఘ గుజ్జన, గౌడ భూనాథులతోడి యుద్ధములలో విజయలక్ష్మిని వరించాడని వర్ణిం చాడు; అంటే ఢిల్లీలోను, గౌడదేశంలోను ఏలుబడి సాగిస్తున్న మహమ్మదీయ ప్రభువులన్నమాట. తన రాజ్యకాలపు తొలిభాగంలో ఢిల్లీసామ్రాట్టుకు ప్రత్యక్షం గానో లేదా, బీహారు సుబేదారు ద్వారానో సామంతకప్పము చెల్లించినప్పటికి క్రమంగాసామ్రాట్టు అధికారాన్ని ధిక్కరించి, కప్పం-ఆపివేసి, స్వతంత్రత ప్రక

టించి సొంత నాణెములను ముద్రవేయించాడు శివసింహు! అందుచేత అతడు చాలా యుద్ధములు చేయవలసివచ్చింది. విద్యాపతి 'కీర్తిపతాక' గ్రంథంలో వర్ణించిన విజయం ఈ యుద్ధాలలో ఒకదానిలో సాధించినదే కావచ్చు. అటువంటి పోరాటాలలోని ఒకదానిలోనే శివసింహ పరాజితుడు కావడమో మరణింబడమో సంభవించింది. కర్ణాటరాజులలోని హరిసింహువలెనే అదే విధంగా శివసింహ కూడాతన నిర్భయ సాహసిక శీలంవల్లనే వీరమరణం చెందినాడు. మైథిలీరాజ తంత్రజ్ఞులు మహమ్మదీయ దండయాత్రా పరులతో సాధారణంగాయుద్ధోపాయాన్ని ప్రయోగించేవారుకారు. సామోపాయ సాంత్వన విధానాలతోనే వారిదురాక్రమణ విధానాన్ని అరికట్టేవారు. కాని కర్ణాట రాజులలోని హరిసింహు, 'ఒయిన బర' రాజులలోని శివసింహ మాత్రం వారితో యుద్ధమునే వరించడంచేత, అందుకు వారి రణోత్సాహ సాహసిక శీలములే కారణమయినప్పటికీ, ఇద్దరూ కూడా ముంచుకు వచ్చే శత్రుసైన్య ప్రవాహాల ధాటికి తట్టుకోలేక పరాజితులు కావలసి వచ్చింది.

శివసింహ శీలవర్ణన సందర్భాలలో విద్యాపతి దాదాపు అతిశయోక్తులతో ఉజ్జ్వలంగా చిత్రిస్తూవచ్చాడు. 'పురుషపరీక్ష' గ్రంథపు మూడవ ప్రకరణం చిట్టచివరగల రెండు శ్లోకాలలో రూపనిరూపణంలోనే కాకుండా విశిష్టగుణాఖ్యానంలోకూడా శివసింహను సాక్షాత్తు మహావిష్ణువుతోను, సదాశివునితోను పోల్చాడు విద్యాపతి! ఏమంటాడంటే, "ఆమూడు గుణాలూ ఒక్కచోట అమరడం అరుదే—దృక్పాటవమూ, శౌర్యధురీణతా, సర్వజ్ఞత! విశ్వమంతటికీ, ముగ్గురువ్యక్తులలోనే ఈ త్రిగుణసమ్మేళనం దర్శిస్తాము! వారిలో ఇద్దరు దేవతామూర్తులు-విష్ణువు, శివుడు, ఒకడు మానవోత్తముడు అతడేరాజాశివసింహు!".... అంటాడు. అదే గ్రంథంలోని శృంగారవిదగ్ధుని కథలో విద్యాపతి శివసింహును గూర్చి వర్ణిస్తూ 'భోజరాజువలెనే కవితలన్నా వనితలన్నా విచక్షత గల ప్రేమికుడు' అంటాడు! ఈ భావం అతని గేయాలలోను తిరిగితిరిగి వినవస్తుంది. 'అతడు భూలోక మన్మథుడు, సౌందర్య విచక్షణా పరుడైన శృంగారశీలి; రాజులలో కళావిదగ్ధుడు; సాహితీకళలకు ఉదారపోషకుడు!' విద్యాపతి అతిశయోక్తులు శివసింహను విష్ణువు పదకొండవ అవతారమని చెప్పడంలోను, కృష్ణునివలెనే ప్రణయాన్ని అందరికీ పంచియిచ్చే దక్షిణనాయకుడని వర్ణించడంలోను పారం ముట్టుతాయి. శివసింహ విద్యాపతికి జీవితంలో సర్వసౌఖ్యాలూ కలిగించాడు—నిజానికి! మహాకవి కూడా తనవంతుకి శివసింహను ముఖ్యముగా తన గేయాలలోను, మిగిలిన అన్ని గ్రంథాలలోను కూడా దేశం అంతటా అన్నికాలాలపాటు అతడు అమరజీవి అయేటట్లుగా

వర్ణించాడు. పురుషపరీక్ష మూడవ ప్రకరణంలోని 26 వ గాథలో విద్యాపతి ఒక కవికీ అతని రాజపోషకునికి ఉండే పరస్పర సంబంధాన్ని రసోద్రేకంగా వర్ణిస్తాడు; ఇలా అంటాడు ఆ సందర్భంలో:

'కవివర్ణనలలోనె కాదొ రాజ శ్రేష్ఠు
డజరామరంబైన యశమునందు!'

1370 నుంచి 1406 (20 నుండి 56 ఏళ్ళవయస్సు వరకు)అంటే, నిండు యౌవనంనుంచి వార్ధక్యం వచ్చినంతవరకు విద్యాపతి శివసింహుతో కలిసి జీవిత సౌఖ్యాలను పూర్తిగా అనుభవించాడు. సంస్కృతి పునరుజ్జీవన కారుడైన ప్రతిభాశాలిననుక, అభిప్రాయములలో అత్యంత ప్రతిభాశీలితా, తన కాలపు భావాలకంటె ముందరియుగవునవభావనలను ముందేదర్శించి తనకు గురికుదిరిన ఆదర్శములను తనకాలమువారికే కాక, అన్నికాలముల స్త్రీ పురుషులకు ఆదర పాత్రములయే రీతిలో ప్రవచింపగలిగిన ప్రజ్ఞాశాలి! ఆయన శివసింహువంటి మహారాజు ఆదరమునకు అత్యంత పాత్రుడై అతని ఉదారపోషణలో జీవితరంగం లోని వివిధక్షేత్రాలలోను తన ఆదర్శములను విస్మయావహంగాను ప్రశంసార్హ ముగాను ఆచరణలో పెట్టినవాడు!

4

ఈ దశలోనే విద్యాపతి తనకు శాశ్వతకీర్తిని ఆర్జించిన గేయకవితలను మరినాలుగు ప్రసిద్ధ రచనలను చేశాడు. అవి-కీర్తిపతాక, అవహట్ట భాషలో కీర్తిలత అనే గ్రంథమూ, సంస్కృత పద్యములలో పురుషపరీక్ష, సంస్కృత ప్రాకృతములలో 'గోరక్షవిజయ' అనే నాటకము! కాళిదాసు తన విక్రమోర్వశీయం చతుర్థాంకంలో అపభ్రంశ భాషలో నృత్యగీతాలను కూర్చినట్లుగా విద్యాపతి తన నాటకంలో మైథిలీ భాషలో గేయాలను సమకూర్చాడు. ఆయన పూర్ణపురుషుడుగా జీవించినకాలంలో వెలువడిన ఈ రచనలనూ అతని మొత్తం గేయకవితలనూ విశ్లేషించి పరిశీలిస్తే, ఈ అన్నిటిలోను సర్వలక్షణ సంపూర్ణుడైన మానవోత్తము నికీ కేవలం వాలంవినా మృగసమానుడైన మానవాకార మాత్రునికి వ్యత్యాసం స్పష్టమౌతుంది. ఆకారమాత్రుడైన మానవుడు కనబడడం సులభమేకాని, వాస్తవ

మానవుడు దుర్లభుడు'—అంటాడు విద్యాపతి! 'మనుజలక్షణములు కలిగిన మనుజుడే మానవుడు; కేవలం ఆకారంతో పుట్టినంత మాత్రముకాదు! వానకురిసినప్పుడే జలదముపేరు సార్థకము; కురియనప్పుడు అది వ్యర్థంగా పోగుబడిన పొగ మాత్రమే!' ఆయన ప్రణయ గీతాలలో కామినులు వాస్తవ పురుషులనే ప్రేమించి వారికై తపిస్తారు. వారిని 'సుపురుషు'లంటాడు విద్యాపతి.

వాస్తవపురుషునకు మూడు ప్రధాన లక్షణాలను నిర్దేశిస్తాడు విద్యాపతి: విచక్షణతో ఉత్సాహశక్తితో కూడిన శౌర్యముగల నాయకుడై ఉండాలి; మంచి చమత్కారపూర్వకమైనబుద్ధి, విశిష్టనైపుణ్యమూ కలిసి ఉండాలి; వాస్తవపురుషుడైన వాడుధర్మ, అర్థ, కామ, మోక్షములనే చతుర్విధ పురుషార్థములందును సిద్ధిని సంపాదించినవాడు కావలెను. ఏతావతా, పురుషుడు సమగ్ర వికాసమును సాధించి తీరవలెనని విద్యాపతి విశ్వాసము. మైథిలీ సంస్కృతి స్వర్ణయుగ జీవన వాహినిలో తరంగముగా జన్మించిన విద్యాపతి వివిధ పురుషార్థములను సాధించుటలో ఏ ఒక్క దానిని అలక్ష్యముచేయని సంతులిత సమన్విత దృక్పథముతో జీవితము సంపూర్ణముగా సమగ్రముగా అనుభవించవలెనని తన రచనలద్వారా బోధించడమే కాక, తాను ఆ విధముగా జీవించాడు. ఈ సంతులిత సమన్విత మార్గము ఆయన జీవితములో ఆరంభమునుండి తన భావనాపథంలో వెంటాడుతున్నట్లు కనబడుతుంది. 'భూపరిక్రమం' అని ఆయన రచించిన ప్రప్రథమ గ్రంథములో 'ఆదర్శ మనుష్యునకు ఏది గీటురాయి?' అనేది ప్రధానాంశము కాగా, అదే యుగంలో వ్రాసిన చివరి గ్రంథం 'కీర్తిలత'లో 'వాస్తవ మనుష్యుని' వర్తన విశ్లేషణయే ఇతివృత్తము!

ఈ వ్యాసంగములో విద్యాపతి పూర్తిగా తన పితృపితామహాదులు త్రొక్కిన మార్గమునే అనుసరించాడు. ఉత్తమశ్రేణి విద్వాంసులూ, గ్రంథకర్తలూ అయినప్పటికీ, వారు ప్రధానముగా రాజనీతివేత్తలు కావడంచేత, మైథిలీ ప్రజ మహమ్మదీయదురాక్రమణ దాడులను ఎదుర్కొనగలిగే సమర్థమైన జాతిగా, సమాజములోని వివిధ వర్గాలవారి హృదయాలను సమైక్య సూత్రబద్ధముగా దిద్దితీర్చడానికి గాను వారి జీవితములను ధారపోశారు. అంతటి దిట్టమైన పునాదులలో వారు నిర్మించిన ఆనాటి నవసమాజము వాయవ్య భారతంలో సాంస్కృతిక రంగంలో వహించిన మార్గదర్శకత్వం కొన్ని శతాబ్దులు తన ప్రభావం చూపించి, ఈనాటివరకు కొనసాగి, ఇప్పటికి కొంత శైథిల్యావస్థను పొందింది. భక్తి

విధేయతలు తిరుహూతు రాజసింహాసనమునకు కాక, మైథిలీ భూమికినీ, మైథిలీ ప్రజకూ చూపవలెనని వారు చేసిన ప్రబోధవు సారాంశము కావడమే వారి సునిశిత రాజనీతి వేతృతకు తార్కాణ! తరతరాల సంఘ పునర్నిర్మాణానికి ఆ విధంగా దోహదం చేసిన వేత్తలలో చివరి వాడయిన విద్యాపతి బహుముఖ ప్రజ్ఞావంతుడూ, అపరూప ప్రతిభాశాలీ!

విద్యాపతి వ్యక్తి శీలానికి ప్రాధాన్యం ఇస్తాడు! సంఘం అంతా అట్టి సత్పురుషులతో నిండినపుడు ఆ సంఘపు విలువకూడా ఉన్నత ప్రమాణంలో ఉంటుంది. సంఘంలో తన స్థానం ఏ మెట్టుపై ఉన్నప్పటికి ప్రతి వ్యక్తి సంఘోన్నతికి దోహదం చేయాలి. 'పురుష పరీక్ష గ్రంథపు చతుర్థ ప్రకరణపు అవతరణికలో ''సర్వేశ్వరుని నిర్ణయానుసారము నీవు జన్మించిన జాతికి ఆనవాయితియైన మార్గమునే నీవు అనుసరించవలెను'' అని ప్రబోధిస్తాడు. అందుచేత సంఘంలోని వారందరూ సత్పురుషులే అయితే,వారు ఏ వర్ణమునకు, ధర్మమునకు, లింగమునకు, వయస్సునకు చెందిన వారయినా, ఆ వ్యక్తుల నందరినీ కలిపి ఉంచే దృఢమైన అనుబంధం కలిగి, తమకు నిర్ణీతమయిన మార్గమును అనుసరిస్తూ, అందరూ ఏక జాతిగా నిలబడి పరదురాక్రమణను ఎదుర్కొని, తమకు తాము జీవితమును సంపూర్ణముగా అనుభవింపగలుగుతారు. ఆ విధంగా ఒక భూభాగంలో జీవించే ప్రజలను అంతస్తులా, ఆస్తులా వ్యత్యాసాలతో సంబంధం లేకుండా ఏకసూత్ర బద్ధులనుగా చేసేది ఆ భూభాగపు ప్రజల వ్యావహారిక భాషకంటె మరొకటి ఏదీ లేదు. ప్రజల హృదయాలను ఆకర్షించేటట్లు వ్రాసిన తన గేయ కవితకు విద్యాపతి మైథిలీ ప్రజల వ్యావహారిక భాషనే ఆలంబముగా స్వీకరించాడు అంతవరకు సంస్కృత కవితలో మాత్రం సాధ్యం అనిపించిన మాధుర్యంతో కూడిన సాహిత్య రచనా శైలినీ సమ్మోహనత్వాన్నీ ఆయన గేయకవితలో అందజేశాడు. సంస్కృతికి ప్రధాన వాహికగా అంతవరకూ గణ్యతచెందిన సంస్కృత భాష అల్ప సంఖ్యాకులైన ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండేది. విద్యాపతి ఆ ఆనందాన్ని అందరికీ అందుబాటులోనికి తెచ్చి, సంఘంలో అట్టడుగున ఉండే సామాన్య నరనారులకు కూడా నచ్చే ఇతివృత్తాలను, ఉన్నత వర్గాలవారినీ. ఉదాత్తులనూ కూడా మెప్పించే రీతిలో తన గేయకవితలను చేశాడు. మైథిలీ సామాన్య ప్రజల వాడుకభాషనే తన గేయకవితకు స్వీకరించడంచేత ఆమధ్య యుగపు రోజులలోనే మైథిలీ ప్రజను ఏకజాతిగా అనుబంధితులనుగా చేశాడు

Indian ... 117728

విద్యాపతి కవితా హృదయమునుండి జాలువారిన నిసర్గభావ రమణీయతవలన మైథిలీ భాషకు సార్వజనీనమైన సాహిత్య భాషగా మిథిలలోనే కాక, ఇతర ఛప్పన్నదేశాలలోను ప్రసిద్ధీ, ఆదరణా పెంపొందాయి.

ఆనాటి మధ్యయుగపు ప్రమాణాలనుబట్టియే ఎన్ని అడుగులో ముందడుగు వేసినట్లుగా చెప్పదగిన విద్యాపతి అభిప్రాయాలూ ఈనాటికి కూడ అధునికములే అని చెప్పదగి ఉంటాయి, స్త్రీలు విద్యావతులు కావలెనని ఆనాడే ఆయన ఘనముగా ప్రతిపాదించినాడు! ఆనాడే సంస్కృతిపరుల కుటుంబాలలో స్త్రీ విద్య తప్పనిసరిగా ఉండేది; ఒయినబరరాజుల ఇంటి మహిళలు విదుషీమణులు. శివసింఘు భార్యయైన లఖిమ, అదే పేరుగల చండేశ్వరుని భార్య, విద్యాపతికి కోడలయిన చంద్రకళ ప్రఖ్యాతిగల కవయిత్రులు! స్త్రీల వైదుష్యాన్ని విద్యాపతి ఎంతగానో ప్రోత్సహించాడు. కామదేవుని ఆనంద కళలపట్ల అభిరుచీ శ్రద్ధా చూపే నాగరిక మహిళల హృదయ వికాసముకోసమే అతడు 'పురుష పరీక్ష' అనే గ్రంథాన్ని రచించాడు. ఆయన గేయకవితల ముఖ్యోద్దేశము మహిళలకు కామశాస్త్ర విషయములను కరతలామలకములుగా చేయడమే! విద్యాపతి తన గేయములలో ఒక దానిలో, 'నాగరీలక్షణాలను బోధిస్తా'నంటాడు, 'నాగరి' అంటే శబ్దతత్త్వానుసారం 'నగరకామిని'యే అయినా, గ్రియర్సన్ అనువాదమును బట్టి చూస్తే, సంస్కృత సాహిత్యములోను విద్యాపతి కవితలలోను ప్రణయ కళలో నైపుణ్యము కలిగిన మహిళ అనే అర్థములో కూడ ఆమాట వాడినట్లు గ్రహింపగలము!

విద్యను గురించి విద్యాపతికి స్పష్టమైన అభిప్రాయాలుండెను. 16 వ గాథ ఆయుధ ప్రయోగనిపుణుని గురించిన కథ. అందులోని తొలి పద్యంలో స్వభావతః సాహిత్య విద్య శస్త్ర విద్యకంటె తీసికట్టే అని చెప్పవలెను. ఎందుకంటే, శస్త్రముద్వారా రాజ్యము సురక్షితమైనపుడే సాహిత్య ప్రసక్తికి అవకాశం ఉండగలదు ఈ సందర్భంలో సార్వజనిక నిర్బంధ శస్త్ర శిక్షణమే విద్యాపతి ప్రబోధ సారం! మహమ్మదీయులదాడి ఎప్పుడు తిప్పలపెట్టునా అని నిరంతర భీతితో ప్రజాహృదయాలు తల్లడిల్లే ఆనాడు అది ఎంత ఆవశ్యకమో గ్రహింపవచ్చు; వెయ్యేళ్ళకు పైగా మిథిలకు దుర్బలమైన రక్షణ ఏర్పాటులవల్ల కలిగిన అనుభవమే దీనికి తార్కాణము.

మత విషయాలలో విద్యాపతి స్వవర్గ పక్షపాతి అనీ, కొందరు అతడు శివభక్తుడనీ, కొందరు ఆయన విష్ణుభక్తుడనీ అంటూ వచ్చారు. కాని ఆయన రచనలలో "సర్వేశ్వరుడొక్కడే; అతనిచేక సృష్టింపబడనిదంటూ ఈవిశ్వంలో లేనే లేదు; నామభేదములలో ఈశ్వరుని ఉదాత్తతయే స్పష్టముగా కనిపిస్తుంది" అని లోకజ్ఞునికి ఉచితమైన అభిప్రాయమునే విద్యాపతి ప్రకటిస్తాడు. ఆయన కవిత లలో హరికి హరునకు వ్యత్యాసమును పూర్తిగా నిరాకరిస్తాడు శివారాధన ప్రతిపాదకమైన 'శైవ సర్వస్వసారం' అనే తన గ్రంథంలో హరిహరులకు అభేద మును వేదోక్తమైనదిగా ప్రకటిస్తూ ఒక దైవముపై భక్తి మరొక దైవముపై భక్తి వలెనే ఏమాత్రము తీసిపోనిదని చెపుతాడు. "ఎవరైనా ఏదైవమునైనా ఆరాధించ వచ్చు. విద్యాపతి శివారాధకుడు. అందుకని ఆయన హరికి శత్రువనిగాని, ద్వేషి అని గాని అనుకొనడం తప్పు" అంటాడు!

విద్యాపతి వ్రాసిన పాటలలో ఎక్కువభాగం శివభక్తిప్రతిపాదకములనే విషయాన్ని పెద్దచేసి పండితులేమేమో అంటారుగాని, ఆయన భక్తికవితలు శివుని గూర్చియేకాక, హిందూధర్మములోని విష్ణు, దేవి, గంగ మున్నగు ఇతర దేవతలను గురించినవి కూడా ఉన్నవని మరచిపోకూడదు. శివరూపియైన సర్వేశ్వరుడు విద్యాపతికి ఇష్టదైవమన్నమాట ఒక రీతిగా వాస్తవమేకాని, ఆయన సాంప్రదాయికంగా ఇతర స్మార్తమైథిలీబ్రాహ్మణులందరివలెనే పంచదేవో పాసకుడు; హిందూమతమునకు చెందిన దేవతామూర్తులందరిలో కేవలం శివుని ఆరాధనా, శివునిపట్ల భక్తి స్త్రీపురుషవ్యత్యాసముగాని, బ్రాహ్మణ చండాల భేదముగాని లేకుండా సర్వులకు ఉపాదేయమని శాస్త్ర సమ్మతము కావడచేతనే ఆయన పాటలలో ఎక్కువభాగం శివునిపైని సాగినవి. అందుచేత ఆ పాటలు కులభేదంకాని, లింగభేదంకాని లేకుండా సామాన్య జనులందరికి ఆదరపాత్రము లైనాయి.

విద్యాపతి యశస్సు ప్రధానంగా ఈ యుగంలో రచించిన కీర్తనల ద్వారానే వ్యాపించినందుకు, వాటినిగురించి తరువాత ప్రత్యేకంగా ముచ్చటించు కొందాము. ఈ కాలంలో విద్యాపతి నాల్గు గ్రంథాలు రచించాడు. నాలుగూ మౌలికములూ, సర్జనాత్మకములూ. వాటిలో మొదటిది కీర్తిపతాక-ఇది ప్రాచీన మైథిలీ, లేక అవహట్ట భాషలో శివసింఘు ఒకానొక మహమ్మదీయ రాజుపై సాధించిన విజయాన్ని పొగడుతూ రచించిన కావ్యం! దొరకిన లిఖితప్రతిలో

సుల్తానుపేరు లభించలేదు. ఖాట్మండులోని (నేపాల్) వీరా పుస్తక భాండాగారం లోని తాళపత్ర గ్రంథాలలోని ఒకే ఒక్క ప్రతి మహోపాధ్యాయ హరప్రసాద శాస్త్రిగారికి దొరికింది ప్రతి చాల మట్టుకు శిథిలమై ఉంది, విరిగిపోతోంది; అసంపూర్ణము; ఎన్నో అర్థముకాని ప్రయోగాలు, తప్పులు చూసి, ఆ మహామహోపాధ్యాయులు దానిని పునర్నిర్మాణానికి పనికిరాదని వదలివేశారు. ఈ పనికిరాని లిఖితప్రతిని ఇటీవలనే అలహాబాదులోని డా॥ జయకాంత్ మిశ్రా ప్రకటించారు కాని–అదికూడా ప్రయోజనంలేనిదే. తాళపత్రాల పుటలక్రమం చెల్లాచెదరై పోయింది, కాని, చిట్టచివరి పుట స్పష్టంగా ఉండడంచేత అది శివసింఘ విజయ యాత్రను గూర్చి విద్యాపతి కూర్చిన గ్రంథం అని తెలుస్తుంది; అయితే, లిఖిత ప్రతి దొంతరలో అభినందన పద్యాలతోసహా రెండు అవతరణికలు కనిపించాయి; వాటిలో ఒకటి ఒయినబర్|రాజులలో చివరివారిలో ఒకని ఆస్థానకవియైన భీష్మకవి రచనకాగా, రెండవది అర్జునరాజు ఆనందముకొరకై అభినవ జయదేవుడు రచించిన ప్రణయకవిత! అభినవజయదేవుడనేది విద్యాపతికి ప్రఖ్యాతి కలిగించిన బిరుదులలో ఒకటి! మొత్తంమీద ఈ లిఖితప్రతిలో మూడు వేరువేరు గ్రంథాల పుటలు కలగలపైపోయి, పుటల సంఖ్యాక్రమంతేనందున విడదీయడానికి వీలు లేకుండా పోయింది. ఒకటి భీష్మకవిరచన, రెండవది అర్జునరాయవి కోసం విద్యాపతి వ్రాసినది, మూడవది కీర్తిపతాక; దీని మొదటి పుటలేదు కావి, దొంతరలో చివరనున్న పత్రము కీర్తిపతాక చివరిపుట కావడంచేత మొత్తం దొంతర అంతా కీర్తిపతాకే అనే భ్రమకు తావిచ్చింది. భీష్మకవి రచన మరొకటేదైనా కాని అర్జునరాయనికై విద్యాపతి కవిత మరొకటికాని వేరెక్కడామచ్చుకైనాలేదు.

రెండవరచన పురుషపరీక్షను గోరక్షవిజయం అనే గ్రంథంతో సహావిద్యాపతి-శివసింఘ పరిపాలనా కాలంలోనే రచించాడు. మనిషిగా విద్యాపతిని అవగాహన చేసికోవాలన్నా, ఆయుగపు భావలక్షణాలను తెలుసుకోవాలన్నా, ఈ గ్రంథం అమూల్యంగా తోడుపడగలదు. బాగా చిన్నవయస్సులోనే దాని రచనాప్రణాళిక తయారుచేసుకుని, వ్రాయడం ప్రారంభించి, బుద్ధిపరిపక్వమై విచక్షణవర్ధిల్లి, రచయితగా అసాధారణ ఖ్యాతిపొందేనాటికి పూర్తయింది. ఈ గ్రంథపు అవతరణికలో–అంతకుముందు రచించిన 'భూపరిక్రమ' గ్రంథంలో అసలు చెప్పి ఉందని గ్రంథరచనా ప్రయోజనము కనబడుతుంది అపరిపక్వ బుద్ధులైన బాలురకోసము, కామదేవుని కమనీయకళలంటే అభిరుచి ప్రదర్శించే

నాగరక మహిళల ఆనందముకోసము ఈ నీతిబోధక గాథలను రచిస్తున్నా నంటాడు. (3వ శ్లోకం); అంతేకాక, "విద్వన్నైపుణీ వల్ల నిశితబుద్ధి కలిగిన జ్ఞానులకు నారచనలోని నీతిబోధ, ఈ కథలలోని నిసర్గలలితమైనభాష విననిచ్ఛ కలిగింపకపోవచ్చు"—అంటాడు. అందుచేత ఈ గాథలూ, పంచతంత్ర, హితోపదేశ కథలూ ఒకే వర్గమునకు చెందిన వనవచ్చు. వ్యత్యాసం కొంచెమే—పంచతంత్రాది కథలు పిట్టకథలా జానపదకథలా కోవకు చెందినవి, విద్యాపతి కూర్చిన గాథలన్నీ జరిగిన సంఘటనతో, ఇంచుమించు సంభావ్యములైనవని విశ్వసింపదగినవి. పురుషపరీక్ష నాలుగు ప్రకరణాలలోను 44 గాథలున్నవి. మొదటి ప్రకరణంలోని ఎనిమిది గాథలూ అతని తొలి రచన అయిన భూపరిక్రమము నుండి తు. చ తప్పకుండ ఎత్తి వ్రాసినవి. వాటిలో కొన్ని చారిత్రకములు; మహిమలను వర్ణించిన గాథలు కూడా తరతరాల జనవిశ్వాసమును చూరగొన్నవే! 1815 లో సెరాంపూరుకు చెందిన హెచ్ సి. రాయ బెంగాలీలోనికి ఈ గ్రంథాన్ని అనువదించారు; మరొక కూర్పు 1826 లో లండనులో సర్ జి. హాటన్ ప్రకటించారు. ఫోర్ట్ విలియం కళాశాలలో—తూర్పిండియా కంపెనీలో ఉన్నతోద్యోగాలకు జరిపే పరీక్షార్థులకు ఇది పాఠ్యగ్రంథంగా ఉండేది,

పురుషపరీక్ష లలితము, సుబోధకమూ అయిన సులభశైలిలో వ్రాసిన గ్రంథములలో ఎన్నదగినది. భూపరిక్రమము, పురుషపరీక్షా గ్రంథములు రెండూ సుమారు 20 ఏళ్ళ ఎడములో వ్రాసినట్లు తెలుస్తోంది కాని, పురుషపరీక్షలో తొలిభాగమూ భూపరిక్రమమూ ఆయన యౌవనంలో వ్రాసిన రచనా పురుషపరీక్షలో చివరిభాగము ఆయన వయఃపరిపాకంలో వ్రాసిన రచనా. అయినా రెండింటిలోను శైలిలో వ్యత్యాసమేమీ గుర్తించలేము. ఆయన సంస్కృతరచనా సామర్థ్యం అతి సహజమైనదని ఈ రచనవల్ల స్పష్టమవుతుంది. అయితే, పాణిని వ్యాకరణ సూత్రాలనుబట్టి సాధించలేని విశిష్ట ప్రయోగాలూ, మైథిలీ మాండలికాలు ఈ గ్రంథంలో ఎన్నో! అయితే ఈ ప్రయోగాలవల్ల భావప్రకటనకు భంగంలేకుండా సంస్కృతభాషా ప్రయోగంలో సౌలభ్యాన్ని సాధించడమైంది, ఇదంతా గమనిస్తే, సూక్ష్మ పరిశీలకులకు, విద్యాపతి సంస్కృతభాషా ప్రయోగంలో ఒక సర్వసామాన్య సులభగ్రాహ్య శైలిని సాధించి చూపించాడని తోస్తుంది. అప్రయత్నంగా నరనారులకు త్వరితంగా పట్టుబడే సులభమూ, లలితమూ, శక్తిమంతమూ అయిన సంస్కృత ప్రయోగము ద్వారా విద్యాపతి సంస్కృతమునకు సామాన్య

జనంలో వ్యాప్తిగలుగచెయ్యడానికి ప్రయత్నించాడని చెప్పవచ్చు మార్గదర్శిగా విద్యాపతిచేసిన ప్రయోగాన్ని తరువాతి కాలంలో సంస్కృతభాషాపరులు అవలంబించి ఉండినట్లయితే మైథిలీ ముద్రకలిగిన సామాన్య సులభ సంస్కృతం దేశమంతటా వ్యాపించి ఉండేది; విద్యాపతి కాలాతీతుడు; ఆయన తరువాత దేశంలో కలిగిన క్షీణదశలో సాంస్కృతిక జీవితానికి సారథులయిన సంస్కృత పండితులు విద్యాపతిని హేళనచేసి, ఆయన పద్ధతులను నిరసించారు; సనాతన దృక్కులైన ఆ పండితులకు విద్యాపతి అద్యతన మార్గము ఎంత మాత్రము నచ్చలేదు. ఒక్క విషయములో అంటే ఈ ఆరు శతాబ్దాలలోను లక్షలకొలదీ మైథిల్లీ నారీజనమువాడుకొనే మధుర మైథిలీ భాషలో గేయకవితా సంప్రదాయము మాత్రము మౌలికముగా విద్యాపతి ప్రసాదించిన శాశ్వత పురస్కృతిగా నిలిచిపోయింది.

గోరక్షా విజయం అనే నాటకం కూడ శివసింఘ పరిపాలన కాలంలోనే విద్యాపతి రచించాడు. అది రంగస్థలంపై సులువుగా ప్రదర్శించడానికి వీలైన చిన్న నాటకము. ఈ యుగంలో సంస్కృతంలో చిన్ని నాటకాలు ప్రదర్శించడానికి వీలైనవి చాలా వచ్చాయి. శంకరమిత్రుడు రచించిన 'గౌరీదిగంబర' అనే ప్రహసనం వాటిలో చాలా పేరుపడింది. విద్యాపతి తన సంస్కృత నాటికలోని సంభాషణలు, పద్యాలు ప్రాకృతంలోను, గేయాలు మైథిలిలోను రచించాడు. ఈ సంస్కరణను తరువాతికాలం వారు అనుసరించి ఉంటే నాటకంలో పాటలను మొదటిసారిగా చేర్చిన గౌరవందక్కి, మైథిలీభాష ఆధునిక భారతభాషగా గుర్తింపు పొంది ఉండేది ఆ వెంటనే వేసి ఉండవలసిన ముందంజెలో నాటకం పూర్తిగా మైథిలిలోనే వ్రాసి ఉండవలసింది. అస్సాంలో శంకరదేవుడు, ఆయన శిష్యుడు మాధవదేవుడు, నేపాలదేశంలోని మల్లవంశపురాజుల ఆస్థానంలోని తరతరాల కవులు తమ తమ దేశభాషలోనే పూర్తి నాటకములను వ్రాశారు, శివసింఘ కనబడకుండా పోవడంచేతనో, తన భాగ్యరేఖలో కలిగిన మార్పువలనో తగిన ప్రోత్సాహ ప్రాపకములులేక విద్యాపతి సర్జన శక్తి అణగిపోయింది. ఆయన వంశానుయాయులు ఆయన చూపిన ఒరవడులలో ఆమహాకవి మార్గమును అనుసరిస్తూ రచనలుచేశారు. తరువాతి శతాబ్దులలో వెలువడిన చాల నాటకాలలో అన్నిటిలోను పాటలు మాత్రం మైథిలిలో ఉండేవి. సలక్షణమైన మైథిలీ నాటకం ఈ శతాబ్దపు (20) తొలి దశకంలోనే వెలువడింది.

విద్యాపతి రచనలలో చివరిది అన్నిటిలోను మిక్కిలి వివాదాస్పదమైనది- 'కీర్తిలత'. ఇది ప్రాచీన మైథిలీ, అబహట్ఠ, భాషలలో గద్యపద్యమయం (చంపువు) గారచించిన గ్రంథము! మిథిలను పాలించిన ఒయినబరరాజులలో తొలివర్గము వారి జీవిత చర్యను వర్ణించు చారిత్రిక సంఘటనలు ఇందలి ఇతివృత్తము! అందులో జౌన్పూర్ పాలించిన షర్కివంశపు నవాబు ఇబ్రాహిం షా తోడ్పాటుతో కీర్తిసింఘ అనే మిథిల రాజు తన తండ్రి హంతకులపై పగదీర్చుకోవడం ఆ ఇతి వృత్తంలోని ప్రధాన ఘట్టము! అయితే, కీర్తిలతలో వర్ణితమైన ఈ సంఘటనలోని వివరాలు ఇతరత్రా తెలియవచ్చిన చారిత్రిక వివరాలకంటె భిన్నంగా ఉన్నాయి. కీల్హార్న్ అనే పరిశోధకుని లెక్క ప్రకారం గణేశ్వరుని హత్య లాకికశకం 252 అనగా క్రీ. శ. 1371 లో జరిగింది. కాని, శివసింఘ మిథిలా సింహాసనమెక్కిన సమయం లాకిక శకం 293 అనగా శక సంవత్సరం 1324 అన్న లెక్క ప్రకారం గణేశ్వరుని హత్య క్రి శ. 1361 లో జరిగి ఉండాలి, క్రి. శ. 1371 లోనే గణేశ్వరుని హత్య జరిగి ఉండవచ్చునని అనుకొన్నా, ఇబ్రాహింషా జౌన్పూర్ నవాబు కావడానికి ముందు ఇంకా 30 ఏళ్ళవార ఉండిపోతుంది. కీర్తిలతలో ఈకాలంలో మిథిల అరాచకముతో గందరగోళముగా ఉండినట్లు వర్ణితమై ఉంది. కాని, ఇతర చారిత్రికాధారాలనుబట్టి ఈకాలంలో శివసింఘ మిథిలను సమర్థతతో పరిపాలిస్తూండినట్లు, సర్వత్ర శాంతి సౌభాగ్యములు వెలసి ఉన్నట్లు తెలుస్తుంది.

క్షమ, శ్రద్ధ, శౌర్యము, దృఢనిశ్చయమువంటి ఉదారనాయక గుణములు కలిగినట్లుగా కీర్తిసింఘ రాజును గూర్చిన అతిశయోక్తులే ఇతివృత్తము ఉండ వలసిన కీర్తిలతలో వాస్తవానికి ఆయనకు సాహాయ్యపడిన ఇబ్రాహింషా గొప్ప శక్తిమంతుడైన నవాబుగా, విజేతలలో శ్రేష్ఠుడుగా ఆకాశమునకు ఎత్తివేసినంత శూరనాయకుడుగా మనకు దర్శనమిస్తాడు. విద్యాపతి ఇతర రచనలలోని పరి పక్వమైన కవితాశిల్పం కీర్తిలతలో కనబడకపోవడంచేత ఇది ఆయన తొలిరచనయా అనిపించవచ్చు. కాని, 1400 (క్రీ శ.)లో ఇబ్రాహింషా జౌన్పూరునవాబు కావ డానికి ముందు అది సిద్ధంకావడానికి వీలులేదు. ఎందుకంటే అప్పటికి విద్యాపతికి 30ఏళ్ళ వయస్సువచ్చి పైబడుతుంది చారిత్రికంగా అది పొసగదు. భాషా విషయి కంగా కీర్తిలత పలుచోట్ల దురన్వయంగా గజిబిజిగా ఉంటుంది. ఇప్పటి అచ్చయిన అన్ని కూర్పులకు ఆధారము ఏకైక లిఖిత ప్రతి ...అది 'తప్పుల తడక' దురవ

గాహ శబ్ద ప్రయోగాలతో గజిబిజిగా ఉంటుంది. దానికి కారణం దానిలోని భాష ప్రాకృత అపభ్రంశములకుతోడు మైథిలీ శబ్దాలు, సమాసాలు, అప్పుడప్పుడు కొన్ని వాక్యాలకు వాక్యాలే సంధి ఉంటాయి. వాటి మధ్య మధ్య మహమ్మదీయ రాజాస్థానాల సైన్యాల వర్ణన సందర్భాలలో పారశీ, అరబ్బీ పదాలు కలగలిసి ఉంటాయి. కీర్తిలత అయిదు కూర్పులు వేరువేరుగా అచ్చయింది. ప్రఖ్యాతులైన విద్వాంసులు దానిని పరిశీలించి తమ తమ అభిప్రాయాలను ప్రకటించాడు. వాటిని గురించిన వివరాలలోనికి వెళ్ళడానికి ఇక్కడ చోటుచాలదు. నేను సంపాదకుడుగా పరిశీలించి వేయించిన కూర్పులో నేనేమిప్రాశానో ఆ విషయాలు కొన్ని ఇక్కడ ఉదాహరిస్తాను.

'ఇబ్రాహింషా (జౌన్‌పూర్) సింహాసనం ఎక్కిన వెంటనే తిరుహూత్ పైకి దాడిచేసిన మాట వాస్తవమే; అప్పుడు తిరుహూత్‌లో రాచరికం చేస్తున్నది శివసింఘ! శివసింఘ తాను గద్దెయెక్కిన 3 ఏళ్ళ 9 మాసాలలో అంటే 1405-06 (క్రీ శ) లో పరాజితుడైన విషయం కూడా వాస్తవమే! అయితే, చరిత్రద్వారా గాని, పారంపరిక గాథలద్వారాగాని శివసింఘ పరాజితుడయినది ఏ శత్రువుదాడి వల్ల అనే విషయముగాని, ఇబ్రాహింషా మిథిలపైకి దండెత్తివెళ్ళినపుడు అక్కడ అతని ప్రత్యర్థి యెవ్వరన్న విషయంగాని ఇంతవరకు స్పష్టంగా బయల్పడలేదు. ఇబ్రాహిం దండయాత్ర శివసింఘు పతనమూ జరిగినది ఒకే సమయంలో కావడమూ, శివసింఘు అధీనంలో ఉన్న రాజ్యాన్నే కీర్తిసింఘు తన పైతృకంగా తనకు దక్కవలెననే కోర్కెతో ఇబ్రాహింషాను దండయాత్రకై అర్థించగా, కీర్తిసింఘుకు పైతృక రాజ్యాన్ని ఇప్పించడం కోసమే ఇబ్రాహిం మిథిలపై దండెత్తి శివసింఘును యుద్ధంలో పరాజితుణ్ణి చేశాడన్నది ఊహ మాత్రంకాక వాస్తవమే కావచ్చు. విజేతలైన జౌన్‌పూర్ సైన్యాలు మిథిలకు బాగా నష్టంకలిగించినా మిథిల జౌన్పూర్ రాజ్యంలో కలిసిపోలేదు. శివసింఘుకు తర్వాత అతని సోదరుడు పద్మసింఘ రాజ్యానికి వచ్చినట్లు చారిత్రికసాక్ష్యాలున్నాయి. ఇబ్రాహింషా కావ్యగీతిప్రియుడు; కవిపండిత పోషకుడు. 'నాచారి' అనే శైవ గేయాలను రచించిన విద్యాపతి విఖ్యాతి ఇబ్రాహిం రాజధానియైన జౌన్పూరు కొలువున తన వెలుగునింపినట్లు సాక్ష్యాలున్నాయి. శివసింఘ పరారి అయిన వెనుక 'కీర్తిలత' గ్రంథమువ్రాసి, విద్యాపతి నవాబును మెప్పించి, మిథిలారాజ్యమును వినాశము నుండి తప్పించినట్లు ఊహించవచ్చు.

తన పోషకమిత్రుడగు రాజు వినాశానికి కారకుడయి, తన జీవితస్వప్నాలను కుప్పకూల్చిన సుల్తానును స్తుతించడం విద్యాపతికి ఎంతబాధాకరమైనా అయి ఉండవచ్చు. మేధానిధియైన రాజనీతివేత్త కనుక, తన ప్రథమ విధేయత తన రాజ్యమునకు తన ప్రజలకు అని యెంచుకొని, తన వ్యక్తిగత భావాలను అణచు కొని, తన రచనాశక్తి ద్వారా వెనుక ఒకసారి కప్పము చెల్లించక శిక్షపొందిన శివసింఘను విముక్తుణ్ణి చేయడానికి వినియోగించినట్లే మరొకసారిమిథిలా రాజ్యాన్నీ ప్రజలనూ సర్వనాశమునుంచి తప్పించడానికి వినియోగించాడు. ఈ సూటి గ్రహిస్తే, కీర్తిలత గ్రంథం పరిశీలనలో తోచేసమస్యలన్నీ ఇట్టే విడిపోగలవు. అందుకే ఈ కావ్యంలో అంతటా పొగడ్తలే-కల్పితవర్ణనలే - శివసింఘను గురించి ఎక్కడా కనబడదు కీర్తిసింఘ తండ్రిని చంపడానికి వినియోగింపబడిన హంతకుణ్ణే సుల్తాను దాడికి గురిచేస్తాడు అందుకే ఆ భాగం అంతటా విద్యా పతికి ఖ్యాతినిచ్చిన కవితాశైలికాక ఫారశీ అరబిక్ పదాలు గుప్పించిన మణిప్రవాళ శైలితో నిండి ఉంటుంది. తన ఆప్త మిత్రుడు కూలిపోయినందుకు కుంగిపోవలసిన ఏ కవిమాత్రం అటువంటి సందర్భంలో శత్రువును గురించి అంతకంటె బాగా ఎలావ్రాయగలడు? దీనినిబట్టి, కీర్తిలత 1406 వేసవిమాసాలలో ఎప్పుడో రచింప బడి ఉంటుందని తెలుతుంది. ప్రాతిపదిక సంఘటన చారిత్రికమైనది ఆధార ముగా వ్రాసిన చారిత్రికకావ్యమనీ, అది ఒక మహమ్మదీయవిజేతను స్తుతించ డానికి వ్రాయవలసివచ్చిందనీ దీని సారాంశము.

5

1406లో శివసింఘపరాజయము, అంతర్ధానమయి పోవడమూ విద్యాపతి జీవితపథాన్నే పూర్తిగా మార్చివేసిన సంఘటనలు. అతని జీవనజ్యోతి ఆరిపోయింది. ఆయన ఉద్యోగక మూలకారణమైన ఆప్తమిత్రుడే అంతర్ధానమయాడు. ఆ రాజు తోనే ఆయన స్వప్నాలన్నీ కరిగిపోయాయి రాజు బ్రతికి ఉన్నదీ, మరణించినదీ కూడా తెలియకపోవడంతో ఆయన పరితాపానికి హద్దులు లేకపోయాయి. శివ సింఘ తన మిత్రుడైన విద్యాపతిపై ఎంత ఆధారపడి ఉండేవాడో, ఆయన స్వాశీల్యముపై ఎంతటి విశ్వాసంతో ఉండేవాడో, ఆయన ఆత్మశుద్ధి అన్నా వివేక

మన్నా తనకు ఎంతగురి ఉండేదో తెలియడానికి తార్కాణగాన్ట్- శివసింఘు చివరియుద్ధానికి పోయేముందు తన అర్ధుసు భార్యలను విద్యాపతి రక్షణకే అప్ప గించాడు. అప్పటినుంచి, శివసింఘు వ్యక్తిగాని, మృతకళేబరముగాని కనబడక పోవడంతో 12 ఏళ్ళవరకు నిరీక్షించి, శాస్త్రరీత్యా అంత్యక్రియలు జరిపేవరకు ఆరాణులు విద్యాపతి రక్షణలోనే ఉండిపోయారు. విజేతలైన శత్రుసైన్యాల ద్వారా అవమానితులు కాకుండేటందుకు విద్యాపతి వారిని తనమిత్రుడు, శివ సింఘుకు మిత్రరాజు, నేపాల్ టెరైలోని రాజాబనౌలీలో ఉంటూ ఉండిన సప్తారి పాలించే ద్రోణబరవంశపురాజూ అయిన పురాదిత్యుని వద్దకు పంపివేశాడు. మిథిలారాజ్యపు లావాదేవీలను సర్దుబాటుచేసి, రాణులను రక్షిస్తూ తానుకూడా అజ్ఞాతంలో ఉండిపోవాలని రాజాబనౌనీకే వెళ్ళిపోయి, రాజు చరమవార్తకోసమై 12 ఏళ్ళదాకా అక్కడే నిరీక్షిస్తూ ఉండిపోయాడు.

స్వయంప్రేరితమైన అజ్ఞాతవాసం చేసిన ఈ 12 సంవత్సరాలూ విద్యాపతి జీవితంలో అంధకార పూరితమైనవని చెప్పాలి: ఎటుచూచినా వైఫల్యమూ, తన కిదివరకు భ్రమగొలిపిన మంచి విషయములన్నిటిపైనా విరక్తితప్ప అతనికి మరేవెలుగూ కానరాలేదు. ఆయన క్రియాత్మకకవితాశక్తి స్తబ్ధమైపోయింది; కవి త్వాన్ని విసర్జించాడు. ఆ రోజులలో సంస్కృతంలోనే ఒక చిన్నగ్రంథం 'లిఖనా వళి' అనేపేరుతో సప్తారిరాజుకోసం కూర్చిన లేఖలుగాను, పరిపాలనాత్మక మతలబులుగాను ఉంటుంది. ఆ ఒక్క గ్రంథమే రచించాడు. ఆ లేఖలూ మతలబులూ అన్నిటిలోను లౌకిక శకం 299 అనే సంవత్సరమే కనబడుతుంది. ఈ గ్రంథం ఇటీవల ముద్రితమయింది. అందులో ఆనాటి ప్రజాజీవిత విశేషాలు, సాంఘిక, రాజకీయ, ఆర్థిక, వాణిజ్యాది విషయాలను గురించి బాగా తెలుస్తుంది.

రాజబనౌలీలో ఉండేటప్పుడు విద్యాపతికి ప్రత్యేకంగా చేయవలసిన పనేమీ ఉండేది కాదు; ఆయన ఆ రోజులలో రామాయణము, మహాభారతము, పురాణములు మున్నగునవి అదేపనిగా చదువుతూండేవాడు. రాజా శివసింఘ ప్రణయకలాపాలనే కృష్ణభగవానుని ప్రణయ లీలలుగా తన గేయకవితలలో వర్ణించిన అపరాధానికి ఫలితంగానే బహుశా దండనగా తనకు శివసింఘు వియోగం సంభవించిందా అనే పశ్చాత్తాపంతో బాధపడుతూ కృష్ణ భక్తులైన వైష్ణ వుల పవిత్రగ్రంథమైన శ్రీమద్భాగవతమును చూచివ్రాత మొదలుపెట్టి లౌకిక శకం 309 శ్రావణశుద్ధ పూర్ణిమనాడు (మంగళవారం) పూర్తిచేసేసరికి ఆయన

రాజుకోసంపట్టిన నిరీక్షాదీక్ష కూడా పూర్తయింది. ఆ వ్రాతప్రతి 500 తాళ పత్రాలపైన్ని, ఒక్కొక్కటి 27 అంగుళాల పొడవూ 5 అంగుళాల వెడల్పుగల ఆకులపైన్ని, పుటకు 5 పంక్తులు ఒక్కొక్క పంక్తిలో 112 అక్షరాలు శుభ్రసుంద రమైనదస్తూరిలో చాలా కొద్దిపాటి దిద్దుబాటులూ కొట్టివేతలతో విద్యాపతి చాలా శ్రద్ధగా, దీక్షగా తయారుచేసినది. ఈ వ్రాతప్రతి పూర్తిగా దర్భంగా సంస్కృత విశ్వవిద్యాలయ పుస్తక భాండాగారంలో భద్రపరచి ఉన్నది. దర్శనీయమైనది. ఇది ఆ మహాకవి స్వహస్తలిఖితం అయి ఉండటం, ఈ నాటికి లభిస్తూండడం స్మరణీయం!

పన్నెండు సంవత్సరాల నిరీక్ష పరిపూర్తి అయిన వెనుక మిగిలిన రాణుల సంగతి ఏమైనదో తెలియదుగాని, రాణీలచ్చిమా మాత్రము రాజాశివ సింఘుకు జరిపిన అంత్యక్రియలలో దర్భలతో తయారుచేసిన రాజు దేహప్రతిమతోపాటు చితాగ్నిలో సహగమనంచేసింది. లోకాంతరగతుడైన మిత్రుడు తనపై మోపిన బాధ్యతాభారంనుంచి అంతటితో తేలికపడి విద్యాపతి ప్రవాసంవదలి, తనకుడెబ్బది సంవత్సరాలు నిండుతున్న వయస్సులో స్వగ్రామం చేరుకొన్నాడు. అప్పుడు శివ సింఘుకు తమ్ముడైన పద్మసింఘుకు పట్టమహిషి విశ్వాసదేవి మిథిలకు ఏలికగా ఉండినది. కొందరు చరిత్రకారులు శివసింఘుదేవేరియైన లచ్చిమా 12 ఏళ్ళు పరిపాలించినదనీ, ఆతరువాత పద్మశింఘూ. విశ్వాసదేవీ కలిసి 13 ఏళ్ళు ఏలారనీ వ్రాశారు. అది పొరపాటు. 12 ఏళ్ళవరకూ శివసింఘ మరణించినట్లు ప్రకటిం చకపోయినందువల్ల రాజ్యాధికారంలో పరివర్తన సమస్య అంతవరకూరాలేదు. శివసింఘుకుగాని పద్మసింఘుకుగాని సంతులేదు. శివసింఘుకు బదులు రాణీలచ్చి మాయే ఏలికకు ప్రతినిధిగా ఏలవలసి ఉన్నా ఆమె రాజబనౌలీవదలి మిథిలకు రాలేదు. తనభర్తకు బదులు అతనిసోదరుడైన పద్మసింఘును ప్రతినిధిగా లచ్చి మాయేనియమించింది. పద్మసింఘ వెంటనే మరణించడంచేత ఆబాధ్యతను అతని భార్య విశ్వాసదేవి పైనిపడింది. ఆమె ఆ బాధ్యత స్వీకరించింది. స్త్రీకి రాజ్యాధి కారంలేదు; అందుకని, శివసింఘ అంత్యక్రియల అనంతరం సింహాసనమునకు వారసులెవరు అనే సమస్య ఉదయించింది; అదిభావసింఘుకు చిన్న కొడుకయిన హర సింఘుకు రావలసి ఉంది–కాని అప్పటికి అతడుబ్రతికి ఉండినట్లులేదు కనుక అతని కుమారుడైన నరసింఘుయే శివసింఘుకు అనంతరం పురుషవారసుడుగా అధికారానికి వచ్చాడు. ఇంతకు నిరీక్షలోగడచిన 12 సంవత్సరాల పరిపాలన వేరువేరు

వ్రాతలలో రాణిలచ్చిమాకు, పద్మసింఘ, విశ్వాసదేవి, దంపతులకు చెందినట్లుగా కనబడుతుంది. గుర్తించవలసిన ఒక ముఖ్య విషయం ఉంది; దేవసింఘ మొదలు ఒయినబర వంశపు రాజులలో ప్రతి ఏలికా సింహాసనం అధిష్ఠించగానే ఒక బిరుదును ప్రకటించుకొంటాడు. దేవసింఘ గరుడనారాయణుడు, శివసింఘ రూపనారాయణుడు నరసింఘ దర్పనారాయణుడు ఈలాగ! పద్మసింఘుకు అటువంటి బిరుదం ఏమీలేదు కనుక అతను రాజప్రతినిధియే (లేదా రక్షకుడు) కాని సాధికారిక రాజు కాడు-హరసింఘ కూడా అంతే. కనుకను శివసింఘ మరణించినట్లు ప్రకటన జరిగిన వెనుకనే రాజ్యాధికార పరివర్తన సమస్య వచ్చినపుడతడు బ్రతికి ఉండడం సంశయాస్పదం.

అయితే విద్యాపతి కార్యశూరుడు, ఎన్నడు విధ్యుక్త బాధ్యతల నుండి వెనుకంజ వేసినవాడు కాడు తాను. తిరిగి తిరుహూత్ రాజాస్థానంలో చేరిన వెనుక తానుజీవించిన 20సంవత్సరాలలో హరసింఘ, అతని కుమారుడయిన నరసింఘ అతని కుమారుడయిన ధీరసింఘ అను ఈ ముగ్గురు రాజులకొలువులోను పని చేశాడు. తనకు రాజపోషకులయిన నలుగురిపేర వారి సంతృప్తికై విశ్వాసదేవికి రెండు, నరసింఘకు ఒకటి, అతడి భార్య ధీరమతికి ఒకటి, చివరిది ధీరసింఘుకు ఒకటి ఆయన ఆకాలంలో చేసిన ఏడు గ్రంథ సంపుటములలో చేరినవి. ఇవి అన్నీ సంస్కృతంలో రచించిన స్మృతి (ధర్మశాస్త్ర) సంకలనములు. వీటిలో ఒక్కటికూడా మౌలికముకాదు, కల్పనారచనకాదు. అందుచేత ఆస్థానములో ప్రేష్యము చేసే రాజపురుషుడు అనుటకంటె ఆయన బాధ్యతగల స్వతంత్రోద్యోగమేదీకాక, ధార్మిక, సాంప్రదాయ, రాజకీయవిషయాలలో ఉపదేశకుడయిన గురువుగా ప్రవర్తించినట్లు కనబడుతుంది. జీవితవైఫల్యములను, జరాభారములో కలిగే నైరాశ్యమును చిత్రిస్తూ ఈ కాలంలో రచించిన కొన్ని భక్తిరసాత్మక రచనలు అనుభవపరిపాకంతోను ఆత్మశుద్ధితోను కనబడతాయి కాని, వాటిలో ఆయనస్వానుభవమునే వర్ణించాడని చెప్పడానికి వీలులేదు విద్యాపతి వందలకొలది రచించిన గేయములలో పరకీయాప్రణయం కుప్పతిప్పలుగా వర్ణితము. అయితే వంగదేశపు సహజయాన పంథీయులు తరచు ప్రచారముచేసినట్లుగా విద్యాపతి జీవితంలో పరకీయాప్రణయఘట్టములు ఆర్యసమ్మతముకాని కామవర్తనము, తారసిల్లినట్లు చెప్పడము అన్యత్ర నిర్ధారితమైన ఆయన ధార్మికప్రవృత్తినిబట్టి చారిత్రికముగా భావించలేము. సంస్కృతంలోవలెనే మైథిలీ కవితలో కూడ-కల్పనాశక్తితో కవి

అనుభవగాంభీర్యము వైయక్తికముకాకుండగనే హృదయానుభూతియేనా అనిపించునట్లు రచనలో ప్రదర్శితం కావడము సంప్రదాయము!

విశ్వాసదేవిపేర వచ్చిన రెండు గ్రంథాలలో ఒకటి 'శైవతత్త్వసారం' శివారాధనకు సంబంధించినది; 'గంగావాక్యావళి' పవిత్ర గంగా తీరమునగల పుణ్యక్షేత్రాల యాత్రకు సంబంధించినది రెండవది!

శైవసర్వస్వసారంలో శివపూజా సంబంధ విధులు కూలంకషంగా నిర్దేశింపబడి ఉంటాయి. ఇది మిథిలావాసులందరకు శ్రద్ధతో చదువదగిన గ్రంథం! ఇది ఇంకా అముద్రితము, దాని వ్రాతప్రతులు చాలాఅరుదు. గంగానదిపై రచన కూడా అంతటి ప్రాముఖ్యమూ కల గ్రంథము – ప్రధానముగా అహ్నికుడైన బ్రాహ్మణుడు నడుచుకోవలసిన దైనందినవిధులను గూర్చిన విపులమైన చర్చ ఆ గ్రంథంలో ఉన్నది. అది డా॥జె.బి. చౌధరీ పరిష్కారముతో-'సంస్కృత వాఙ్మయమునకు మహిళలసేవ' అనే శీర్షికా గ్రంథములలో ఒకటిగా ప్రచురితమయింది. ఈ కాలపు మిగిలిన రచనలన్నిటివలెనే ఈ రెండు గ్రంథాలలోను కూడ ప్రతిసిద్ధాంతమునకు ఉపబలముగా అనేక పవిత్రగంథములనుంచి ఎన్నోసూక్తులు ఉదాహృతమయి ఉంటాయి. బ్రాహ్మణుల విధ్యుక్త కర్మకాండలను వివరించే శ్రోత్రియ గ్రంథములన్నింటితోను విద్యాపతికి విస్తృతమైన పరిచయం ఉండినట్లు వీటివల్ల తెలుస్తుంది. ఆనాడు గ్రంథములన్నీ వ్రాతప్రతులలోనే ఉండేవనీ, ఏదైన సందర్భానికి కావలసిన ఆధారగ్రంథముప్రతి చేతికి అందుబాటులో ఉండడం ఆనాడు ఎంత అపరూపమో తెలిస్తే, విద్యాపతి ఒకసారి చదివిన విషయాన్ని మరవకుండా వినియోగించుకోడంలో ఎంతటి గట్టివాడో తెలుస్తుంది.

ఇంకొక విపులమైన గ్రంథం 'దాన వాక్యావళి', 1883 (క్రీ.శ.) లో ఇది వారణాసిలో ప్రచురితమయింది. ఇది నరసింహరాజా ద్వితీయ భార్య అయిన రాణిధీరమతి కోరికపైని, ఆమెపేర-అంకితంగా రచింపబడింది. ఈ గ్రంథంలో అనేక విధముల దానములు చేసేటప్పుడు సంకల్ప వాక్యములు శాస్త్రగ్రంథాలలో నిర్దేశించిన ప్రకారం ఒక్కొక్క దానానికి ఏ విధంగా ఉండాలో వర్ణితమైంది.

విద్యాపతి చిట్టచివరి రచన దుర్గా భక్తి తరంగిణి—శివ, గంగా, దాన గ్రంథాలాగే, ఇది మిథిలలో జన సామాన్యమునకు అభిమాన ప్రదమైన దుర్గాపూజ పండుగను గురించి విరివిగా వర్ణించిన గ్రంథము. రాజా ధీరసింహ

ఏలికగా ఉండినపుడు అతని సోదరుడయిన భైరవసింఘు ఆనతి చొప్పున సంకలితం అయిన గ్రంథమిది! అప్పటికి విద్యాపతి వయస్సు 80 సంవత్స రాలు దాటి ఉండాలి. దీని తరువాత విద్యాపతి రచించిన గ్రంథమేదీ పరిశోధకుల దృష్టికి అందలేదు.

ఈ గ్రంథాలన్నిటిలోను సాంఘిక ధార్మిక కర్మకాండలను విధులను గురించిన వివరణమే ఉంటుంది; కాని ఈ కాలానికి చెందిన ఒక గ్రంథం నర సింఘ దర్పనారాయణ ఆనతిపై సంకలితమైనది — 'విభాగసార' అనే రచన-హిందూ ధర్మానుసారం వారసత్వ విధానమును విపులీకరించినది, చారిత్రిక క్రమంలో దీనిరచన 'గంగా' వాక్యావళికి, దానవాక్యావళికి నడుమ కాలానికి చెంది నది. దేశంలో హిందూధర్మమును గూర్చి, వారసత్వమును గూర్చి అనేక గ్రంథము లుండగా, ఎనభై యేళ్ళు పైబడిన వయస్సులో విద్యాపతి ఈవారసత్వ ధర్మములను గూర్చిన గ్రంథమునెందుకు చేపట్టవలసి వచ్చిందో! అది యింకా ప్రచురితం కాలేదు. సాహిత్య లోకంలో దానికి రావలసినంత ఆదరం రాలేదు. ఈగ్రంథంలో వివరింపబడిన అంశములలో ఎక్కువ ప్రాధాన్యం వహించిన దొక్కటే—అది జ్యేష్ఠ సంతానమునకు ఔరసత్వాధికారమును గురించినదీ. రాజ్యమును ఒకరి కంటె ఎక్కువ సోదరుల నడుమ వంచియివ్వడము పనికిరాదనీని! నరసింఘ తన తండ్రి అనంతరం రాజ్యాధికారానికి రావడానికి ఒప్పుకొనని రణసింఘ అనే దాయాది దుర్లభనారాయణ అనే బిరుదు వహించి, రాజ్యంలో తనకు భాగం పంచి ఇవ్వాలని పేచీపెట్టాడు. అతని కొడుకులనుండి కూడా నరసింఘకు దాయభాగపు పేచీ రాగలదని నరసింఘ భయపడినట్లుగానే— చరిత్రలో అతని కుమారులు ముగ్గురూ కూడా రాజ్యాధికారం వహించారు. అందుచేత నరసింఘకు తాతయైన భావసింఘ, విద్యాపతి తాతయైన చండీశ్వర ఠాకూరును అర్థించి అభిషేక లాంఛనం అక్కర లేకుండగనే పరిమితంగా అయినా తన రాచరికమును సమర్థింప గోరినట్లుగా, నరసింఘ తనకాలపు విద్వద్దిగ్గంతియైన విద్యాపతి నర్థించి, కేవల వారసత్వ సంతానములో ఉన్న వారందరికి కాక జ్యేష్ఠ సంతానానికే రాజ్యాధికారము దక్కునని వ్రాయించుకొన్నాడు. విద్యాపతి తన ముత్తాతయైన వీరేశ్వరుని నీతిసారం నుంచి ఆధారములను ఉద్ధరించి, తన సిద్ధాంతమును సోపపత్తికంగా నిరూపించాడు. ఈ కాలపు ఒయినబరరాజులలో రాజ్యాధికార వారసత్వములో తగాదా ఉండినట్లు లౌకిక శకం 394 అనగా క్రీ. శ. 1503 లో

అనుమతీదేవి వేయించిన భగీరథపూర్ శాసనంలోని ఒక వాక్యం ద్వారా తేటపడు తుంది. ఈ రాణి భైరవ సింఘకు కోడలు, రామభద్రుని భార్య, చిట్టచివరి ఒయినబర రాజయిన కంస నారాయణుని భార్య! ఆమె తన వినయగుణము ద్వారాను, ఉదాత్త రాజకీయ చతురతవల్లను తన బంధు దాయాది వర్గములవారి అందరిలోను సామనస్య సౌహార్ధములను నెలకొల్పగలిగిందని, శాసనంద్వారా వెల్లడి అయినది, వంగదేశపు మహమ్మదీయ నవాబు సైన్యాల దాడిని ఎదుర్కో డానికి నరసింఘ కాలమునాటినుండి ఒయినబర రాజులలో మూడు తరాలుగా సాగుతూండిన మనస్పర్థలు సమసిపోవడానికి రాణి అనుమతి రాజకీయ విజ్ఞత ఫలించింది. ఈ సందర్భంలో విద్యాపతి రచనలు రాజకీయంగా చాలా ప్రాము ఖ్యాన్ని సంపాదించడమే కాకుండా తనకాలపు విద్వత్పురుషు లందరిలోను అతని పై గల గౌరవభావం వెల్లడి అయింది.

విద్యాపతి రచనలలో నలుగురికి బాగా తెలిసినవి మరి రెండింటిలో ఒకటి 'గయపట్టాలక'—ఇది గయలో జరుపవలసిన కర్మకాండలను వర్ణిస్తుంది; మరొకటి—వర్షకృత్య. ఇందులో ఏడాది పొడుగునా జరిగే పండుగల వర్ణన ఉంటుంది. ఈ రెండు గ్రంథాలలో ఒకదాని వ్రాతపతి కూడా పూర్తిగా లభించ లేదు; అంతేకాక దొరికిన గ్రంథ భాగాలకు కృత్యాదిని ఉండవలసిన అవతారికలు లేవు. అందుచేత, ఈ గ్రంథ భాగాలను విద్యాపతి అప్పుడప్పుడు చేకూర్చుకొంటూ ఉండిన విజ్ఞాపికలేగాని, పూర్తి గ్రంథాలనడానికి వీలులేదు. అందుచేతనే వాటిని రచించిన కాలము ఇదమిద్ధమని చెప్పడానికైనా వీలులేదు.

విద్యాపతి గ్రంథాల వ్రాతప్రతులేవీ కూడా మిథిలలో దొరకకపోవడం గమనించతగినది. 'పురుష పరీక్ష' తప్ప మిగిలిన గ్రంథాల వ్రాతప్రతులు కూడా అంత తేలికగా దొరకలేదు. కీర్తిలత, కీర్తిపతాక, గోరక్షవిజయ. నేపాల్ దేశంలో దొరికాయి; అదైనా ఒకే ఒక వ్రాతపతి, అనంబద్ధముగా ఉండినది. 'భూపరి క్రమ' అనే రచన ఒకే ఒక్క వ్రాతప్రతి కలకత్తా సంస్కృత కళాశాలలో సేకరించి నది. 'లిఖినావళి' వ్రాతప్రతియే లభించలేదు; అయితే 70 ఏళ్ళక్రితం దర్భంగాలో అచ్చయింది. అచ్చుప్రతి ఒక్కటి కూడా దొరకలేదు. శైవ సర్వస్వసారం, అసమగ్ర ప్రతి దర్భంగాలోను, సంపూర్ణ ప్రతి నేపాల్‌లోను దొరికాయి. పురుష పరీక్ష ఒక్కటే మిథిలలో జనాదరణ పొందిన గ్రంథం! విద్యాపతి గేయాలపై జనాదరణ వల్ల మిగిలిన గ్రంథాలపైకి ఎవరి దృష్టి పోలేదు. పండిత వర్గీయులమనుకొనే

వారంతా విద్యాపతి అభిప్రాయాలను ఇష్టమయీ కానట్లు స్మరించి, ఆయన ప్రామాణికతను గుర్తింపకుండా వదిలేస్తూంటారు, నైయాయిక వాచస్పతి మనుమడూ ప్రసిద్ధ నైయాయికుడూ అయిన కేశవమిశ్ర తాను రచించిన 'ద్వైవపరిశిష్ట' అనే గ్రంథంలో విద్యాపతి 'గంగా వాక్యావళి'ని శ్రద్ధా పూర్వకముగా స్మరిస్తాడు గాని, రాజాశివసింఘు వద్ద 'బిసపి' గ్రామాన్ని అరణముగా పుచ్చుకొన్నందుకు హేళనగా 'అతిలుబ్ధ నగరయాచక' అని విమర్శిస్తాడు. ఈనాటికి మిథిలలో దుర్గా పూజ విద్యాపతి గ్రంథంలో నిర్దేశించిన ప్రకారంగా కాకుండా ఇతర సంప్రదాయాల ప్రకారం జరుగుతూండడం గమనిస్తే, విద్యాపతి తన అభిప్రాయాలలో సమకాలికులకు కాలాతీతుడుగా తోచేవాడనీ, అందుకే అప్పటి శ్రోత్రియ విద్వద్వర్గం ఆయన అభిప్రాయాలపట్ల ఆదరం చూపేవారు కాదనీ గ్రహింపవచ్చు.

ఈ పరిశీలనలో విద్యాపతి జీవితకాలం నాలుగు విశిష్ట విభాగాలలో నడిచిందనీ, ఒక్కొక్క విభాగంలోను ఆయన తాత్కాలికంగా తన జీవిత వ్యావృతిని అనుసరించి ఒక్కొక్క విలక్షణ విషయంపై గ్రంథ రచన సాగించాడనీ తేలుతుంది. మొదటి అరవై ఏళ్ళ కాలంలోను ఆ తరువాతి యుగపు రచనా ధోరణికి పూర్వరంగ పరిణామం అనవచ్చు. ఈకాలపు చివర ఆయన రాజా దేవసింహ పరివారంతోపాటు నైమిశారణ్యంలో ఉన్నాడు. ఆ తరువాతి ముప్ఫయి ఏళ్ళు రాజా శివసింఘు ఆస్థానంలో ఆయన పూర్ణ పురుషుడుగా జీవించిన కాలం! ఆయన జీవితం అంతటికి అదే అత్యంత సౌఖ్యవంతమైన కాలం; ఆయన రచనా నైపుణి బహుపరిపక్వమై, ఆయనను చిరస్మరణీయుని చేసిన రచనలు పుట్టినదప్పుడే! ఆ తరువాతి 12 ఏళ్ళు ఆయన బ్రదుకంతటికి అంధకారపూరితము: నైరాశ్య వైఫల్యాలవల్ల ఆయన హృదయం మరిగిపోయిన కాలం అది! చివరి 20 సంవత్సరాలు ప్రశాంతంగా స్వగ్రామంలో గడుపుతూ, కొలువులో వయో జ్యేష్ఠుడయిన రాజనీత్యుపదేశకుడుగా, ధర్మశాస్త్ర గ్రంథాలను సంకలనము చేశాడు. ఆయన అదృష్ట చక్రపు క్రిందుమీదులలో జీవిత కష్టసుఖాల వెలుగు చీకట్లలో ఆయన ఏనాడూ వదలకుండా కొనసాగించినది రచనా వ్యాసంగము. తన మాటలలోనే చెప్పాలంటే, ఆయన కీర్తిలత చక్కగా అల్లుకొనడానికి గాను అక్షరముల రాటలు పాతి, పలుకు పందిళ్ళు కట్టినా డన్నమాట! విద్యాపతికి ఇద్దరు వివాహిత భార్యలు—వారిలో రెండవ ఆమెను మొదటియామె మరణించిన తరువాత చేసికొన్నాడో యేమో తెలియదు. మొదటి భార్యద్వారా ఇద్దరు కుమారులు ఇద్దరు కుమా

రైలూ, రెండవ ఆమెకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ళు! తరువాతి ఒక ఒయిన బర రాజువద్ద 'రాజముద్రాకాష్టక' ఉద్యోగియైన హరపతి అయన జ్యేష్ఠ పుత్రుని సంతతిలోని వాడు; దైవజ్ఞబాంధవం అనే జ్యోతిష గ్రంథము రచించాడు; ఆయన వంశీయులిప్పటికి ఉన్నారు. కాని వారు బిసపి గ్రామంలో కాక, సౌరథ అనే గ్రామంలో ఉంటున్నారు. దీనికి దగ్గరగా ఉండే 'మధుబని' అనే గ్రామంలో ఏటేటా లక్షలకొలదీ మైథిలీ బ్రాహ్మణులు సమావేశమయి, తమ పుత్రీ పుత్రుల వివాహములను ఏర్పాటు చేసికొంటూంటారు. విద్యాపతినుంచి ఏడవ తరానికి చెందిన నారాయణ ఠాకూర్ 'పురుష పరీక్ష! గ్రంథపు వ్రాతప్రతి తయారు చేశాడు. దానిని కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్ వారు భద్ర పరిచారు. ఈ రచయితయే దానిని పరిష్కరించి ప్రకటించడమయినది.

ఆ గ్రంథం వ్రాతప్రతి శాకిశకం 504 అనగా క్రీ. శ. 1613 (లేదా 1623) సంవత్సరంలో బిసపి గ్రామాన తయారయింది అని కీల్‌హార్న్ పండితుడు వ్రాశాడు. దానిని తయారుచేసిన నారాయణ ఠాకూర్ మనుమని కాలంలో ఆ కుటుంబం బిసపినుంచి సౌరథ్‌కి వలస వెళ్ళారు, ఇప్పుడు సౌరథ్‌లో ఉంటున్న వారసులు విద్యాపతినుంచి 16 వ తరానికి చెందినవారు; మిథిలలోని ఈనాటి గౌరవ పండిత కుటుంబాల వారెందరో విద్యాపతి ప్రథమ భార్య కుమారైల వంశాలకు చెందిన వారమని చెప్పుకొంటూంటారు.

మిథిల అంతటా విద్యాపతి మహిమాన్వితుడని చెప్పే గాథలు ప్రచారంలో ఉన్నాయి, విద్యాపతి భక్తిని మెచ్చిన సదాశివుడు 'ఉగాణ' అనే పేర కవి ఇంటిలో పనివాడుగా చేరి ఆయనను అనుగ్రహించాడట. శుక్లయజుర్వేద సంహిత లోని ప్రసిద్ధమైన రుద్రాధ్యాయంలోని శివస్తుతులలో ఒక దానిలో 'ఉగాణ' అనే శివనామం కనబడుతుంది. విద్యాపతి తన చివరిదశలో గంగా తీరమును చేరుకొన డానికని వెడుతూండగా ఇంకా తీరం దూరంగా ఉండగానే ఇంక నడవలేక ఆగి పోతే ఆ రాత్రికి రాత్రి గంగమ్మ తనదారి మార్చుకొని విద్యాపతి విడిసిన స్థలాన్ని ఒరసి ప్రవహించిందట. అమర్నాటి ఉదయం ఆయన ఆ గంగా తీరాననే కైలాస వాసి అయినాడట. 'పురుష పరీక్ష' గ్రంథంలో 30 వ కథలో 'నిజమైన పుణ్య పురుషుడు' అనే కథను కాయస్థ బోధి గురించి చెపుతూ గంగ తనకు దగ్గరగా వచ్చిన సంఘటన విద్యాపతి స్వయముగానే వర్ణించుకొన్నారని చెపుతారు. వాస్తవ

మేమైనా, మిథిలా ప్రజల దృష్టిలో రూపమెత్తిన పావిత్ర్యమే విద్యాపతియనీ, ఆయనకు మానవాతీత శక్తులు ఉండినట్లు విశ్వసించేవారనీ చెప్పి తీరాలి.

విద్యాపతి గేయముగా వ్యవహారములో ఉన్న ఒక గేయంలో రాజా శివసింఘను విద్యాపతి అతఘు మాయమైన 32 ఏళ్ళకు స్వప్నంలో దర్శించాడనీ ఆ తరువాతి కార్తికమాసపు శుక్లపక్షంలో ఆయన పరమపదించాడనీ తానే వ్రాసుకొన్నట్లు చెపుతారు. తాను బ్రతికుండగానే తన అవసానదినమును ముందుగా ప్రకటించగలగడం అపరూపశక్తియే. అనూచానముగా కార్తిక శుక్ల త్రయోదశి విద్యావతి మరణ దినముగా దేశం అంతటా అభిమానులు గుర్తించారు. ఈశాన్య రైలు మార్గంలో హాజీపూర్ బ్రాంచ్ వద్ద బెరౌనీ జంక్షను మీద విద్యాపతి నగర్ అను పేర గంగాతీరంలో విద్యాపతి ప్రాణాలు విడిచిన స్థలానికి సమీపాననే ఈనాడు ఒక రైల్వేస్టేషన్ ఉండడం గమనార్హము! పుణ్య పురుషులు సాధించవలసిన చతుర్విధ పురుషార్థములలో నాల్గవదియైన మోక్షము విద్యాపతికి గంగా తీరాన అసువులు వదలడం ద్వారా లభించిందన్న మాట. పరిపూర్ణముగా సార్థక జీవితమును నెరిపి, తాను ఆదర్శముగా రచనలలో చిత్రించినట్లుగానే తన జీవితమును ఆచరణలో పూర్తిగా అనుసరించి, పురుషార్థసిద్ధి పొందినవాడై 'నిజమైన పుణ్య పురుషుడ'నిపించుకొన్నాడు మహాకవి విద్యాపతి!

6

అదీ పూర్ణపురుషుడయిన విద్యాపతి వ్యక్తిత్వము, అయితే, విద్యాపతికి చిరయశస్సంపదను చేకూర్చినది ఆయన గేయకవిత; ప్రజల వ్యావహారిక భాషలో కవితను సృజించిన మహాకవులలో ఆద్యుడాయన! ఆ గేయముల లాలిత్యము హృదయహారి; అపరూప సౌందర్య శోభితములవి; భారతీయ కవితకు ఏవి కొత్త దారులను తీర్చినవి! కవిగా అతడెంతటి గొప్పవాడయినా ఆయన సంపూర్ణ వ్యక్తిత్వములో ఆ లక్షణము ఒక అంశ మాత్రమే! అంశకంటే పూర్ణమయినదే ఎక్కువ గదా! అందుచేత కవిగా ఆయన ఘనత బోధపడవలెనంటే ఆయనకు పూర్ణ పురుషత్వము చేకూర్చిన మహనీయ గుణములన్నీ తెలుసుకోవడం అవశ్యకమే కదా మరి! ఆయన అఖండమేధావి కనుకనే తనయుగపు కవితా స్పందనలను

అవలీలగా ఆకళించుకుని, తన నైపుణ్య శక్తులను పూర్తిగా తెలిసినవాడయి, ఒక నవ్యకవితా రీతికి దిట్టమైన పునాదులువేసి, తరువాతి తరముల కవులు శతాబ్దుల తరబడి అనుసరించడానికి మార్గ దర్శకుడయిన వైతాళికుడయినాడు: విద్యాపతి తన మాతృభూమికి, తాను జీవించిన పరిసర జీవిత చైతన్యమునకు తన సమాజమునకు తన వంశమునకు అమూల్య సంస్కృతి సంపదకు అనుగుబిడ్డ! ఆయన సహజ గుణసంపద అన్ని మూలకారణములు ఆధారములుగా రూపొందినది! తన కార్యరంగములో ఆయనకు ప్రతిబంధకములయిన శక్తులను వేరుచేసి పరిశీలింప పూనుకొంటే, మనము తప్పుదారిపట్టి, విద్యాపతి ఏనాడూ కలలోనైనా కానని విషయాలకయి ఆయనకు కీర్తిపతాకలు పట్టవలసి వస్తుంది.

ఒక చిన్న దృష్టాంతం; విద్యాపతి తన కవితలో ప్రయోగించినది తన కాలమునాటి జనులు మాటాడుకొనే వ్యావహారిక భాషే (మైథిలీ). అయితే ఆ భాషను తన గేయములలో తప్ప ఇతర రచనలకు ఉపయోగించలేదు. చారిత్రిక శృంగార గాథలతో కూర్చిన 'కీర్తిలతా', 'కీర్తిపతాకా' గ్రంథాలలో అయితేనేం శివసింహ సింహాసనాధిష్ఠితుడైన గాథా. విజయగాథలు వర్ణించే గేయాలలో అయితేనేం, అప్పటికి సుదూరభూతకాలములో వాడియుండదగినదీ; అప్పటికి పూర్వ కవులచే ప్రయుక్తమై సర్వాంగీకృతము కాజాలినదీ అయిన శిష్టవ్యావహారికమును ప్రయోగించాడు.

విద్యాపతి తీయపలుకు వెన్నెలవంకవలె కులుకు;
శివుని జాటాజూటముపై సిరులనొలుకు;
కవితా రసిక హృదయముల కొల్లగొనే మరుని ములుకు!'

అని 'కీర్తిలతా' కావ్యములో తన పలుకును గూర్చి విద్యాపతియే చెప్పుకొన్నాడు, ఈమాటలు—తన గేయ కవితలోని వాడుక భాషను విమర్శించు ఛాందస విమర్శకులకు జవాబుగా చెప్పినవిగా తోచవచ్చు. అయితే విద్యాపతి మైథిలీ భాషను తన నాటకములలోని గేయములకు మాత్రమే వాడి, లిఖనావళి, తరితర రాజకీయ ధార్మిక సూత్ర వివరణములన్నీ మైథిలీలోకాక, సంస్కృతములోనే రచించాడు. ఆనాడు అక్షరాస్యులయిన వారందరికి సంస్కృతమే ఆదరణీయముగా ఉండేదనీ, స్త్రీలలో ఆ అంశము లెక్కలోనికి రాదనీ చెప్పవచ్చు. విద్యాపతి తన పాటలను మైథిలీలో రచించడానికి కారణము అవి వ్రాయడానికి చదవడానికి ఉద్దేశింపబడినవి కాకపోవడమూ, పాడడానికి, వినడానికి, విని నేర్చుకొని

కంఠతా పట్టడానికి ఉద్దేశింపబడినవి కావడమే! విద్యాపతి పాటలలో కూడా రెండు రకాల మైథిలీ వ్యావహారికం కనబడుతుంది. రాచకొలువులలో విద్యాధికులు వాడే, అలంకార భూషితమైన తత్సమ పదాలతో నిండినది ఒక శైలి, రెండవది సరళమై, దేశి, లేదా, తద్భవపదాలతో నిండినది. తన శ్రోతల సాంస్కృతిక అంతస్థుకు తగినట్లుగానే ఆయన తన భాషను రూపొందించాడు. రాజు కొలువు సమావేశాల ద్వారాను, రాజబంధువులా రాజోద్యోగులా అనుబంధ వర్గాల ద్వారాను, విద్యాపతి కుటుంబమూ, బంధుమిత్రాది అభిమాన వర్గాలద్వారాను విద్యాపతి గేయాలు బహుళ ప్రచారాన్ని పొంది, విశాల మైథిలీ నరనారీజనుల కంఠములలో నిత్య చర్వితములైనాయి. ఆయన గేయకవితలన్నీ ఏదో ఒక శ్రోతృ వర్గాన్ని దృష్టిలో ఉంచుకొనకుండా కేవలం ఆత్మానందం కోసమే రచించినవి అనుకొనడానికి వీలురేదు. తరువాత తరువాత, గేయకవిగా ఆయన యశస్సు సుస్థిరమై సువ్యాప్తముకాగానే రాజా శివసింఘ 'జయత్' అను ఒక యువగాయక విద్వాంసుని నిత్యము విద్యాపతికి తోడుగా ఉంచి, తగిన సందర్భములలో ఆస్థానములోను. ఇతరత్రాను ఆ గేయములను రాగతాళ మహితములుగా గానము చేసే ఏర్పాట్లు జరిపించాడు. విద్యాపతి గేయముల విషయములో అత్యంత ప్రధాన విషయమును కూడా దృష్టిలో ఉంచుకొన్నప్పుడే, ఆ గేయముల ప్రాశస్త్యము స్పష్టముగా తెలుస్తుంది.

అదే కారణం మూలంగా, విద్యాపతి గేయకవితల పరిశీలనలో విద్యాపతి రచనగా అనుకొంటున్న గేయము విద్యాపతిదే అనడానికి ప్రామాణికతను గురించిన సమస్య తరచు ఎదుర్కోవలసి వస్తూ ఉంటుంది. పాటచివరి చరణపు పంక్తి ద్వయంలో కవి నామమును చేర్చడానికి భణితం అనే సాంప్రదాయిక నామం! ఈ భణితంలో విద్యాపతి పేరు ఉంటే ఆయనను ఆగేయానికి కర్తగా గ్రహించవచ్చు. ఈ పాటలు ఆనోటా ఆనోటా ప్రచారం చెందుతూ ఉండినప్పుడు ఎక్కువగా వాటిని స్త్రీలే గానంచేస్తూ ఉండడంవల్ల కొన్ని భణితాలలో విద్యాపతి పేరు జారిపోవడమో, ఆయనవి కాని గేయాలకు కొన్నిటికి అతని పేరు తగిలించడమో జరుగుతూండేది. అంతేకాక, అన్ని గేయాలకూ భణితాలుండేవి కావు. నేపాలులో దొరికిన గేయాలలో వ్రాతలో స్థలం పొదుపు చెయ్యడం కోసం భణితాలను వదలివేయడం జరిగింది, 18 వ శతాబ్దినాడు సహృదయులు సమకూర్చుకొన్న సంకలనాలలోనే భణితాలకు సంబంధించిన తారుమారు తప్పిబ్బు కలిగిస్తుంది. మిథి

లలో మాత్రం పాటచివర విద్యాపతి పేరును చేర్చి పాడే సంప్రదాయం ఇప్పటికి కొనసాగుతూంది. పిల్లకవులు చాలామంది తమ తమ గేయరచనలకు వ్యాప్తికోసమై కావాలని విద్యాపతి పేరు పాట చివర చేర్చడం పరిపాటి అయింది. వంగ దేశంలో అధమం ఒక్క కవి తన పాటలన్నీ విద్యాపతి పేరు భణితాలలో చేర్చి వ్రాసేశాడు.

అందుచేత విద్యాపతి గేయముల సమగ్ర సంకలనము సమకూర్చడము ఇంతవరకు జరగలేదు—ఇకముందు జరగగలదనుకోడం సంశయాస్పదం! ఆయన వాటిని ఎన్నడూ ఒక గుత్తిగా వ్రాసి పెట్టుకొని ఉండక, ఆశువుగా పాడుకొంటూ ఉంటే అవి మిథిలలోను, వంగదేశంలోను, నేపాలులోను ఆనోటనుండి ఆనోటికి అలా అలా వ్యాప్తిచెందాయి. గోపికలతో కృష్ణ భగవానుని ప్రణయ లీలలను చిత్రించే విద్యాపతి పదావళి వంగదేశంలోని వైష్ణవ పదావళీ సంకలనాలలో భద్రపరిచిన వాటినుండి ఒక సంకలనమును మొదటిసారి బెంగాలులోనే ప్రచురించారు.

చాలవరకు సమగ్రమనదగిన విద్యాపతి పదావళి సంకలనము, సవిమర్శ ముగా పరిష్కృతమయినది, పాట్నాకు చెందిన డా॥ బి. బి. మజుందార్ సంపాద కత్వములో వెలువడింది. బీహార్ రాష్ట్రభాషా పరిషత్తుకూడా విద్యాపతి పదావళీ సంకలనములను ప్రకటిస్తూ వచ్చింది. నేపాల్‌లోని ప్రాచీన తాళపత్ర ప్రతినుండి ఒక అమూల్య సంకలనమును డా॥ సుభద్రాఝా ప్రకటించారు. వారికి ముందు గానే మిథిలలో లభించిన వ్రాతప్రతి ననుసరించి పండిత శివనందన ఠాకూరు ఒక సంకలనాన్ని ప్రకటించారు. 18 వ శతాబ్దపు మధ్యభాగంలో మైథిలీ దేశపు సంగీతమును గురించి లోచన పండితుడు రచించిన రాగతరంగిణి అనే లక్షణ గ్రంథంలో విద్యాపతి పదావళి 53 వరకు లభిస్తాయి. నేపాలులో దొరికిన వ్రాత ప్రతి ఆధారంగా 77 విద్యాపతి పదావళితో సమకూర్చిన (37 సరికొత్తవి) భాషా గీత సంగ్రహం అను సంతలనము ప్రస్తుత గ్రంథకర్తచేత ప్రకటితమయింది. ఇవన్నీ కలిపిన విద్యాపతి గేయములు సమగ్రముగా లభించాయి అని చెప్పడానికి వీలులేదు. 390 పాటలతో (వాటిలో 30 ఇదివరకు అచ్చుకాలేదు). కూడిన రెండు వ్రాతప్రతులు మిథిలా ప్రాంతంలో దొరికిన వాటి ఆధారంతో ప్రస్తుత గ్రంథకర్త పాట్నా విశ్వవిద్యాలయానికి చెందిన మైథిలీ సంవర్ధకనిధి వారి యాజమాన్యమున ఒక విమర్శ సంకలనమును ప్రకటించడానికి ప్రయత్నించేశారు, కాని, 200 ఏళ్ళ

క్రీతం ఒక పండితునిచేత బహుశ్రద్ధగా పరిశోధితమై వెలువడిన 'భాషాగీత సంగ్రహ' అనే సంకలనము తప్ప మిగిలిన (ముందు వివరించిన) అన్ని సంకలనాలలోను కూడా తప్పులతో కూడిన పాఠాలతో నిండి ఉన్నాయి. కారణం స్పష్టమే. ఆ సంకలనాలను పరిష్కరించిన పండితులు మైథిలీ భాషరాని వారు కావడముచేతా, తాము పరిష్కరించే విషయమేమో అందులో క్షుణ్ణమైన పాండిత్యం లేని వారు కావడంచేతా అవి అలా సిద్ధమైనాయి. విద్యాపతి గేయముల ప్రామాణికతా నిర్ణయమూ పాఠాంతర నిర్ధారణా నిశ్చితమైనపుడే వాటి శాస్త్రీయ పరిశోధన సాధ్యమవుతుంది.

విద్యాపతి తన గేయాల రచన ఎప్పుడు ప్రారంభించాడో తెలియదు. అన్నిటిలోకి, భణితమునుబట్టి అద్యతనముగా చాలమంది గుర్తించిన 850 వ సంఖ్యగలదీ, కందర్ప పూజ ఇతివృత్తముగా రాజాభోగీశ్వరుని నామప్రశంసతో కూడినదీ అని చెప్పడం కద్దు కాని, అది బొత్తిగా అసంగతము. భోగీశ్వరుని కుమారుడైన గణేశ్వరుడు లౌకిక శకం 252 వ సంవత్సరంలో హతుడైన నాటికి, విద్యాపతి వయస్సు 12 ఏళ్ళు దాటి ఉండదు. విద్యాపతి 10, 12 ఏళ్ళ ప్రాయంలో ఉండగా తన తాతగారి ఈడువాడైన భోగీశ్వరుని ప్రసక్తితో శృంగార భూయిష్టమైన విరహిణీ విషాదగీతం రచించాడని విశ్వసించడం ఎలాగ? ఆయన మొట్టమొదటి సంస్కృత గ్రంథమయిన 'భూపరిక్రమం'లో శృంగార ప్రసక్తి ఏమాత్రమూ లేకపోగా, 'పురుష పరీక్షా' గ్రంథపు ఉత్తమ నాయకుల ఇతర ధీర లక్షణాలు వర్ణితములు కావలసినచోట శృంగారమే గాఢంగా చోటుచేసుకొంటుంది. సంస్కారవంతమైన విద్వత్కుటుంబానికి చెందిన సుశిక్షితుడైన కవి కిశోరుడు కావడంచేత, దానికి తగినట్లుగానే బాల్యదశ పరిక్రమించి, ప్రౌఢ వయస్సు అందుకొన్నాకనే విద్యాపతి రచనలలోనికి శృంగార ప్రసక్తి చోటుచేసుకొనడము సముచితముగానే జరిగింది.

విద్యాపతి గేయములు మూడు విధములు వాటిలో ఒక్కొక్క దానికి విశిష్టమైన సొంత లక్షణాలున్నాయి. అయితే అన్నిటికి సామాన్య లక్షణం ఒకటుంది; అది వాటిలోని భాష. అది ఆ కాలంలో మిథిలా ప్రాంతపు స్త్రీ పురుషులు తమలో తాము మాటాడుకొనే భాష. వాటి అన్నిటిలోను అత్యంతాదరము పొందినవి విద్యాపతికి లక్షలకొలది మైథిలీ మహిళలగళాలలో అమరత్వమునిచ్చి శతాబ్దాలుగా యశస్విని చేసినవి సాంఘికోత్సవాలలో పాడుకొనేవి. మిథిలలో జరిగే ఏ

శుభకార్యమునందైనా ఇలవేల్పును గూర్చి ప్రార్థనగా పాడుకొనే సంకీర్తనములు. రెండవరకపు పాటలు శివ కీర్తనలు, ఉమాశంకరుల వివాహమును గూర్చినవీ, కౌటుంబిక జీవనమును గూర్చెనవీని. విద్యాపతి రచించిన కొత్తరకపు పాటలకు చాలా జనాదరము పొందినవని వాటిని 'నాచారి' పదములంటారని జౌన్పూరుకు చెందిన ఒక కవి ప్రశంసించాడు. అబుల్ ఫజల్ తన ఐనీ అక్బరీలో విద్యాపతి పాటలన్నీ, ఉద్ధృతమైన శృంగారము ఇతివృత్తముగా కల వాటితోసహా — 'లాచారీ' పదములంటారని పేర్కొన్నాడు. ఈ పాటలన్నీ దేశం అంతటా శివ భక్తులకు ఆదరపాత్రములైనవి-ప్రసిద్ధ శివాలయాలలో ప్రతిదినమూ సంకీర్తన ములుగా పాడుకొనే పాటలవి! అన్నిటికంటె చివరి (మూడవ) రకం అతిముఖ్య మైనవి. ఆయన కీర్తికి మూలస్తంభాలు అనదగినవి—నాయికా నాయక భావంతో వివిధ దశలలో అనుభూతులతో హావభావాది చేష్టలతో కృష్ణపరమాత్మతో గోపికల ప్రణయలీలలను కొన్ని సామాన్య యువతీ యువకుల ప్రణయ సందర్భాలను శృంగార రసమునకు అలంకార, కామశాస్త్రములలో చెప్పబడిన అన్ని విడంబన ములతోను వర్ణించే గేయములు.

విస్తృతమైన విద్యాపతి గేయకవితా కృషిలోని వివిధ రీతుల విడంబన మును గూర్చిన పరిశీలనలోనికి దిగేముందు, ఈ విస్తృత కృషికి కారణము, ఉద్బోధకమును అయిన సాంఘిక సాంస్కృతిక నేపథ్యమును, వివరించడమూ, ఆ ప్రయోగములో కవి సాధించిన విశిష్ట సిద్ధులేవో తెలిసికోవడం సమంజసం! శతాబ్దాల తరబడి విద్యాపతికి యశస్సు చేకూర్చిన బిరుదావళిలో రెండు ఆయన గోరక్షా విజయ నాటకములోను బిసపి గ్రామదాన శాసనములోను, కర్ణపరంపరగా వచ్చే అనుశ్రుతిలోను, తప్పకుండా ఆయన రచనలే అని చెప్పగలిగిన గేయముల భణితములలోను ప్రశంసనంది ప్రామాణికతను గణించుకొన్నాయి. తన జీవిత కాలంలోనే ఆయన 'అభినవ జయదేవు'డనే ప్రశస్తి పొందాడు; మరొక బిరుదము 'కవి కంఠహారము' విద్యాపతి వివిధ బిరుదులను గూర్చిన విమర్శముగా చర్చిం చిన డా॥ బి. బి. మజుందార్ అన్నిటిలోను ఈ రెండు నిస్సంశయముగా ఆయన బిరుదములే అని నిర్ధరించారు. ఇవి రెండూ సార్థకములైన బిరుదములే! వాటి సార్థకతను గూర్చి లోతుగా సమీక్షిస్తే కవితా ప్రయోగములో అతని కుద్బోధకము లైన ఆదర్శములు ఏవో సహృదయ హృదయములను ఆ ప్రయోగము లెంతగా మనోహరములై ఆకట్టుకొన్నవో తెలుస్తుంది.

విద్యాపతి రంగముపై ప్రవేశించడానికి కొన్ని శతాబ్దులు ముందునుంచీ కూడా, ఈశాన్య భారతంలోను, ముఖ్యంగా మిథిలలోను కవితా వ్యాసంగము రెండు విధాల ధోరణులలో సాగుతూ వచ్చింది ఈ రెండూ కూడా రసికరంజక ములే కాని ఉదాత్తములని చెప్పడానికి వీలులేదు. వాటిలో ఒకటి ప్రాచీనకాలం నుంచీ కొనసాగి వస్తూండిన సంస్కృత కావ్యధోరణి. ఈ ధోరణికి ఉదాహరణ అమరుక శతకము. అమరుక శతకంలోని ఒక్క శ్లోకమే నూరు కావ్యాలకు సమానమని ప్రశక్తి పొందింది. సంస్కృతంలోని అలంకార శాస్త్రంలోని సూత్రము లకు లక్ష్యప్రాయమై సంస్కృత ఛ్ఛందస్సులలో వ్రాసిన పద్యకావ్యం అమరుకం, సంస్కృత కవులు వ్రాసిన ఆటువంటి కావ్యములకు విద్వత్సమాజములోను రాజ సభలలోను మంచి ఆదర గౌరవములుండేవి. భారతదేశం అంతటికి సంస్కృతము సాంస్కృతిక సంపర్క భాషగా ఆనాటి విద్యావంతులంటే సంస్కృతం తెలియనివారు ఉండరు గనుక దేశం అంతటా చలామణి అవుతూ ఉండేది. ఈ కవితలో భావు కతా, శృంగార రసప్రధానేతివృత్తాలూ ఉండేవి; స్తోత్ర ప్రాయకీర్తనలు భక్తిసంకీర్త నలూ కూడా కతిపయంగా ఉండేవి. ఇంక రెండవ ధోరణికి చెందిన కవితావాహిని జానపద కవితా రీతులననుసరించి, శిష్ట వ్యావహారికంలో ఎన్నికగన్న పలుకుబడు లతో (శిభాషలలో) సాగేది. ఇట్టి సాహిత్యంలో అత్యంత ప్రాచీనమయినది గాథా సప్తశతి — (ఇది ఆంధ్ర శాతవాహనుల పాలనకాలంలో పశ్చిమ, మధ్య భారత ములలోను దక్కనులోను వెలసిన ప్రాకృత కవితా సంకలనం). కాని, ఆర్యా వర్తపు ప్రాగ్దేశం (తూర్పు)లో కాళిదాస మహాకవి విక్రమోర్వశీయంలో ప్రసక్త మయిన చర్చరీ నృత్య గేయములద్వారాను, పాలవంశపు రాజులనాటి వజ్రయాన సిద్ధుల గేయాలద్వారాను, ప్రజాదరణ పొందిన దేశి కవితారీతి ఈ రెండవ ధోరణికి చెందినది, 'బౌద్ధగానము, దోహాలు' అని ప్రకటితమైన ధోరణికి చెందిన దేశిభాషా కవితా గానములలో ఆర్యావర్తములోని ఈ ప్రాంతానికి చెందిన ఆయా రాగాలలో గేయములు పాడదగును అనే సూచనకు తోడు, ఆ గేయముల చివరి చరణములలో భణితము అనే సంప్రదాయము ననుసరించి, ఆ గేయ రచయిత పేరు నిబద్ధమై ఉండడము గమనార్హము.

ఈ సంస్కృత కావ్యధోరణినీ, దేశిభాషా గేయధోరణినీ మిళితముచేసి, సంస్కృత కవితలో నవ్యమార్గమును త్రొక్కిన ఆదిగురువు జయదేవుడు ఆయన భాష సంస్కృతమే. ఆయన కావ్యపు ఇతివృత్తము మాత్రము శ్రీమద్భాగవతములో

వర్ణితమైన కృష్ణ భగవానుని ప్రణయ లీలలు, ప్రాకృత కవితా కాలమునాటి గాథలలో కూడా ఈ ఇతివృత్తంపైని కవితలుండేవి. శైలి, ధోరణి, మనోధర్మ వివృతి అంతా సంస్కృత కావ్య సంప్రదాయానుసారమే. కాని, జయదేవుని కవిత లోని గేయ శిల్ప ధోరణి మాత్రము తూర్పు భారతములోని జానపద దేశి కవితల మార్గముననుసరించింది. ఈ గేయములు రాగయుక్తముగా పాడవలసినవి. ఆనాడు ఆ ప్రాంతములో ప్రచారములో ఉండిన రాగములే సూచింపబడినవి, చివర చరణములోని భణితములో కవి పేరు వాడడము సంస్కృతములో అదే తొలిసారి. స్వచ్ఛ సుందర కవిత్వమూ మనోహర రాగమాధురీ రెండూ సామ రస్యము చెందిన గీత గోవిందపు నవ్య కవితా రీతి—భాష అర్థము కాని వారిని కూడా మధుర కోమలకాంత పదావళితో మృదు మనోజ్ఞలయగతులతో పరవశు లనూ సమ్మోహితులనూ చేసి వేసింది.

కర్ణాటక రాజుల పరిపాలనతోపాటు మిథిలా రాజ్యములో సంగీత నృత్య ములకు మంచి ప్రోత్సాహము లభించి, వర్ధిల్లిన సంగతీ, వాటికి ఆనాటి సాంఘిక జీవన వ్యాపకములలో ప్రధానస్థానము లభించినదనీ జ్యోతిరీశ్వరుడు రచించిన వర్ణన రత్నాకరములో తెలుస్తుంది మిథిలా సాంఘిక జీవనంలో పాటకు నాటి నుంచి నేటివరకూ కూడా విడతీయరాని స్థానం ఏర్పడింది. అది ధార్మికమైనా, సాంఘికమైనా, ఋతూత్సవమైనా, మైథిలీ గృహాలలో పాటలేని పండుగలేదు.

విద్యాపతి జయదేవుని ఒరవడిని అనుసరించాడు. తనకు రెండువందల ఏళ్ళక్రితం జయదేవుడు చేసినట్లుగానే, పాలివంశపు రాజుల నాటినుండీ దేశంలో వ్యాప్తంగా ఉండిన దేశికవితా గేయాల శిల్పాన్నీ, తన కాలమునాటి తన దేశపు యువతీ యువకులు మాటాడుకొనే మైథిలీ భాషలోని తీయపలుకుబడులనూ స్వీకరించాడు తన మైథిలీ గేయ కవితకు! తాను రచించిన చారిత్రిక ఇతిహాసము లలో వాడిన శిష్ట వ్యావహారికమును ఈ గేయకవితలలో వాడలేదు. ఇతివృత్త ములో (అంటే నాయికా నాయక వివిధ భేదాలతో, వివిధావస్థలతో కూడిన సంస్కృతాలంకారిక శాస్త్రలక్షణాలను అనుసరించిన) సంస్కృత కావ్యధోరణినే అనుసరించాడు. జయదేవునికంటె విద్యాపతివేసిన ఆ ఒక్క ముందడుగు ఏదంటే, సంస్కృత కవితలను చదువుకొని ఆనందించలేని తన దేశపు సామాన్య యువతీ యువకులకు కూడా ఆరసానందానుభవాన్ని వారి మాతృభాషయైన మైథిలీ భాషలో అందించాడు, అంటే జయదేవుని కవితలో వలెకాక, విద్యాపతి కవితలో

మైథిలీ సామాన్య నరనారులకు అర్థమాధుర్యమూ శబ్దలాలిత్యమూ రెండూ అను భవానికి అందినవన్నమాట. అందుకే ఆయనకు అభినవ జయదేవుడనే బిరుదము సార్థకమైనదని చెప్పవచ్చును.

మైథిలీ కవితాకాశంలో ఉజ్జ్వల సూర్యునివంటి విద్యాపతి వెలుగు ముందు తక్కిన గ్రహములూ తారకలూ చూపుమేరలోకి కూడా రాకుండా ఏష్యమై పోయాయి; ఆయనకు పూర్వకవుల రచనలుగాని, సమకాలికులవిగాని, తరువాతి వారివిగాని ఆనోటా ఆనోటా రసిక కంఠాలలో మోగి మోగి క్రమంగా ఏష్యమై పోయినవనిగాని, లేదా, ఇంకా ప్రచారంలో ఉంటే భణితంలో విద్యాపతి పేరుతో 'చలామణీ' అవుతూ వచ్చాయనిగాని తెలుస్తుంది. విద్యాపతికి మధుర కంఠస్వరం ఉండేదనీ దానితో ఆయన మనోహరంగా గానం చేసేవాడనీ ఊహించవచ్చు. తన గృహ బంధువర్గాలలో నారీజనం పాటలు పాడుతూంటే విని, బాల్య వయస్సులోనే వారు తిరిగి పాడుకొనడానికి అనువయిన గేయాలను ఆయన రచించేవాడని, సాంఘికోత్సవాలలో వారు పాడుకొనే పెళ్ళి పాటలతో ప్రారంభిం చిన ఆయన కవితారచన క్రమంగా శృంగార పదావళి రచనలో పరిపక్వమై తన బంధుమిత్ర నారీలోకపు గళమాధురికి అందించేవాడు. ఆరంభదశలో విద్యాపతి తన గేయకవితలను గానంచేసే నారీజనంకోసం వ్రాసినట్లు కనబడుతుంది. కవితా రచన ఆయన ప్రధాన వ్యావృత్తి కాదు. రాజాస్థానానికి చెందిన నయకోవిదుడు; ఆయన గేయరచనా ప్రశస్తి కర్ణాకర్ణిగా రాజును చేరేసరికి రాజు కోరికపైని ఆయన గేయకవితలను చేయనారంభించాడు. ఆక్కడకూడా, అంతఃపురవాసిను లైన రాణులను తదితర నారీజనమునూ ఈయన కవితలు ఎక్కువగా ఆకర్షిం చాయి పురుషులకు ఆ రసానందము సంస్కృత కవితలద్వారా అన్యత్ర దొరకు తూనే ఉండేది. ఆయన గేయాలను విని, పాడుకొనడం ద్వారా ఒకసారి రసా నందానుభవం చెందిన నారీజనం అంతటితో తృప్తిచెంది ఊరుకోక, తిరిగి తిరిగి ఆ కావ్యానందమును అతోధికంగా కోరేవారు. విద్యాపతి స్త్రీ హృదయ స్వభావాల లోతులు బాగా తెలిసినవాడు కావడంచేత ఆయన గేయాలలోని నాయికల నిగూఢ మయిన హృదయానుభూతుల చిత్రణం చాలా స్వభావ సిద్ధంగా, అతిసహజంగా ఉండడంచేత నారీజనానికి అవి చాలా ఆత్మీయములై ఆదర పాత్రములయినవి. అందుచేత నారీ కంఠముల ద్వారానే వాటికి బహుళ ప్రచారం లభించి, చివరికి ఎవరో ఒక రొక లిఖితప్రతి సిద్ధము చేసికొనేవారు. ఇటీవలి వరకు మిథిలలోని

ప్రతి నాగరక కుటుంబమునకు ఒక స్వాంతమైన లిఖితప్రతి ఉండేది. అటువంటి కౌటుంబిక లిఖిత ప్రతులద్వారా సేకరించిన పదావళినే ఆధునిక సంకలనాలుగా ప్రచురించడమయినది. విద్యాపతి ఏనాడును తన గేయకవితలను లిఖితముచేసి నట్లు కనబడదు, ఆయన స్వహస్తముతో వ్రాసికొన్న గేయమొక్కటీ ఇంతవరకు దొరకలేదు. అప్పటివలెనే ఇప్పటికి ఎప్పటికి కూడా ఈగేయకవితలు పాడే గాయనీ గాయకుల కంఠములకు భూషణప్రాయములు కనుక విద్యాపతికి అభిమానులు ఆదరముతో ఇచ్చిన 'కవి కంఠహార' బిరుదము అన్నివిధాలా సార్థకమే అని చెప్పాలి.

7

మిథిలలో సాంఘిక శుభకార్యాలకు, మొదలైన అనేక సందర్భాలకు ఉచితమైన స్త్రీలు పాడుకొనే పాటలను వ్యవహార గేయములంటారు. ఇవి నారీ జనానికి బహు ఆదరపాత్రములై నిత్య వ్యవహారములో అనోటినుండి ఆనోటికి వ్యాపించడమే కావి, లిఖిత ప్రతులకు ఎక్కేది చాలా అరుదు. అందుచేత వీటి ప్రామాణికత చాలా సంశయాస్పదమై (పాఠాంతరాలతో కూడి) ఉంటుంది. ఏవో కొన్ని భక్తిపాటలు, దేవీ స్తుతికీర్తనలూ మైథిలీ గృహాలలో ప్రతి పండుగకూ పాడుకొనే పాటలున్నాయి: శివపార్వతుల వివాహ కథకు సందర్భించిన పాటలు ప్రతి పెళ్ళిలోను పాడుతుంటారు; ఉచిత గేయాలని పెళ్ళిళ్ళలో ఆడ పెళ్ళివారి పేరంటాళ్ళు పెళ్ళికొడుకునుద్దేశించి 'మాపిల్లను ఆదరంగా తప్పులను పాటించక దయతో ఏలుకోమని కోరుకునే పాటలు—ఇటువంటి వాటినన్నిటినీ వ్యవహార గేయాలంటారు వీటిలో ఏకొన్నో విద్యాపతి గేయములుగా పేరుపడినవి తప్ప విద్యాపతివే అని నిర్ధరించదగిన పాటలు వీటిలో చాలా అరుదు. ఆయన పేరు మీద చలామణీ అయే పాటలు నిజముగా ఆయనవేనా అని సంశయించిన సంద ర్భాలు కూడా చాలా ఉన్నాయి. ఈ గ్రంథకర్తకు అటువంటి పాట ఒకటి నాలుగువందల యేళ్ళనాటిది తాళపత్ర ప్రతిలో దొరికింది. వ్యవహార గేయములు అనే పాటలకు అది మంచి ఉదాహరణము. అటువంటి పాటలను ఈనాటికీ మిథిలలో పాడుతూ ఉంటారు. పెండ్లి అయిన తర్వాత ఒక యేడాది వరకు

భోజన సమయంలో వరుణ్ణి ఉద్దేశించి ఈ పాటపాడతారు. వీటిని 'జోగా' అంటారు. కొత్తగా పెండ్లయిన వధువుకు వరుని వశీకరణము చేసికొనడానికి ఉపయోగించే మంత్రాలను గురించి ఆ పాటలలో ఉంటుంది. ఇటువంటి పాటలలో ఇతివృత్తం సూటిగా ఒక పల్లవిలో తెలియాలంటే విద్యాపతి పాటలలోని ఒక పల్లవిని ఉదాహరణగా తీసుకోవచ్చును :

'వన్నెలాడుల వగలు కన్నారి వినవె
నీ మాట జవదాట నీయకే మగని.'

—అని పల్లవి ప్రారంభించి, ఆ తరువాత మూలికలతో తయారుచేసే ఒక పానీయమును గురించో, లేదా, ధూపంవెయ్యడానికి సాంబ్రాణిలో చేర్చవలసిన పొడులో, కళ్ళకు అద్దవలసిన ప్రత్యేకమైన అంజనమో ఈ విధంగా కామశాస్త్ర గ్రంథాలలో నాయిక తన పురుషుని వశీకరణ చేసికొనడానికి వినియోగించే ప్రయోగాల వర్ణన ఉంటుంది. దానిలోని బీభత్సరసానికి పోలిక కావాలంటే షేక్స్‌పియర్ మెక్బెత్ నాటకంలో మంత్రగత్తెల పాట చక్కగా సరిపోతుంది.

ఈ పాటలకు తగిన ఆదరం లభించకపోవడం శోచనీయం! కొంతవరకు అవి కావాలంటే దొరకకపోవడం కారణం! అంతేకాక, అవి ఆ ప్రాంతపు సాంఘిక జీవన విధానంలో ఒక భాగం కావడంచేత ఆ సాంఘిక నేపథ్యంలోనే వాటికి తగిన మెప్పుకలుగుతుంది. వాటికి సంబంధించి కొన్ని నోములు వ్రతాలు ఉన్నాయి. వాటిని గూర్చి ఎక్కడా ఎవరూ వ్రాసి ఉండలేదుగాని, ఆయా వ్రతాలలో పాల్గొనే నారీజనానికి ఆ విషయాలు బాగా తెలుసు. ఆ పాటలలోనే ఆ వ్రతాలను గురించిన వర్ణనలుంటాయి. గనుక. ఆ సమాచారం పాటలనుండే దొరుకుతుంది ఆ పాటలలోనే ఆ వ్రతాలు, ఉద్యాపనలు మొదలైన వివరాలుండడంచేత, ఒకతరం తరువాత మరొకతరం ఆ పాటలనుంచే ఆ వ్రతాల వివరాలను నేర్చుకుంటారు. అందుచేత, తరతరాల స్త్రీల నోళ్లలో ఆపాటలు వినబడుతూ ఉండడంచేత, వాటిద్వారా ఆ వ్రతాలూ ఆచారాలూ తరతరాలకు బదిలీ అవుతూ వచ్చాయి. అవి మరపులో పడిపోకుండా ప్రచారంలో ఉండడంచేత సాంఘిక జీవనంలో ఆ వ్రతాలూ నోములూ ఒకే సంప్రదాయాన్ని అనుసరించి తరతరాలా కొనసాగుతూండడంచేత వాటికొక సాంస్కృతిక ప్రాముఖ్యం వచ్చింది. కవితా శిల్పంలో చాలా సరళమై భావమాధురిలో శృంగారమయమై, ప్రయత్న పూర్వకమైన ప్రయోగశ్రమ అక్కరలేకుండానే అవి సర్వజనాదరణ పొందుతూ వచ్చాయి;

అవి పండితులను పామరులనూ ఒకే విధంగా రంజింపజేస్తూ అందరికీ సమానంగా ఆదర పాత్రమైనాయి. అటువంటి పాటలు: ఒక వటువుకు ఉపనయనం చేస్తున్నప్పుడు—వాని పితృదేవతలు తమ వంశపు మూలకందానికి ద్విజత్వం వస్తున్నదని ఆనందిస్తున్నట్లు వర్ణించేవీ; వధువును అత్తవారింటికి పంపేటప్పుడు పాడే అప్పగింతల పాటలు—ఇవి పుట్టింటివారి మనోభావాలను జాలిగొలిపేటట్లు వర్ణిస్తాయి; కొడుకు పుట్టినప్పుడు పాడేవి, అరుదుగా కూతురు పుట్టినప్పుడు పాడేవి-మేనత్తలు శిశువు తల్లికి బహుమతులు కోరుతూ పాడే పాటలు; వాన పాటలు; (మలారా, పవాసా) పెనిమిటి గ్రామాంతరం కాని దేశాంతరం కాని వెళ్ళిన వధువులు ఊయలలూగుతూ విరహమును వెళ్ళబోసుకునే పాటలు, ఇలాగ ఎన్నో! వీటిలోని అనుభూతులు సంఘములోని నరనారులందరకూ సొంతమనిపించేవే, సరళమైన శృంగార భావభరితమైన తియ్యని పలుకులతో హృదయమును ఊగిసలాడించే లయాన్వితమైన సంగీతంతో ఆనాటి నుంచి నేటివరకు నారీ కంఠాలను మెరపు తీగలలాగ మ్రోయిస్తూ వేలకొలదీ పాటలు విద్యాపతి కాలమునుండీ ఒక్కే గురువు చూపిన ఒరవడిలో వందలకొలది కవులు పాడిన పాటలవి!

విద్యాపతి శివకథా గేయాలలో ముఖ్యంగా పర్వత రాజకుమారియైన పార్వతితో శివుని వివాహమునకు సంబంధించిన పాటలు మిథిలలోని నారీజనం తమ యిళ్ళల్లో జరిగే పెళ్ళిళ్ళలో పెళ్ళి పాటలుగా పాడుకొంటారు. ఇవికాక శివునికి ప్రియమైన డమరుకం వాయిస్తూ శివభక్తులు ఒక విలక్షణమైన రాగ ధోరణిలో గానంచేసే 'నాచారి' పాటలను కూడా రచించాడు విద్యాపతి. ఆ పాటలోని ఇతివృత్తం కాక, దాన్ని పాడే వర్ణమెట్టునుబట్టి ఆ రకపు పాటలను 'నాచారి' పాటలు అంటారు. ఏ శివాలయంలోనైనా నాచారి పాటలు పాడే శివ భక్తులు పూనకంతో నృత్యంచేస్తూ కనబడుతూంటారు. మిథిలా దేశపు ప్రజలు ప్రధానంగా శైవులే అని చెప్పాలి. శక్తి ఆరాధకులు కూడా శివుని అదే భక్త్యావేశంతో సేవిస్తారు. శైవ గీతాలనేకం రచించడంచేత మైథిలీ ప్రజ అతడు శైవుడని భావించడమూ, 'ఉగణ' అనే పేరుతో శివుడు విద్యాపతి యింటిలో పరిచారకుడుగా అనుగ్రహించాడని భావించడమూ ఆశ్చర్యము కలిగించవు.

ఇతివృత్తాన్నిబట్టి విద్యాపతి శివకథా గేయాలు మూడు విధాలు! ఆత్మ శుద్ధితో కూడిన భక్తిభావంతో అనుతాపపూరితాలై, సంపూర్ణ ప్రపత్తితో మధుర

శబ్దాలతో సరళమైన భాషలో సర్వ జనాకర్షకమైన లయబంధములో విద్యాపతి రచించిన ప్రార్థనాత్మకములైన శివస్తుతులు ప్రజలందరకూ ఆదరపాత్రములు. స్త్రీ పురుష కులవర్గభేదములతో నిమిత్తము లేకుండ హిందువులందరకూ శివుడు ఆరాధ్యుడే.

"నా బాధల నెన్నడు నిర్మూలింతువో భోలానాథా"
"కడలివంటి బ్రదుకావలిగట్టు దాటుటెన్నడో
కానరాదె అంతు బ్రదుకు కడలికి భైరవదేవా
ఆవలిదరి అందుకొనగ నీవె తెడ్డు వేయవోయి!!"

—జనులకు అత్యంత ఆదర పాత్రములయిన విద్యాపతి శివభక్తి గేయాలలో ఇవి ఒకటి రెండు; భక్తజనుడు బ్రదుకులో తన నిస్సహాయతను గూర్చి పాడుకొనే ఈ పాటలు చాలా కరుణరసోత్పాదకంగా ఉంటాయి. జీవితంలో కాని, శివుని రూపంలోను లీలలలోను గాని పరస్పర విరోధాలుంటే, విద్యాపతి భక్తిలో కూడా ఉదాత్తమైన హాస్యరసాన్ని కలిగించిన పాటలు కొన్ని ఉన్నాయి.

"శంభో సర్వ శుభంకరా, శంభో పరమదయాకరా,
పంచబాణు దహియించిన దేవరా,
సగము దేహమున మీసమ్ములతో మగతనమ్ము చూపగనేలా?
సగము మేన ఎడమవైపు సతివై చనుబాలను చేపగనేలా?
—గౌరి భూరి గుణములు మేననలంకారముగ ధరింపగోరియా
చేర్చుకొంటివామెను సామేన, కించపడకించుకే నపకీర్తికి!"

రెండవ శ్రేణికి చెందిన పాటలు శివపార్వతుల వివాహ కథలోని వేరు వేరు ఘట్టాలకు చెందినవి.

"తలలైదు మూడు కన్నులు తనకంట;
అందుపై అగ్నిగ్రేలునట నొక కంట!
జటల తలపాగయై జారునట గంగ;
నెలవంక బొట్టటం నెన్నుదుట తాల్చు!
మసనంపుబూదియే మైపూతయంట;
మొలచుట్టు గజచర్మమును తాల్చునంట;
ఎద్దుపై నెక్కి ఊరేగెడి జోదు;

మెడను నొడల పాముమెలికలే నగలు;
గొంతు దిగదు కాలకూటంపు నలుపు;
భూతగణాలకు నేతంటతాను;
కల్పాల వయసు మహాకాలుడేడం-
హిమవంతుగాదిలి యిగురుబోడేడ-
తనకు నాతనికి పొంతనలెట్లు కలియు ?''

కాళిదాసు కుమార సంభవంలో పార్వతి శివుణ్ణి భర్తగా పొందడానికి కఠోర తపస్సుచేస్తూ ఉంటే, శివుడు ఒక బ్రహ్మచారి రూపం ధరించి, ఆమెను కలుసుకొని, ఆమె దీక్షను, అంతశ్శుద్ధిని పరీక్షించడానికై ఆమెతో వాదం పెంచుకుని, ఆమెవంటి కన్నెపిల్లకు, రాకొమార్తెకు ఎంత మాత్రము తగని అసందర్భాలన్నీ శివునిలో ఉన్నాయని వర్ణిస్తాడు. కాళిదాసు ఏడు శ్లోకాలలో చెప్పిన ఆ హేళనమంతా, ఆ వ్యంగ్యమూ వెటకారమూ అంతా 10, 12 పాటలకు పైగా విద్యాపతి పార్వతి తల్లి నోటా, చెలులచేత, కుటుంబ స్నేహితులైన పేరంటాళ్ల చేతా పాడించినట్లు రచించాడు. శివుని వ్యక్తిత్వాన్నీ, వయస్సునీ, రూపాన్నీ గుణాలనూ, ఆయనకు సంబంధించిన అనేక అనుభవాలనూ హేళనచేస్తూ ఉన్న ఆ పాటలు 'నిందాస్తుతు'లన్న మాట! పార్వతి తల్లియైన మేనక యిలా అంటుంది :—

''పుట్టినప్పటినుండి పుర్రె చేతనుబటి
కడప గడపను బిచ్చమడుగుకొను బతుగు!
ఎట్లు మాబిడ్డ గౌరికి పెండ్లి కొడుకవును ?
ఎంత దుస్సహమమ్మ ఎంత దుస్సహము ?
ఎవరిచ్చిరే యితనికి శంకరుండను యింతటి శుభనామము ?
హతముచేసెనట అతడె ఆ పురాసురుని!
అయిదు తలలట తనకు!
అగ్గికురిసే కంటితో మూడు కనులంట-
ఎవరింట పుట్టెనో ఎవరెరుంగుదురమ్మ ?''

ఒక పొరుగింటి పేరంటాలు ఏమంటున్నదో :—

''అక్కరో ఎటువంటి అల్లుడు దక్కెనే మన అద్రిరాజుకు ?
అచ్చెరువుకాదటే ముదునలి పిచ్చివాడెక్కడట గుర్రము ?

ఎంత హుందా జీనుకళ్ళెము లిచ్చినా తన కిసడింపే!"

ఈనాటికి కూడ మిథిలలో వధువు తండ్రికి గాని, రక్షకునికి గాని, వరాన్వేషణలో సహాయపడి, వరుణ్ణి కుదిర్చే 'పెళ్ళిళ్ళ పేరయ్య'ల వంటి మధ్య వర్తులను గుర్తుంచుకొంటే, విద్యాపతి పాటల్లోగాని, ఈ ఉమావరాన్వేషణ పాటలలో గాని మిథిలా నారీజనము పాడే వాటిలో శివునివంటి వరుణ్ణి వెదకి తెచ్చినందుకు నారదుణ్ణి ఎంతగానో హేళనచేసే పాటలు దొరుకుతాయి. ఈ పాటలలోని సంఘజీవన వాతావరణమే వాటిని మైథిలీ నారీజనానికి శాశ్వతంగా ఆదర పాత్రములుగా చేసింది.

పెళ్ళికి తరలివచ్చే పెళ్ళి కుమారుడు శివుని పరికరాలూ పరివారమూ చాలా హాస్యాస్పద సన్నివేశాలతో వినోదం కలిగిస్తాయి. పెళ్ళిలో స్త్రీల పెత్తనంలో జరిగే వేడుకలెన్నో ఉంటాయి; అది వైదిక వివాహకాండలో జరిపించే వాటికంటే భిన్నమయి, స్థానిక సంప్రదాయాలతో ఆచారాలతో కూడుకొని విద్యాపతి పాటలద్వారా మిథిలలో శతాబ్దాల తరబడి అనూచానమైపోయి. ఆడ పెళ్ళివారి ఆడవారు పెళ్ళికుమారుడికి ఎదురుకోలివ్వడము సందర్భంలో పెళ్ళికొడుకయిన శివుణ్ణి దిగంబరుణ్ణిగా కేవలం ఏనుగుతోలు చుట్టబెట్టుకుని రాగా చూసి, సిగ్గుపడి దూరంగా పారిపోతారు. పెళ్ళికొమారుడి మెడపైని ఒక కండువావేసి తీసుకు రావడానికి వెళ్ళిన పేరంటాళ్ళు అతని మెడలో బుసకొట్టే నల్లతాచుని చూసి బెదిరిపోతారు. అతని కళ్ళకి కాటుక పెట్టవలసిన పేరంటాలు వేలుతో (మూడో) అగ్నినేత్రానికి కాటుక పెట్టబోగా ఆ వేలు కాలిపోతుంది. ఆ వేడుకలు జరపడానికి వచ్చిన పేరంటాళ్ళలో ఒకామె అంటుంది :

"ఏరి ఏరి నారదముని ఎట్టి వరుని తెచ్చెనమ్మ?
గౌరి యితని చూచేనా మారుబారి వశమైనది ?
కంటమంట లెగసేనే కాటుక పెట్టేదెలాగు ?
తలచుట్టూ దిష్టికంప వలయము తిప్పేదెలాగు ?
తలపై గంగ మడుగొకటి నెలకొన్నది తిరముగాను!
ప్రమథులు భూతగణములట పెళ్ళికొడుకు పరివారము
సమపంక్తిని పెళ్ళివిందు జరిపించడమెటులమ్మా ?
పంచముఖున కెటులమ్మా పాయసమ్ము తినిపించుట ?"

అంతవరకు స్థానికమైన వేడుకలు; వైదిక వివాహ కాండలో కూడా తప్పిబ్బే —ఒక పెళ్ళి పెద్ద ఏమంటున్నాడో :—

"వేదిపైకి శివుడు వచ్చు విధముగనరె వేడుకయ్యె!
శిఖలో అంకుశిని గుచ్చ చిల్లునుండి గంగజారి
హోమముకై చేకూర్చిన సామగ్రులు వరదమునిగె!
పెళ్ళికొడుకు వాహనమ్ము పీటపక్క కుశదర్భల
మెల్ల మెల్ల పుడికి పుడికి మేయతొడగె చూడరమ్మ!
వేగిన పేలాలు చూసి నాగులు బుస్సన తొండగె!
పెళ్ళికుమారుని యెద్దు బెదరి చిందుతొక్కసాగె!"

ఈ పాటలలోని వ్యంగ్యమాధురి బాగా బోధపడాలంటే మిథిలా సామాజిక జీవనంలోని విలక్షణమైన కొన్ని ఆచార వ్యవహారాలు తెలిసి తీరాలి. అందు చేతనే, ఈ పాటలకు రావలసిన మెప్పు మైథిలీ సమాజమును దాటలేదు. అయినా వాటిలో ఎన్నో కాల్పనిక సంఘటనలు ఎన్నోవిధాల వేడుక, వినోదము కలిగించేవి వర్ణితములై ఉన్నాయి.

ఇక చివరగా, మూడవ శ్రేణికి చెందిన శివ కథాగేయాలు—శివుని గార్హస్థ్య జీవితాన్ని చిత్రించేవి—అంటే ముఖ్యంగా శివుని సంసారంలో పార్వతి కష్టసుఖాలను గురించిన పాటలన్నమాట! సామాన్యంగా లౌకిక దృష్టిలో పరిశీలిస్తే గృహిణిగా పార్వతి పడే పాటులు మరెవ్వరికీ కలగకూడదనిపిస్తుంది. గృహ యజమాని ముదుసలి—ఆస్తీ పాస్తీ ఏమీలేదు. ఊరికే విషం మింగు తూంటాడు. ఆయనకేమో అయిదు ముఖాలు—ఆయన కొడుకులకా అంటే— ఒకనికి ఆరుముఖాలు, మరొకనికి ఏనుగుతొండం! పార్వతి తన వాహనంగా సింహాన్ని ఎంచుకొంది; శివుడేమో ఎద్దునూ పాముల్నీ ఎంచుకొన్నాడు; పెద్ద కొడుకు నెమలినీ చిన్నకొడుకు ఎలుకనీ ఎంచుకొన్నారు ఇంటిలోని ఈ జంతు జాలం అంతా ఒకదాని కొకటి బద్ధశత్రువు. ఇంటిలో శాంతి కొనసాగేటట్లు చూడడం కాని, ఇందరికీ తిండి సదుపాయం చూడడం కాని పెద్ద సమస్యే! పార్వతి ఏమంటున్నదో తన తల్లితో :—

"కన్న తల్లిరో కాపురమ్మెటు గడపగలనో చెప్పవే!
గంపనిండా బూడిదవినా కొంపలో ఏమున్నదమ్మా!
సిరులా సంపదలా ధరింపగ సొమ్ములా వస్త్రమ్ములా?

ఎరవా, బదులో అడుగబోయిన యిరుగుపొరుగూ ఎవ్వరమ్మా?
అహోరాత్రముస్తోలాకలంటూ అంగలార్చే పిల్లలమ్మా,
తినగ వారికి యేమి పెట్టను—
గాలి మింగి పరుండు పాము, విసము మెసవే అయ్యవారు;
అయ్యకును కింకరుని కావంతయిన అత్రము అదరులేదు;
అందరిలో నొక్కతెకు నాకే అదరుపాటూ అత్రమమ్మా!"

భర్తయైన శివునితోటే పార్వతి ఏమంటున్నదో:—

"చేను చేసుక బదుకవలెనని చెప్పలేదా నీకు సామీ!
సేద్యమైనా చేయకుంటే తిండి గింజలు నిండుకుంటే
తిరిపెమే గతియైతే అదియపకీర్తియేకద యెన్నడైనా"

ఎన్నో పాటలలో విద్యాపతి నిరుపేదతనాన్నీ నిస్పృహాయతనూ, సరళమైన శైలిలో సామాన్య నరనారీజనం మాటాడుకొనే భాషలో చిత్రించడంవల్ల పార్వతి పడే పాటులూ, పరీక్షలూ అంటే సానుభూతి కలిగే సామాన్య నారీజనానికి ఈ పాటలు అత్యంత ఆదరపాత్రములయాయి. అందుచేతనే మిథిలలోని గృహిణు లందరికి పార్వతి ఆదర్శప్రాయురాలైన యిల్లాలు, ఇల్లూ సంసారమూ చక్కగా దిద్దుకోగల తల్లిగా అందరికి ఆరాధ్య దైవమయింది.

ఈ పాటలన్నిటిలోని నాయకుడైన శివుని మూర్తినిరూపణ వ్యంగ్య చిత్రణమైనా, హాస్యాస్పద విన్యాసపూరితమైనా, సాంప్రదాయికంగా భక్తజను లకు ఆరాధ్యమయిన దైవ స్వరూపానికి ఏ విధంగాను భంగం కాని విధంగా ధ్యాన మననాదులకు దారితీసేది కావడంవల్ల అన్నిటిలోను అంతిమ గమ్యము శివ భక్తియే. పైకి అవి ఏ విధంగా కనబడినా అవి అన్నీ ప్రధానంగా భక్తిగేయాలే. కొన్నిటిలో భయానకత ఉంటుంది; కొన్ని హాస్యం కలిగిస్తాయి; ఒక్కొక్కప్పుడు కొన్ని శృంగార దర్పణాలు. అన్నిటిలోను ఒక అద్భుత రసరేఖ గర్భితమై తద్వారా భక్తి భావాన్నే అవి కలిగించడమూ, శివాలయ ప్రాంగణంలో వాటిని గానంచేసే భక్తులు తన్మయావేశాలతో నాట్యం చేయడం సామాన్యంగా కనబడే దృశ్యం!

ఈ శైవ గేయాలు మైథిలీ సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన అంశము— ఇటువంటిది మరే యితర ప్రాంతీయ సాహిత్యంలో గాని, ఈ ప్రాంతపు మరే

భాషలో గాని లేవంటే అతిశయోక్తికాదు. ఇవి విద్యాపతి భారతీయ సాహిత్యానికి మౌలికంగా సమర్పించిన కానుక! చాలకాలం దేశంలోని విద్వల్లోకం వీటిని ఆయన 'నాచారిగేయాల'లో అభిన్నములుగా ఎంచుతూ వచ్చిందని 15 వ శతాబ్దిలో లఖన్‌సేని, 16 వ శతాబ్దిలో అబుల్‌ఫజల్ వ్రాతలనుబట్టి స్పష్టమవుతుంది. మిథిలలో ఈ ఫక్కి ఎంతో జనాదరపాత్రమైన భక్తికవితగా రూపొందింది, ఇటీవలి 5 శతాబ్దులలో మిథిలలోనే వందలకొద్దీ కవులు వేలకొద్దీ గేయాలను రచించారు. నేపాల్‌లో కూడా భక్తి గీతాలన్నీ కూడా నాచారిగేయాలుగా రచించడం పరిపాటి అయిపోయింది; నేపాలులోని సంకలనాలలో 'విష్ణునాచారి', 'గణేశనాచారి' 'సూర్యనాచారి' 'దుర్గానాచారి' గేయాలు మనకు లభిస్తున్నాయి.

ఆధునిక యుగంలో విద్యాపతి సాహిత్యంలో ఈ విభాగముపైని సముచితముగా శ్రద్ధ చూపకపోవడం శోచనీయం! ఇవి ఆయన కవితలో క్షుద్రకవిత్వం అనే భావనా విద్యాపతివంటి మహా విద్వాంసునికి అట్టి క్షుద్రకవిత తగనిదనే భావనా, సాహితీ పరిశీలకులకు ఉండవలసినవి కావు; దాదాపు 100 ఏళ్ళక్రితం కొందరు నూతన దృక్పథంగల విద్వాంసులకు బీమ్స్, గ్రియర్సన్ వంటి ఆంగ్లేయ పండితులకు శారదా చరణమిత్ర, నరేంద్రనాథగుప్త వంటి బెంగాలీ పరిశోధకులకు విద్యాపతి కవితలలో ఈ అంశములో గల విశిష్టత బోధపడి, కవిగా విద్యాపతి సాహిత్యమును సవిమర్శంగా పరిశోధింప పూనుకొనేటట్లు చేసింది. వారు బెంగాలులోని వైష్ణవ గ్రంథాలలో లభించిన కృష్ణ ప్రణయలీలలను వర్ణించే శృంగార గేయాలను మాత్రము క్షుణ్ణముగా పరిశీలించారు. అది ఒరవడిగా మైథిలీ విద్వాంసులు కూడ వంగదేశీయుడైన విద్యాపతి కవితాభిమానులు తొక్కిన మార్గమునే అనుసరించారు. ఇటీవలనే కలకత్తాకు చెందిన డా॥ శంకర్ ప్రసాద్ బసు పరిశోధనలలో విద్యాపతి కృష్ణప్రణయ గేయాలకిచ్చినంత ప్రాముఖ్యము ఆయన శైవ గేయాలకు కూడా ఇచ్చినట్లు ఈ గ్రంథకర్త దృష్టికి వచ్చినది. విద్యాపతి శైవ గేయాలు ప్రచారం నుండి ఏష్యం కాని అన్నిటినీ శ్రద్ధగా సంకలనముచేసి, వాటిని మైథిలీ సామాజిక జీవనమును గూర్చి బాగా తెలిసినవారు సరిపోలుస్తూ పరిశీలింపగలిగితేనే ఆ గేయముల ఘనతకు తగిన న్యాయము చేకూరగలదు.

ప్రపంచ కవులలో విద్యాపతి యశఃప్రశస్తి పూర్తిగా ఆయన శృంగార పదావళిపై ఆధారపడి చేకూరినదే అన్నమాట వాస్తవము. భౌతికమూ కామ ప్రేరితమూ అయి, స్త్రీ పురుషుల పరస్పరాభిలాషతో కూడిన శాశ్వత ప్రణయమును గూర్చి అతిమధురంగా గానంచేసిన వాడు విద్యాపతి. ఇది మానవానుభూతులన్నింటిలో ప్రాథమికము (ప్రపంచ జీవుల) సృష్టి కార్యమునకిదే ఆధారభూతము. ప్రపంచమంతటా అత్యంతజనానురంజనకు అనువైన కవితా ప్రక్రియలకు ఇదే ఆలవాలము. సంస్కృత సాహిత్యములో శృంగార కవిత అగణ్య ప్రమాణాలలో లభిస్తుంది. దీనికి ఆదియెక్కడా అని వెతికితే క్రీస్తుకు పూర్వమే ప్రాకృతగాథలలో ప్రారంభమైనట్లు గ్రహించవచ్చు. వ్రజభూమిలోని గోపికలతో శ్రీకృష్ణ ప్రభుని కామలీలలను చిత్రించిన గేయపద్యమయమైన మధురకావ్యము జయదేవుని గీతగోవిందమే విద్యాపతికి సరాసరి ప్రోత్సాహకమైనది.

సార్వజనీనమైన ఇతివృత్తం వల్లనే కాక మహాకవి అపార శిల్పనైపుణ్యం వల్ల కూడా విద్యాపతి శృంగార పదావళి అత్యంత జనాదరణ పొందాయి. ఒక్కొక్కటి ప్రధానమైన మూడు వేర్వేరు మౌలికాంశములు, మొత్తముగా సమకూడి ఈ పదావళికి దేశకాలావధులను మీరిన అసామాన్య గౌరవమును చేకూర్చాయి.

మొదటిది నిశ్చయంగా ప్రధానాంశ మనతగినది ఇతివృత్తమే. అతని పాటలన్నీ భావప్రధానములు; సంస్కృతాలంకారికులు ముక్తకము అనే కవితా ప్రక్రియకు ఉదాహరణముగా ఏపాటకా పాట ఒక్కొక్కటి స్వతంత్రమైన ఇతివృత్తం కలిగి ఏకగేయాత్మక కావ్యమై ఉంటుంది. కాబట్టి స్త్రీ పురుషుల కామ జీవితంలోని వివిధ అనుభూతులను చిత్రిస్తాయి. విద్యాపతి తన కల్పనా శక్తిని వినియోగించి ఒక్కొక్క సంఘటననూ, అందులోని అనుభూతినీ తాను ఊహించి, వాస్తవికంగా, స్వాభావికంగా, రసవంతముగా, సానుతాప పూర్వకంగా రచించడంచేత ఆ పదావళిని పాడేవారు వినేవారు అవి తమ జీవితానుభూతినే చిత్రిస్తున్నట్లు భావించగల్గుతారు.

రెండవది — ఈ గేయాలలోని భాష మధురము, లలితము, లయాత్మకము! మాటల ఎంపికలో అత్యంత నైపుణ్యం ఉంటుంది. ఆసందర్భానికి

ఎక్కడ ఏమాట సరిగా సరిపోతుందో ఆమాటతో సరళ ధోరణిలో, సూటిగా, స్పష్టంగా, అందంగా సాగిపోతుంది గేయరచన! హ్రస్వాచ్చులు, సరళహల్లులు ఎక్కువగా ప్రయుక్తం అయే మైథిలీ భాష బంగాలీ భాషలాగే శ్రవణ మధురంగా ఉంటుంది, మైథిలీ భాషకు ఆ పరిపక్వత రావడానికి కారకుడు విద్యాపతియే. అపభ్రంశభాషా దశలోని పదజాలంలోని మోటుతనాన్ని అరగదీసి, మాటల రూపులో కూర్పులో మృదుత్వాన్నీ, లయాన్వితత్వాన్నీ మైథిలీ భాషకు అందించిన మహాకవి విద్యాపతి! ఆయన గేయములోని మాటల రూపము అతి ప్రధానముగా ఏ శ్రోతలకోసం ఉద్దేశింపబడిందో సమాజంలో వారి అంతస్తు ఏదో, దానినిబట్టి నిర్ణీతమయ్యేది. అవి తత్సమాలు కావచ్చు, తద్భవాలు కావచ్చు లేదా కేవలం దేశిమాటలు కావచ్చు. మృదువుగా, మధురంగా, హృదయంగమంగా శ్రవణపేయంగా ఉంటాయి. భావానుసారియైన శబ్దప్రయోగం కనబడుతుంది, ఆ శక్తి ఆయన సొమ్ము! చటుక్కున పాట అర్థం కాకపోయినా శబ్దాల కూర్పును బట్టి అనుభూతీ, దానినిబట్టి భావమూ చదువరికి కలిగి, పాట అర్థం మనస్సులో రూపుదాల్చడం విద్యాపతి గేయాల విశిష్టత!

మూడవది పాటలన్నీ ప్రాగ్భారత ప్రాంతానికి చెందిన రాగాల వర్ణ మెట్టులలో అమర్చబడి ఉంటాయి. బౌద్ధ సిద్ధుల (అపభ్రంశ) ప్రాకృత గానములకు వాడిన రాగములు, జయదేవుడు గీత గోవిందములో అష్టపదులకు వాడిన రాగములు జ్యోతిరీశ్వరుడు వర్ణన రత్నాకరములో పేర్కొన్న రాగములు, విద్యాపతి గేయములకు కూడ అవే రాగములు ప్రయుక్తములయినాయి. కర్ణాట రాజుల పరిపాలనకాలంలో మిథిలా ప్రాంతంలో సంగీతానికి మంచి రాజపోషణ ఉండేది—బాగుగా వర్ధిల్లింది. లోచన పండితుడు రాగతరంగిణిలో వివరించిన విషయాలనుబట్టి మైథిలీ సంగీతమను పేర స్వతంత్ర శైలికి చెందిన సంగీతం ప్రచారంలో ఉండేదనీ, దానికి విశిష్ట లక్షణాలుండేవనీ, వాటిలో బృంద సంగీతము, విలంబితలయ మున్నగునవి ఆ లక్షణాలలో కొన్ని అనీ తెలుస్తుంది. ఈ సంగీతం అభివృద్ధి చెందడానికి విద్యాపతి చాలా కృషిచేశాడు. ఆయన ప్రయోగంలో ఉన్న రాగాలను తీసుకొని, ఒక్కొక్క రాగంలో వేరు వేరు వరుసలలో ఎన్నెన్నో కీర్తనలను నిబద్ధంచేశాడు. ఒక మాటను పలకడానికి పట్టే కాలమును బట్టి (అటువంటి) మాటలతో కూర్చిన పాటయొక్క ఛందోరూపం నిర్ణీతం అవుతుంది; అందుచేత, గేయపాఠన పద్ధతిపై ఆధారపడి పాటలోని హ్రస్వదీర్ఘాచ్చు

లను పలకవలసి ఉంటుంది—అందుచేత అది ఇదమిత్థమని చెప్పడానికి వీలుండదు. రాగతరంగిణిలో గ్రంథకర్త లోచనుడు విద్యాపతి పాటలలో దేనిని తీసికొన్నా, దాని రాగముపేరూ ఛందస్సుపేరూ ఒకటే అంటాడు. పండితులు చాల కాలం ఈ సిద్ధాంతాన్ని విశ్వసిస్తూ వచ్చారు. ఒక గేయ పంక్తిలోని మాటల కూర్పే దాని ఛందస్సును నిర్ణయిస్తున్నప్పుడు లోచనుని సిద్ధాంతమును సరియైనదని ఒప్పుకొనడానికి వీలులేదు. ఒకే పాటకు వేర్వేరు కాలాలకు చెందిన విద్వాంసులు వేర్వేరు రాగాలలో పాడాలని సూచనలివ్వడం ఒక కారణం. ఒకే విధమయిన మాటల కూర్పు వేర్వేరు ఛందస్సుల పేరులతో పిలవ వచ్చుననేది సరికాదు; కాని ఆ పాటలోని శబ్దాలను వేరు వేరు స్వరాలలో గానంచేస్తే వేరు వేరు రాగాలలో వర్ణమెట్టు ఏర్పడుతుందనేది సాధ్యమే! విద్యాపతి గేయాలను ఒకే రాగానికి వేరు వేరు వర్ణమెట్లలో కూర్చదగినట్లుగానే రచించాడు. అవి వాటి ఇతివృత్తానికి, భావానికి మాత్రమేకాక వేరు వేరు రాగాల వింగడింపువల్ల కూడా జనాదరణ పొందాయి

విద్యాపతి తన గేయాలను రాగాలనుబట్టి వర్గీకరించాడు. వాటిలో ఏదైనా జనాదరణ పొందగానే, తరువాతి కవులు దానిని అనుసరించి రచనలు చేస్తూండడంతో విద్యాపతి వారికందరికీ మార్గదర్శి కావడంతో ఆ ధోరణి గేయాల పద్ధతికి ఒక పేరు సాంప్రదాయికంగా ఏర్పడుతూ వచ్చింది. ఒక ఉదాహరణ ఈ విషయాన్ని స్పష్టంచేస్తుంది! ఖండిత సంస్కృత సాహిత్యంలో ఒక నాయిక—తన ప్రియునిపై కోపగించిన యామె - ఇంకొక స్త్రీతో అతడు ప్రణయకేళి గడపి వచ్చినందుకామె అతనిని మాటలతో చేష్టలతో అభిశంసిస్తుంది. అతడు తన శాయశక్తులా ఆమెను బ్రతిమాలి సాంత్వన పరుస్తాడు. విద్యాపతి కొన్ని పాటలలో ఆ ప్రియుడు రాత్రి అంతా ఆమెను సాంత్వనపరచడానికి ప్రయత్నించి తెల్లవారబోతూంటే అదిగో తెల్లవారబోతోంది చూడు అనే పల్లవిలోకి వస్తాడు ఈమాదిరి పాటలు ప్రభాతకాల రాగాలలో నిబద్ధమై 'ప్రాభాతి' అని పేరు పడ్డాయి, తరువాతి కవులెందరో విద్యాపతి ననుకరించారు. తరువాతి కాలంలో ఈ రకం పాటలకు 'మానా' గేయాలని పేరు వచ్చింది. అనేక మైథిలీ కవులు ఈ 'మానా' గేయాలను అదే 'ప్రాభాతి' రాగపు వర్ణమెట్టులో నిబంధించారు. అదే విధంగా ఎన్నో విధాల ఇతివృత్తాన్నిబట్టి, విలక్షణమైన రాగవరుసనుబట్టి, వేరు వేరు రకాల గేయాలకు పేర్లు పెడుతూ వచ్చారు గాని, ఆ పేర్లు విద్యాపతికి తెలియవు. ఆయనకు రాగమే ప్రధానము. దానివల్లనే ఆయన పాటలు వెంటనే జనరంజకము

లైనాయి. అవి శ్రోతలను పరవశుల్ని చేయగలిగేవి; మృదువైన మాటల లయాన్వితమైన కూర్పు మనస్సులను ఆకట్టుకొంటుంది; మాటల ఉచ్చాటనశక్తి ద్వారా భావం బోధపడిపోగానే శ్రోతల హృదయాలు ఆదర్శ కవితానందంతో నిండిపోతాయి. విద్యాపతి పాటలను పూర్తిగా ఆనందించగలగాలంటే వాటిని తగి నట్లు గానంచేస్తూంటే వినాలి, వాటిని చదివే పాఠకులకు మూడింట రెండు వంతుల ఆనందమే లభిస్తుంది, వాటి అనువాదం చదివితే వాటి సంగీతపు సమ్మోహనాశక్తి లోపిస్తుంది, మాటల మంత్రశక్తి లోపిస్తుంది; కేవల భావంతో మూడవవంతు ఆనందమే దక్కుతుంది.

విద్యాపతి శృంగార గేయాల ఇతివృత్తం స్పష్టంగా నొక్కి చెప్పాలంటే కేవలం ప్రణయం, స్త్రీ పురుషుల పరస్పరకామం-ఆధ్యాత్మికంగానో మార్మికంగానో వేరే ఏదో అంతరార్థం ఉందనుకో అవసరంలేదు. వేరు వేరు తరహాల వ్యక్తులకు ఆయన మాటలలో వేరు వేరు అర్థాలు స్ఫురించడం ఆయన ప్రతిభకు నిదర్శనం! చైతన్య ప్రభువూ ఆయన అనుయాయులూ ఈ గేయములలో కృష్ణప్రభుని ప్రణయలీలలు వర్ణించినట్లు భావించారు. ఆ లీలల సంకీర్తనము భక్తి పూర్వకా రాధనలో ఒక భాగము కనుక బెంగాలులోని వైష్ణవ వర్గాలలో ఈ పదావళి కేవల భక్తిగేయాలే. గ్రియర్సన్ పండితునివంటి విద్యాంసులకు కబీరు పాటలవలె విద్యాపతి పాటలు కూడ పరమాత్మతో ఐక్యానుసంధానమునకై జీవాత్మ అంతు లేని అభిలాష లైంగిక కామముగా వర్ణించిన మర్మకవిత ! ఈ పదావళిలో సగం కంటె తక్కువ పాటలలో మాత్రమే రాధాకృష్ణుల పేర్లు కనబడతాయి. చైతన్య దేవుని అనుయాయులు ఈ పాటలన్నీ రాధాకృష్ణుల ప్రణయలీలా వర్ణనలుగానే భావిస్తారుగాని, చాలా పాటలలో కనబడే—కాన్హా, మాధాయ్ (కృష్ణ, మాధవ) శబ్దాలు విద్యాపతి విష్ణుని 11 వ అవతారముగా భావించిన తన రాజపోషక మిత్రుడైన శివసింఘుకే చెందుతాయి. ఏది ఏమైనా సంస్కృతాలంకార శాస్త్రా న్ననుసరించి కృష్ణుడు ఒక నాయక భేదము, రాధకాని, గోపికకాని ఒక నాయికా భేదము,

విద్యాపతి తన గేయకవితల రచనలో సంస్కృత సాహిత్యంలోని అలంకార శాస్త్రాన్ని చక్కగా అనుసరించాడు. 'కీర్తిపతాక' అనే ఆయన గ్రంథభాగంలో ఒకచోట—'త్రేతాయుగంలోని అవతారంలో భగవానుడు సీతాదేవి వియోగంవల్ల కష్టాలపాలవడంచేత, ద్వాపరంలో కృష్ణావతారం ఎత్తి గోపాలదేవుడై నాలుగు

విధాల నాయకుడై అష్టవిధ నాయికలైన గోపికా ప్రేయసులతోటి కామసుఖముల ననుభవించా'డని వ్రాసి ఉన్నది. దీనినిబట్టి విద్యాపతి కావ్య కల్పనా నైపుణ్యము నూహించవచ్చు. సంస్కృతమందలి అలంకారశాస్త్రంలోని చతుర్విధ నాయకులను అష్టవిధ నాయికలను ప్రతీకలుగా తీసుకొని వారితోటి సంఘటనలతో గేయాలు రచించాడు. ఆనాయకుడు కృష్ణుడేనా కావచ్చు! మరే పురుషుడైనా కావచ్చు. నాయిక గోపికైనా కావచ్చు, రాధికైనా కావచ్చు, మరే స్త్రీయైనా కావచ్చు. నాయకుడు, నాయిక, ప్రేమికుడు, ప్రేయసి—శృంగార రసోత్పాదనానికి కావలసిన ఆలంబన విభాగం అవసరం—వారిద్వారా ప్రధాన స్థాయిభావం వర్ధిల్లి సాధారణీకరణం పొందుతుంది; (అంటే చదివే పాఠకులకుగాని, చూచే ప్రేక్షకులకు గాని, అది తమ కథే అనే సానుభూతి కలుగడమే సాధారణీకరణము). "పాత్రలకు స్వరూప నిరూపకములమే నామకరణం చేయడంద్వారా కవిత్వము లక్ష్యము సార్వజనీన హృదయామోదముగా స్వీకరిస్తారు కవులు" అని అరిస్టాటిల్ సూక్తి! మానవ జీవితంలోని సార్వజనీనభావములను రమణీయముగా ప్రకటించడమే కవిత్వము! ఇంకొకలా చెప్పాలంటే మానవ జీవితంలో వ్యక్తుల స్వభావములు రసానుభూతులు, నడవడికలు వీటి ఆదర్శ ప్రతిబింబాలను ఇంద్రియామోదకరమైన శబ్దప్రయోగం ద్వారా ప్రకటించడమే కవిత్వము! "సార్వజనీనభావములను యథాతథముగా కాక ఇంద్రియమును రమింపజేయు భావబింబాల ద్వారా ప్రకటింపజేసే శబ్ద ప్రయోగ సామర్థ్యంలో కవితాశక్తి అంతర్నిహితమై ఉంటుంది"—అని కూడా అరిస్టాటిల్ సూక్తి! ఈ దృష్టిలో పరిశీలించినపుడు విద్యాపతి మనకు యథార్థ కవిత్వమునే అందించాడని ఒప్పుకొని, ఆయనను కవిగా గౌరవిస్తాము; ఆయన కవితలో నాయకుడెవరు, నాయికయెవరు అనే ప్రశ్న అనవసరము!'

అలాగే, విద్యాపతి గేయాలలో ఏదో మార్మికత, నిగూఢార్థములు ఉన్నాయనుకొనడము కూడా అసంగతము. ఈ కవితలో నాథునికోసం ప్రేయసి ఆరాటపడునట్లుగానే నాయకుడు కూడా ప్రేయసికోసం అంతగాను ఆరాటపడతాడు. విద్యాపతి గేయాలలోని నాయికలకు నాయకుని యెడలగల సంపూర్ణ శరణాగతిని చైతన్యదేవుడు, ఆయన అనుయాయులు వైష్ణవ భక్తితత్త్వవాదులు మధుర రసమని పేర్కొన్న అనుభవంతో సరిపోల్చుకోగా, కబీర్ ననుసరించిన మార్మిక కవితావాదులు అది పరమాత్మతో ఐక్యంకోసం జీవాత్మ పొందే ఆరాట

ముగా భావించారు. అయితే. ఈ అభిప్రాయాలు విద్యాపతి గేయరచనకుద్య మించిన సందర్భంలో ఆయన ముందున్నవి అని అనుకోడానికి వీలులేదు. విద్యాపతికి అనుసరణీయమయిన సాంప్రదాయిక సంస్కృత అలంకారికులు చెప్పిన కవితా లక్ష్యాలలో కూడా ఈ అభిప్రాయాలు లేవు. అందుచేత విద్యాపతి నెల కొల్పిన మైథిలీ కవితా సంప్రదాయాలలో కూడా ఇవి ఉన్నాయనుకొడానికి వీలు లేదు విద్యాపతి శృంగార పదావళి రచించడానికి కారణము ధర్మ, అర్థ, మోక్షములతోపాటు కామపురుషార్థము కూడా సమాన దీక్షతో సాధించడమే మానవ జీవితానికి ప్రధానమని ఆయన దృఢంగా విశ్వసించడమే!

కవిత్వమును గురించి పాశ్చాత్య విమర్శకులుచేసిన నిర్వచములన్నీ— అరిస్టాటిల్ వాదము. బేకన్ వాదము అని రెండు వాదములుగా విభజించవచ్చు: ఏ వాదమునుబట్టి పరిశీలించినా విద్యాపతి కవితనుబట్టి ఆయన మహాశిల్పి అని చెప్పక తప్పదు. అరిస్టాటిల్ కవిత్వమును అనుకరణ కళగా భావించినా కవి యధార్థంగా జరిగిన దానిని జరిగినట్లుగా కాక జరుగ తగినట్లుగా చిత్రించవలసి ఉంటుందని ఒప్పుకొన్నాడని మనం గుర్తించాలి. కావ్య సత్యమును గురించి నిర్వచిస్తూ అరిస్టాటిల్ ఏమంటాడంటే.—"బహుళః జరిగే అవకాశంగల దుర్లభ సంఘటనయే—అనేక విధాల జరిగే అవకాశంలేని సాధ్యసంఘటనకంటే కవితా వస్తువు కాదగు"నంటాడు. ఎందుకంటే, "దుర్లభ విషయములే ఆదర్శప్రాయములు—కవి మనస్సు ముందుండే భావన వాస్తవాన్ని అధిగమించాలి" వర్ణించే వస్తువు ప్రేయసీ వ్యక్తియైనా, ఆమె భావశబలతయైనా, ప్రణయమిథున సంయోగమైనా, వియోగమైనా, ఋతువర్ణనమైనా, కాలనిర్దేశమైనా, వాతావరణ నిరూపణమైనా నాయికా నాయకుల కామోద్రిక్తతతో సంబంధించి, తదనుగుణమై ఉండేటట్లు విద్యాపతి గేయములో సామాన్యానుభవంలో వాస్తవమైన దానికంటె కొత్త దనమును కల్పించి. (ఒక ఆదర్శ వాస్తవికత) అధివాస్తవికతను ప్రదర్శిస్తాడు ప్రకృతిలో పరివ్యాప్తమై యెల్లెడలా అల్లుకొని పోయిన మౌలికమైన అందాలను తన సన్నివేశంలోనికి చొప్పిస్తాడు. ఎంపిక, కలగలుపు, చిత్రిక, ఒకచోట మెరుగు, ఒకచోట తగ్గింపు, ఇవి ఎన్నిచేసినా చాలదు, అతడు ఇన్నిటినీ కలిపి వాటిలో సామరస్యము సాధించి ఆదర్శమైన ఏకత్వాన్ని నిరూపిస్తాడు.

బేకన్ దృష్టిలో మాత్రము కవిత్వము "చరిత్రా భాసము" కవిత తనలో చిత్రితమయే చరిత్రాభాసముద్వారా—వస్తువుల సహజ స్వభావమువల్ల అందని

ఛాయామాత్రమైన సంతృప్తిని మానవ హృదయానికి అందిస్తుంది; స్వాభావిక వస్తు ప్రపంచముకంటే అత్మ 'కించి' దున్నతస్థాయికి చెందినది కావడమే దానికి కారణము; ప్రాకృతిక వస్తువులలో కంటె మానవుని ఆత్మలో చాలినంత గొప్ప తనము, స్పష్టతరమైన మంచితనము, స్వచ్ఛతరమైన అవస్థలో మౌలికంగా ఉండడమే దానికి కారణము'' ఈ విధంగా బేకన్ 'కవితా సత్యం' ఉంటుందనే సూత్రాన్ని లక్ష్యపెట్టక, ''కల్పనాశక్తియొక్క అనర్గళ విన్యాసమే కవిత్వ' మంటాడు. అందుకే ఆయన కవిత్వము కేవలం మానసిక నాటకశాల అనీ విశ్రాంతికోసమూ వినోదంకోసమూ దానిని అప్పుడప్పుడు వినియోగించుకోవాలే గాని, అదంతా కేవలం 'నటనా' లేదా "అభాసమూ' కనుక, దానిలో సుదీర్ఘ కాలక్షేపం పనికి రావంటాడు.

విద్యాపతి పదావళి మానవ జీవితమును వ్యక్తుల స్వభావాలను, రసాను భూతులను, నడవడికలను ఆదర్శప్రాయముగా చిత్రించిన కావ్యఖండాలు: వర్డ్స్ వర్త్‌ను గురించి మేత్యూ ఆర్నాల్డ్ ప్రశంసించినట్లుగానే విద్యాపతి మనకు ప్రణయ ప్రపంచపు అద్భుత వికాసములను అందించిన ఘనుడని చెప్పవచ్చు. అయితే విద్యాపతి వృత్తిచేత కవికాదు. అది ఆయన వ్యావృత్తి మాత్రమే—అయ నకు ఆ మనోధర్మము కలిగినపుడు తవ అభిమానులలో ముఖ్యముగా నారీజన హృదయానందము కొరకై పాటలల్లి పాడేవాడు. అందుచేత ఆయన వాటిని కవన మల్లడము కూడా ఒక 'అభాసము' 'యథాలాప నటనము!' ఆయన పూర్ణ యౌవనపు పొంగులో తన కత్యంత హితపోషకుడైన రాజా శివసింహ స్నేహ పూరిత వాతావరణంలో వాటి రచన అలవోకగా సాగిపోయింది. వృత్తిరీత్యా ఆయన పండితుడు, రాజపండితుడు, ఏవేళా రాజ్యానికి జీవితానికి సంబంధించిన గంభీర సమస్యలను గురించే శ్రద్ధగా ఆలోచిస్తూ కార్యనిమగ్నుడై ఉండేవాడు. అందుచేతనే, వివాహితయౌనాయిక తన నాయకుని కోసం అభిసారికగా వెళ్ళే పరకీయా ప్రణయం ఆయన గేయాలలో వర్ణితమయిందంటే, (వివాహిత స్త్రీ తన ప్రియుని రహస్య సంకేత స్థలములో కలియడానికి అభిసారికగా వెళ్ళే ఘట్టాలు) తన స్వానుభవాన్నే ఆ విధంగా చిత్రించాడనుకొంటే పొరపాటు కాగలదు. అటు వంటి సందర్భాలన్నిటిలోను విద్యాపతి చక్కగా 'నటించా'డనుకోవడమే సమంజ సము! ఆ గేయాలన్నీ ఆ యా ఉత్సవ సందర్భాలలో శ్రోతృ (ప్రేక్షక) వినోదా నందములకై ఉద్దేశింపబడినవి, లేదా, బేకన్ చెప్పినట్లు ఆ సంఘటనలన్నీ

మానసిక నాటకశాలలో జరిగే ప్రదర్శనలు, ప్రేక్షకులా నాట్యమందిరానికి విశ్రాంతి వినోదాలకోసమే వెడతారు

విద్యాపతి కవితలో ఒక ముఖ్య లక్షణం దాని ఆవిష్కరణశక్తియే! నారీ సౌందర్యమును, ప్రకృతినీ సర్వేంద్రియ రమణీయముగా మన మనోనేత్రముల ముందు బహిర్గతం చేయడమే ఆ ఆవిష్కరణ। ఆ విధంగా విద్యాపతి కవిత్వపు వ్యాపనశక్తి పరిమితము! ఆయన నారీ ప్రపంచపు కామజీవిత చిత్రణములో ఆయన లోకవృత్త దర్శనశక్తి. నారీహృదయాల రమణీయపు లోతులనూ స్పంద నలనూ కనుగొని తన మాటలలో నాటకీయముగా పునర్నిర్మించే శక్తి అనుపమాన ములు! చదువరుల (శ్రోతల) కల్పనాశక్తి ఉజ్జ్వలమయే రీతిని వారి హృద యంలో సానుస్పందన కలిగేరీతిని తన భావనలోని సంఘటనలను పునస్సృజించే శక్తి కూడా అతనికి అసామాన్యమే! మన మనస్సులో శ్రద్ధను మేల్కొలిపి, కామ జీవితపు రామణీయకము వైపూ, దాని అద్భుతానుభవస్ఫూర్తివైపూ మళ్ళిస్తాడు. 'ఫ్రా'లిప్పోలిప్పి ద్వారా బ్రౌనింగ్ మనకు ఈ విధంగా చెపుతాడు :

> "వలచుకొరకె పుట్టితిమంచు తెలిసికొనవా?
> చూడకయె దాటిపోదుము, చూచియైన -
> వర్ణలేపన చిత్రాలు వందసార్లు!
> చూచినకొలంది మించెడు సొబగు, వలపు
> కూడనంతియే, కళలందుకొరకె మనకు!"

ఇది ఒక చిత్రకారుని పక్షాన చెప్పిన సమర్థింపు మాటలు! అయితే విద్యా పతి కూడ ఒక శబ్దచిత్రకారుడు! 'తొలుసమర విలసనము తొంగిచూచు ఆడపిల్లలను చూడనివారుండరు గదా! అయితే చాలా గేయాలలో విద్యాపతి ఆ కన్నెలో దిన దినము కంటబడే మార్పులను చిత్రిస్తూంటే వాటిలో అద్భుతము నవీనము, అని పించే సౌందర్య రేఖలను ఆవిష్కరిస్తాడు! అత్యంత సూక్ష్మమైన వివరాలలో అందాలను కనుగొంటాడు. తన రమణీయ కల్పనాశక్తి సహాయంతో ఆ వివరా లను సరళమైన భాషలో రమణీయంగా రసోత్పాదకంగా పునస్సృజిస్తాడు. తొలు సమర కన్నెపడుచుకే విషయాలు సహజమో, అటువంటి కన్నెకు వయస్సు వచ్చిన వలపుకానితో జరిగే తొలి కలయికకూ అంత సహజంగానూ సరిపోతాయి. ఇటీవలి మధ్యకాలం వరకూ మిథిలలో నాగరక కుటుంబాలకు చెందిన యువ కిశోరులు 25 ఏళ్ళ వయస్సులో పదేళ్ళ బాలికను పెండ్లాడేవారు. ఈ సాంఘికా

చారము తాను పెరిగిన సీమకు అనూచానమైన రీతిగా విద్యాపతి పదావళిలో మనోహరంగా ఎదురవుతూ ఉంటుంది. తొలి సమర్త పెళ్ళికూతురు శరీరం లోను మనస్సులోను దిన దినమూ క్రమంగా కలిగే మార్పులూ, వలపుగానితో తొలిసారి కలిసే ఆ పెళ్ళికూతురికి క్రమక్రమంగా శరీరంలోను, భావములలోను కలిగే మార్పులూ ప్రతి చిన్న వివరమూ తప్పకుండా మన స్తత్త్వ విలసమును కన్నులకు కట్టినట్లు ఆ గేయాలలో కనబడతాయి!

విద్యాపతి పదావళిలో ప్రణయం సాధారణంగా నారీ దృక్పథంలో నిబద్ధమై ఉంటుంది. వ్యవహార గేయాలు అనబడే ఆయన పెళ్ళి పాటలలోను, శివకథా గేయాలలోను కూడా అదే విధంగా నారీ మనోభావములను దర్పణంలా ప్రతిబింబించడమే ప్రధాన లక్షణంగా కనబడినా, శృంగార పదావళిలో ఈ అంశ మరీ ముందాడడం చూస్తాము, ఈ విషయంలో విద్యాపతి మార్గము జయ దేవుడు, గోవిందదాసు మొదలయిన ఇంకా ఇతర వైష్ణవ కవుల మార్గముకంటె బొత్తిగా భిన్నమైనది. నాయిక కోసం నాయకునకు కలిగే ఆకర్షణకంటె నాయకుని కోసం నాయికకు కలిగే ఆకర్షణయే విద్యాపతి గేయాలలో యెంతో బాగా చిత్రితమయింది; తన గేయాలలో ఒకదానిలో విద్యాపతే ఇలా అంటాడు :

"వందలుగ నారిమనసు నానందపరచు
గూఢవాంఛల, మూగకోర్కుల, స్వకీయ
హృదయ దర్పణమందు దర్శించి, యతడు
పదము కల్పించి వెంటనే పాడదొడగు!"

'తొలు సమర్త విలసనము' మొదలు, యౌవనము పూర్తిగా పక్వమయే దాకా నారీక్రమవికాస దశలలో ప్రకృతి స్వభావోచిత మోహన దృశ్యాల సంపూర్ణ చిత్రాలను మనోహర లలితగేయాలలో విద్యాపతి నిబద్ధముచేయక వదలిపెట్టిన దశ ఒక్కటి కూడా లేదు. నఖశిఖ పర్యంతము శరీరమందలి ప్రతి అంగమును గ్రీకు శిల్ప వర్ణనావేశము స్ఫురించేటట్లు వర్ణిస్తూ సూక్ష్మవివరదర్శనాదక్షతా, స్పష్ట వర్ణ స్పృహా కలిగి, అద్భుతావహమూ ఆదర్శప్రాయమూ, సమ్మోహనకరమూ అనిపించే నాయికా మూర్తులను మన కళ్ళముందు నిలుపుతాడు. అదే విధంగా, స్త్రీ హృదయ స్పందనమన్నా, మానసిక వివృతి అన్నా లోతులు తరచి చూడగల అద్భుతమైన పారదర్శక దృష్టి ఆయనది, విద్యాపతి పదావళిలో దేనిని తీసుకొన్నే

విశ్లేషించినా, కనబడే ఆయన కవితలోని ఆంతరిక దృష్టి, ఆవిష్కరణశక్తి — తెలియడానికి మూడు ఉదాహరణలు : ఒక శీర్షికలోని ఆయన గేయాలలో తన ప్రియుని కలియడానికై వెళుతున్న ఒక నాయికతో ఆమె సఖి యిచ్చే సలహా చాలా స్వభావ సహజంగానూ, యువతులకు వెన్నతో పెట్టిన విద్య అనదగిన ఒయ్యారాలతో కూడి ఉంటుంది. ఇంకొక పాటలో తన నిస్సహాయతను గురించి వెళ్ళబోసుకొంటూ, తన ప్రియునితో ఏకాంతముగా ఎదురెదురుగా నిలిచినపుడు తన మానసికస్థితి ఎలా రమణీయమై, ఉద్రేకపూరితమయిందో చాలా సహజ ధోరణిలో చెపుతుంది. మూడవ పాటలో ఒక యువతి తన మందిరం విడిచి, ఆ రాత్రి తప్పక కలుసుకొంటానని వాగ్దానం చేసినందుకు, ప్రియుణ్ణి కలియడానికి బైలుదేరుతుంది. అయితే ఆ రాత్రి అమావాస్య రాత్రి అనుకొని ఆమె ఆ వాగ్దానం చేసింది; అయితే, పుచ్చపువ్వులా వెన్నెల కాయడం చూసింది; తను చిక్కులో పడింది. తన ప్రియునికి ఆశాభంగం కలిగించలేదు. మరి వెన్నెలలో అందరకు వెల్లడి అయేరీతిని వెళ్ళడం ఎలాగ ? సమస్య తన ప్రేమయా ప్రతిష్ఠయా-దేనికి భంగం కలగకుండా వెళ్ళడం ఎలాగ ?—అని ! ఇటువంటి విషయాలను అతి నిపుణంగా గేయబద్ధం చేయడంవల్ల ఆయన నారీలోకానికి చాలా అభిమాన పాత్రుడయాడు. వారి గళాలలో ఆయన పదావళి అమరగీతులయినాయి. స్త్రీ శృంగార జీవితంలో సంయోగం కాని, వియోగం కాని, సంతోషము కాని, విషాదము కాని, అనురాగము కాని, ద్వేషముకాని, ఆశకాని, నిరాశకాని, సంశయం కాని, నిశ్చయం కాని, ఆయన తన గేయాలలో స్పృశించని విషయములేదు. అతనికి స్త్రీ హృదయపు కలరూపు తన కల్పనాశక్తివల్ల ఆదర్శీకృత చిత్రణానికి అనువుగా వశమయినది; ఇతివృత్తానికి సముచితమైన భాషాబంధం అతవి సొమ్ము ! భౌతిక శృంగార వర్ణనలో నాయికా స్వభావ నిరూపణములో కాని, ప్రేమికుల సంయోగ వర్ణనలో కాని విద్యాపతి తన్మయావిష్టుడైపోతాడు. అందుకే రవీంద్రనాథఠాకూరు విద్యాపతి కవితను గూర్చి సముచిత ప్రశంసచేస్తూ "విద్యాపతి మానసానందకవి— ఆ మానసానందము ప్రేమికుల సంయోగ జనితము"అని అన్న మాటలు ఎంతో సమంజసముగా అన్నవి !

విద్యాపతి మనస్సులో శృంగార జీవితపు సంపూర్ణ దృశ్యము స్పష్టంగా ఉన్నదే ! కామ తత్త్వమును గురించిన స్పష్టమైన అవగాహన కూడా ఆయనకు

ఉన్నది. కామము ఆయన దృష్టిలో మానవ హృదయానికి సంబంధించిన మౌలిక స్థాయిభావం మాత్రమే కాదు; మానవ జీవితపు ప్రధానాశయము, జీవ తత్త్వానికి అవశ్యకమైన మౌలిక కార్యము మాత్రమే కాదు. రసవిహీన మానవ జీవితాన్ని రసానంద మహితముచేసే పవిత్ర కార్యము ప్రణయము, సౌందర్య భరితము లైన ఆయన పదావళి అందుచేతనే శాశ్వతానందదాయకములు !

విద్యాపతి చిత్రించిన స్త్రీ కామ జీవితపు ఘటనా పరంపర సరాసరి లోక వృత్త ప్రతిబింబము; సువ్యాప్తము. పరిపూర్ణము. వివిధ వర్ణభరితము; కల్పనా దర్శితము; రసానుభవ రంజితము; మధుర శబ్దమహితము; శ్రావ్య రాగనిబద్ధము ; అది ఆనాటికి ఏనాటికి నారీజనానికి కామవిద్యా శిక్షణా ప్రయోజకమై, నారీ జనోచిత ప్రవర్తనా దోహదమై, తమ కామ జీవితము పరిపూర్ణముగా అనుభవించ డానికి సహాయకమై వారి ప్రియులకు సంపూర్ణ సంతృప్తిదాయకమై విలసిల్లింది ఈ అమర పదావళి !

విద్యాపతి పదావళిలో చిత్రించిన ప్రణయ తత్త్వము చైతన్యదేవునకు ఆకర్షకమైన భక్తిప్రసాదము కావడము వింతయైన ఫలితము! చైతన్యదేవుని భక్తి తత్త్వము ఒక విశిష్టమార్గాన్ని అనుసరించినదనీ, అది వంగదేశపు వైష్ణవ వర్గానికి ఒక అనుసరణీయశాఖ అయినదనీ, అది చైతన్యుల విద్వచ్ఛిష్యుల చేతులలో భక్తి తత్త్వంలోనే ఒక గొప్ప పరివర్తనాన్ని తెచ్చి, సంస్కృతాలంకారికులలో మధురరసం అనే భక్తి తత్త్వశాఖకు దేశికులను చేసింది. చైతన్యుడు తన్ను కృష్ణ భగవానుని ప్రేయసియైన రాధికగా భావించుకొనేవాడు; చైతన్యుని సహచరు లంతా తమను బృందావన గోపికలుగా భావించుకొనేవారు; అంతా భగవానుడితో ఐక్య సంధానముకొరకై అనుతాపం చెందేవారు. వారందరిదీ శ్రద్ధాత్మకమైన భక్తియే—దివ్య ప్రియతముని కోసం విరహతాపం వాస్తవంగానే అనుభవించే వారు; వారంతా మానసికంగా నారీ సమానభావంతోనే ప్రవర్తించేవారు, అందు చేత విద్యాపతి పదావళి వారికి తమ అనుభూతులను, అనుతాపమును, వాంఛలను చిత్రించినట్లుగానే కనబడినవి. ఆ పదావళి వారి హృదయ తంత్రులను స్పందింప జేసి కృష్ణభగవానునికి తమ వ్యక్తిగత ప్రార్థనలుగా నిత్య సంకీర్తనములుగా వినియుక్తము లైనవి. అందుచేత విద్యాపతి కూర్చిన ప్రతి పదమూ, భక్తి పూర్ణ మైన ప్రేయసి గోపిక అనుభూతులుగా వారికి తోచి వారు వాటిని ఆ విధము

గానే వినియోగించారు. చైతన్యదేవునికి ప్రతిపదంలోను తన హృదయ స్పందనయే అంత మధురంగా రాగభరితంగా గేయనిబద్ధమై వినిపించడంచేత వాటివల్ల అతడు మోహపరవశుడై తన్మయావేశముల నొందేవాడు. ఈ విధంగా, కేవలం (సెక్యులర్) సాంఘిక కామకవితగా ఆవిర్భవించిన విద్యాపతి పదావళి చైతన్య దేవుని అనుయాయుల వినియోగంలో భక్తి సంకీర్తనములుగా పరిణమించాయి. స్త్రీ సౌందర్యాన్నీ రసానుభూతులను గూర్చి గేయములు కూర్చి పాడిన విద్యాపతి వైష్ణవ మహాజనుడుగా ఆరాధ్యుడైనాడు. అందుచేతనే కేవలం విద్యాపతి శృంగార పదావళి మాత్రమే మిథిలనుండి వంగదేశానికి వలసపోయి, చైతన్యస్వామి అనుయాయులద్వారా ఆర్యావర్తమంతా వ్యాపించి—పవిత్ర (మత) గ్రంథాల కోవలోకి చేరిపోయాయి.

కవిగావిద్యాపతి అందుచేతనే ఒక ద్రష్ట అనిపించుకోగలిగాడు; స్త్రీ సౌందర్యము, స్త్రీ హృదయ రసానుభూతుల చిత్రణమనే మేలిముసుగుద్వారా మానవ కామ జీవవపు రహస్యాల లోతుల్లను అతడు దర్శింపగలిగాడు.

9

విద్యాపతి కేవలం ద్రష్ట మాత్రమే కాదు—యుగయుగాలకు సౌందర్య పరమావధులుగా, ఆనంద గంగోత్రులుగా నిలిచిపోయే గేయములను కూర్చిన మహాశిల్పి!

విద్యాపతి కవితా శిల్పనైపుణిలో స్మరణీయములైన రెండు ధోరణులున్నాయి. సామాన్యజనులు మాటాడుకొనే భాషను తన గేయాలన్నిటిలో ప్రయోకందని విద్యాపతి మిథిలా నరనారీజన సామాన్యానికి సంస్కృత కవితలో కాని చెవిగించిన కావ్యానందాన్ని వారి మాతృభాషలోనే అందించాడని ఇక్కడ స్మరించడము చర్విత చర్వణమే అవుతుంది—అంత మాత్రమే కాక, తన కవితద్వారా మిథిలా ప్రజలందరి హృదయాలలోను పండిత పామర, స్త్రీ పురుష, ఉన్నత హీన కుల విచక్షలేని సమైక్య బాంధవ్యము జాతీయ స్థాయిలో నెలకొల్ప గలిగాడు.

విద్యాపతి కవితలో సాహిత్య సంగీతముల సంపూర్ణ సమ్మేళనము ప్రథమ స్మరణీయము! సంగీతము భాషకు పదనుతెస్తుంది; రాగరంజన వినా, కవితకు పూర్ణపారవశ్యము చేకూరదు. సంగీతంకోసం అని విద్యాపతి నేలకందని పార లౌకిక స్వరమూర్ఛనలను కూర్చలేదు; అతని గేయాలలో రాగమెంత ముఖ్యమో విషయం కూడా అంతముఖ్యము; ఇతివృత్తానికి అన్నివిధాలా సముచితమైన కవితారూపం ఆయనకు గేయంలో సిద్ధించింది. పాటలో ఏ మనోభావం వివృత మవుతుందో దానికి సరిగా సముచితమైన రాగవరుసలో అతని గేయాలు వెలు వడినాయి

రెండవది విద్యాపతి గేయాలలోని భాషాప్రయోగం కేవలం అర్థసిద్ధికోసమే కాదు; ఆయనకు మాటల శబ్దగుణములోని మాధుర్యమును సాధింపగల శ్రవణ శక్తిమెండు; అందుకే ఆయన పదావళి అందమయిన చిందులు తొక్కే గోపికా సుందరులు! సంస్కృతాలంకారికులు నిర్దేశించిన ప్రధానమైన కావ్య గుణ ద్వయం — మాధుర్యము, ప్రసన్నతా ఈ రెండూ ఆయన కవితలో దండిగా నిండి ఉంటాయి, ఆయన కవిత ఛందోమాధుర్యభరితము మాత్రమే కాక పఠనమాధురీ, శ్రవణమాధురీ, భావమాధురీ భరితము కూడ! వాడుక భాషలోని సామెతలు, నానుడులు ప్రజలవాడుకలో అందరి ఆప్యాయానికి పాత్రమైన వెన్నో అతని గేయాలకు మెరుగు తెచ్చాయి.ఆ మెరుగువల్ల అవి సామాన్య సంభాషణలలోని చమత్కారం ద్వారానేకాక, శ్రోతల రసికత్వానికి దోహదమయే రీతిని వారి హృద యాలను చూరగొన గలిగాయి. ఏ సామెతలోనైనా దానిని ప్రయోగించే జనుల లోకానుభవ సంపద నిబిడీకృతమై ఉంటుంది; అటువంటి దానిని విద్యా పతివంటి కవితాశిల్పి కవితా ఖండాలలో దానిలో సహజంగా నిండిన వ్యంగ్య వైభవం అంతటినీ వెదజల్లి గలిగేటట్టుగా పొదుగుతాడు.

మాధుర్యము శృంగార కవితకు సాధారణంగా విశిష్టతను చేకూర్చేగుణం; మైథిలీ సాహిత్య క్షేత్రంలో విద్యాపతి అంతగాను మాధుర్య గుణముగల ఇతర కవులలో గోవిందదాసొకడు! ఇతర కవులకంటె విద్యాపతి ప్రత్యేకత తనకాలపు సామాన్య స్త్రీ పురుషుల వాడుకభాషను తన కవితలో సరళముగా, సూటిగా, సహజసుందర ధోరణిలో ప్రయోగించడమే! ఆయన ప్రతిభావంతమయిన ప్రయో గంలో మైథిలీ భాషకు ఆ ప్రాంతపు ఏ యితర భాషకూ లేనంత భావప్రకటన శక్తి సిద్ధించింది. ఈ భావప్రకటనా గుణమే ఆయన రచన యేదైనా ఆయనదే

అని నిర్ధారించడానికి తోడుపడే లక్షణం! ఆయన మైథిలీ గేయాలకే కాదు, సంస్కృత, అవహర్థ భాషలలోని ఆయన కావ్యాలలో దేనికైనా అది వర్తిస్తుంది. అందుచేతనే కీర్తిలతా, కీర్తిపతాకా కావ్యాలలో కొన్ని అస్పష్ట భాగాలుండడంవల్ల అవి ఆయన రచనలేనా అనీ విద్యాపతి స్వదస్తూరీలో ఆ గ్రంథాలు ఎన్నడైనా ఉండేవా అనీ సంశయానికి తావు కలిగింది.

ఆయన భావప్రకటన అతి సహజం కావడంవల్లనే ఆయన కవిత్వం సరళతా ప్రసిద్ధి కలిగింది. విద్యాపతి కవిత హృదయంలో నుండి అలవోకగా (పాతాళ గంగవలె) పైకుబికి వచ్చినదగుటచేతను ఆయన భావాలూ అనుభూతులు ఆక్మశుద్ధి సంభూతములు కావటంచేతను, శ్రోతృరంజన సమర్థము! ఇది ఆయన వర్ణనలకు కూడా వర్తిస్తుంది. విస్తృతమయిన సంస్కృత శృంగార కవితనుండి తన కావలసిన కవితా సామగ్రినంతటినీ తీసుకొన్నా, ఆయన కవిత మాత్రము హృదయంనుంచి అప్రయత్నధారగా సహజ సుందరమై పెల్లుబికింది. దీనికి చక్కని ఉదాహరణ ఆయన కవితలో ప్రకృతిని వర్ణించిన ఘట్టాలే! పూర్వ కవులు గతానుగతికంగా తమ కవితలలో ప్రకృతిని గూర్చి చెప్పిన విషయాలను చర్విత చర్వణం చేయకుండా, తాను స్వయంగా దర్శించిన సుందర ప్రకృతి దృశ్యాలను సహజంగా తన గేయాలలో నింపాడు. ఆయన వర్ణనలలో వసంతంగాని, వర్షాగమనంగాని అత్యంత సూక్ష్మ విషయాలను కూడా వదలిపెట్టకుండా మన కళ్లకుకట్టి కనబడతాయి. సంస్కృత కవులు వారి అనుయాయులు చూపిన మార్గంలోనే విద్యాపతి కూడ ప్రకృతిని మానవ పాత్రల విభావానుభావాలకు నేపథ్యంగా వాడుకొన్నాడు. వర్షర్తు వర్ణనలను విద్యాపతి ప్రేమికుల సంయోగ సందర్భాలకూ వియోగ సందర్భాలకు కూడ వినియోగించాడు. కాని, వసంత ఋతువును కేవలం నేపథ్యంగా మాత్రమే కాక, మూర్తి దాల్చిన ఋతురాజుగా వర్ణించాడు. అది ఏ ఋతువయినా అతని వర్ణనలు గతానుగతికములు కావు, స్వయముగా స్వానుభూతి పూర్వకంగా దర్శించిన ప్రకృతి దృశ్యాలకు యథాతథ ప్రతిబింబాలు! అవి హృదయాలను సూటిగా తాకి, కవితలోని ప్రధాన అంగి రస పోషణకు లెస్సగా తోడ్పడతాయి! ప్రకృతి చిత్రణములలో అయన వర్ణస్పృహ చాలా నిశితము, మాటల సాహాయ్యంతో ఆయన కూర్చిన వర్ణ చిత్రాలు ప్రకృతి సహజములై హృదయాలకు హత్తుకుపోయే దృశ్యాలు! ఆయన భావ బింబాలు స్పష్టములు సంపూర్ణతా విలసితములు; సృష్టిలో ఆయన దర్శిం

చిన ప్రతి అందమునూ సహజముగా వర్ణించడంచేత పాఠకునకు కవికి కలిగిన తన్మయతే కలుగుతుంది.

ఆయన సౌందర్య దర్శనంలో ముఖ్యంగా పేర్కొనవలసింది· తాను కేవలం బాహిరంగా కంటితో చూడగలిగిన సౌందర్యాన్నే కాక, ఆంతరిక భావాలలోను రసానుభూతులలోను నారీజనుల హృదయపు లోతులలోని అందాలను కూడా దర్శించి, యథాతథంగా వాస్తవికంగా, కవితలో చిత్రించగల గడము !

విద్యాపతి అలంకారములను వినియోగించుకొన్న విధము ఆయన భావ ప్రకటన యొక్క స్పష్టత్వానికి చక్కని దృష్టాంతము. ఆయన భావనాశక్తి యొక్క సారవంత గుణమే దానికి కారణము. ఉద్దీపనము, ఘటనా సౌందర్యమును మరింత ప్రకాశింపజేయడము వాటికి నిర్దిష్టములైన రెండు విధులు ! ఆయన కవిత లోని జీవిత దృశ్యము లందలి వివిధ విషయ విస్తృతి, సరళహాస్యమూ, సర్వదా జాగృతమైన కల్పనాశక్తి, వీటిలో ఆయనకు తానే సాటి—ఆయన కవితలో దృశ్యములు ఆదర్శ రమణీయములు ! సౌందర్యం ఎక్కడున్నా దానిని దర్శింప గలిగిన విద్యాపతి ద్రష్ట! ఆ సౌందర్యమును ప్రతి పాఠకుడూ శ్రోతా కూడా తిరిగి దర్శింపగలిగే విధంగా తిరిగి శబ్ద చిత్రాలలో వర్ణించగలగడంచేత ఆయన సార్థకుడైన మహాకవి! ఆయన భావబింబాల వ్యాప్తి అతి విపులము ! మైథిలీ భాషలో మరొక మహాకవియైన గోవిందదాసు కవితతో విద్యాపతి కవితను పోల్చి చూస్తే—గోవిందదాసు రూపకాలంకార ప్రయోగంలో సిద్ధహస్తుడు! ఒక వస్తు వును మరొక వస్తువుగా నిరూపించేటప్పుడు (ఉపమానోపమేయాలలో) ఒకదాని లక్షణాలన్నిటినీ రెండవ దానికి ఆరోపిస్తాడు. ఒకే చిత్రమును కళ్ళకు కట్టి చూపడం ఆయన అద్భుత నైపుణి! విద్యాపతి ఒక చిత్రంతో సంతృప్తిపడడు. ఒక పాటలో త్వరిత వేగంలో ఎన్నో ఉపమానాలను మన ముందుంచుతాడు. అన్నీ అత్యంత సుందర చిత్రాలే ! కనుక ఉత్ప్రేక్షలో విద్యాపతి సిద్ధహస్తుడనాలి! అదే విధంగా అప్రస్తుత ప్రశంస (లేదా అర్థాంతరన్యాసం)లో కూడా విద్యాపతి దక్షుడే ! ఏది ఏమైనా ఆయన ఉపమానాలు స్పష్టరూప మహితములు! సులువుగా కనుగొనవచ్చు. ప్రకృతి సహజములు కనుక సుందరములు—వాస్తవంగా చూచి నవి, యథాతథంగా కవితా నిబద్ధములయినవి.

లక్ష్యములలో విభేదముల ననుసరించి కవితకు స్పష్టమైన నిర్వచనం చేయ పూనుకొంటే, ఆ నిర్వచనం అలంకార వినియోగముపై ఆధారపడుతుంది. ఇక్కడ అలంకారం అంటే ఆ శబ్దానికి విస్తృత దృక్పథంతో చేసుకొనే అర్థాన్నే చెప్పాలి! కవితకు సౌందర్యము కలిగించేదేదో అది అలంకారము; కవిత అంతర బాహిరములకు సౌందర్యము నాపాదించే మొత్తపు రూపము! మహాకవి కవితలో భావములు తప్పనిసరిగా ఎత్తే అవతారమే అలంకారము! శబ్దాలంకారాలలో సిద్ధించే రూపము విషయమటుంచితే, అలంకార భూయిష్ఠతే కవిత్వమనుకో కూడదు. అలంకారముల వేదికపైని కవితామూర్తి బలికావడం జరుగుతూ ఉంటుంది! ఔచిత్యమనీ, సామరస్యమనీ, వివిధాంగ సమవినియోగమనీ కవిత యొక్క అంతిమ సౌందర్యానికి మారుపేర్లు! "ఈ ఔచిత్యమునకు ఆలంబమైన అంపమ క్షేత్రము రసము కవితాత్మయే రసము! కనుక దానికి అలంబమైన అన్ని యితర విషయములు 'తగిన రీతి'ని పొందుపడి ఉండడమే ఔచిత్యము!" ఆత్మలేని శరీరం కేవలం మృతకళేబర సమానము! మృతకళేబరానికి 'తొడుగులు' అలంకారములెందుకు? కవి ప్రధాన లక్ష్యమైన భావము రసము సిద్ధించే విధముగా అలంకారములను వినియోగించితే అలంకారానికి సార్థక ప్రయోజనం కలుగుతుంది. వాల్టర్ పేటర్ 'శైలి' అనే విషయంపైని వ్రాసిన వ్యాసంలో 'ఒప్పుకొనదగిన భూషణం (అలంకారం) చాలమట్టుకు (కవితా) రూప సాధనలో ముఖ్యాంశమూ; ఆవశ్యకమూ కూడ!' అంటాడు; సమర్థుడైన కవి రససిద్ధి కలిగే విధంగా తన రచనను రూపొందించడంలో ఔచిత్యము దానంతట అదే తనచోటు సందర్భానికి తగినట్లు ఎలా చూసుకుంటుందో ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. అలంకారము కృతకమనీ, విపుల ప్రయత్న సాధ్యమైన బుద్ధి వ్యాయామమనీ, దాన్ని తగినట్లు సాధించడానికి చాలా శ్రమపడాలనీ అనుకొనే వారున్నారు కాని, మహాకవియైన వానికి అందులో శ్రమ సాధ్యమైనదేదీ లేదు. "అటువంటి వానికి రసోద్రేకము హెచ్చినకొద్దీ భావప్రకటన పొంగులు వారుతుంది; అలంకారాలు ప్రవాహంపై నురగలలాగ పొర్లి ప్రవహిస్తాయి.!' ప్రబలమైన సన్నివేశాలలో అలంకారాలు ఉప్పొంగి పొర్లడం స్వభావసిద్ధమే! కవి కవితాచాతురికలవాడయి రసావేశంలో తన్ను దాను మరచేస్థితే కలిగితే అతనికి అద్భుతమైన అలంకారాలు చేతికి అంది వస్తాయి. విద్యాపతికి ఎన్నో సందర్భాలలో రసం పొంగి పొర్లుతూన్న పుడు అతని కలంలో నుంచి అలంకారాలు తెగ ఊరుతాయి. స్త్రీ సౌందర్యాన్ని వర్ణించే పాటలూ, ప్రేమికుల సంయోగ శృంగారాన్ని వర్ణించే గేయాలూ ఇందుకు

మంచి ఉదాహరణలు! ఈ రెండు విషయాలూ అతని కల్పనాశక్తి విజృంభించ డానికి ఆ ఎత్తులలో అమేయరసానందం అందించడానికి కారణములు! అందుకని విద్యాపతి వియోగాన్ని సమర్థంగా సానుతాపయుక్తంగా చిత్రించలేదని కాదు. విరహ వర్ణన గేయాలెన్నో ఉన్నాయి. నాయికా విరహపు గేయాలు ఉత్తుంగ పరితాప వర్ణన సందర్భాలలో అలంకారాల వినియోగం చాలా పరిమితం! కరుణ రస శిఖరాన్ని అందుకున్నపుడు ఆ పరిస్థితిలోని భావావేశపు ఔదార్యమూ, సౌందర్యమూ సందర్భోచితమైన వాడుక మాటలలో నిరలంకారంగానే శ్రోతృ చిత్తాలకు హత్తుకొనే విధంగా చిత్రిస్తాడు.

10

ఇక చిట్టచివరగా పేర్కొనవలసినది—మానవ జీవితపు నిస్సారతను క్షణ భంగురతను, నైచ్యమును గురించి రచించిన ఆరు గేయాలున్నాయి, వాటిలో ఐదు మాధవునకో హరునకో చేసిన విన్నపాలు; మరొకటి జరను గూర్చి—బలముడిగిన వార్థక్యపు నిస్సహాయ సితిని గూర్చి వాస్తవికంగా, అనుభూతి పూర్వకంగా వర్ణించిన గేయం! చివరికి తనకే లాభమూ చేకూర్చని వ్యాపారాలతో తన జీవితం గడిచిపోయిందనే పశ్చాత్తాపము ఆ గేయాలలోని ఇతివృత్తము! జీవితకాలం అంతా 'నాది నాది' అనే మమకారంతో గడిపివేశాననీ, ఈ లోకం విడిచి వెళ్ళిపోయే వేళకి తనని ఆదుకొనే తన మనిషి ఒకరూలేరనీ, యౌవనంలో పరదారలపైనీ 'పరస్వము' పైనీ ఆశపడ్డాననీ, ఈ జీవితం మరుభూమి యిసుకలో జలబిందువు వంటిదనీ, మృత్యువు తనని సమీపిస్తున్నపుడు భార్య కాని కొడుకుగాని, మిత్రుడుగాని, తనకు సహాయపడగల వారొక్కరూలేరని, తన బదుకులో సగం నిద్రలో చెల్లిపోయిందనీ, బాల్యమూ వార్థక్యమూ ఉన్నాయి గాని, యౌవనంలో కూడా కామాగ్ని ప్రేరితుడు కావడంచేత, పరమందు తన్ను రక్షింపగల పరమాత్మను ధ్యానించడానికి సమయం మిగులకుండా పోయిందనీ, తన కాలమంతా ఐహిక జీవితపు నీచ విసయాలను గురించే తంటాలుపడి, జీవిత సాయం సంధ్యలో పరమేశ్వరుని ప్రాపుగోరడం, పనిపాటు చెయవలసిన దినం పూర్తయాక దిన బత్తెపు పనికోసం సాయం సంధ్యలో యజమాని వద్దకుపోయే

టంత అసందర్భంగా ఉందనీ, పరమేశ్వరునికి శరణాగతుడయినందుకు ఇప్పటి కైనా ఆయన తన పుణ్య పాపములను గణింపక అపారకరుణా పూర్వకమైన రక్షణ దయచేయగలడని నమ్ముతాడు. ఏళ్ళు గడిచిన కొద్దీ రాగల జీవిత పరిస్థితిని గురించి ముందుగా హెచ్చరించడమే విద్యాపతి వార్ధక్యములో జీవితపు నీచ పరిస్థితిని గురించి వర్ణించడంలోని ఉద్దేశము! దానివల్ల ఆతను (మానవుడు) ముందుగా కనువిప్పు కలిగి జీవిత యాథార్థ్యములను గూర్చి తెలును కొన్నాకయినా, అంత్యదశలో ప్రాపు కాగల భగవానుని ధ్యానమువైపు మనస్సు మొగ్గవచ్చు!

ఈ గేయాలన్నీ శాంత రసాత్మకములు—స్థాయిభావం నిర్వేదము లేదా వైరాగ్యము, స్వార్థ నిరసనము! వాటిలోని అనుభూతి చాలా గంభీరమై ఆత్మ శుద్ధితో వర్ణించిన గేయాలవి! పరదారా ప్రణయంతోను పరస్వ సంగ్రహంతోను తన జీవితం అంతా గడిపాననే విద్యాపతి ఆత్మ చరిత్రాత్మకమైన పశ్చాత్తాపం ఈ గేయాలలో ఆవిష్కృతమయిందని చాలమంది ఎక్కువచేసి వ్రాస్తూ వచ్చారు. విద్యాపతి వృద్ధ వయస్సులో అనుతప్తుడుగా ఉండినట్లు సంశయింప నక్కరలేదు. రాజా శివసింఘు రాజపోషణలో యోగభోగాలతో గడపిన విద్యాపతి పదవి ఉన్నా అంతటి మిత్రుడయిన రాజు అంతర్ధానం కావడంవల్ల తనకు రాజు ఆదరం కరవయి పోయిన నైరాశ్యం అంతా ఈ గేయాలలో కనబడడం సహజమే!

కవిగా గాని, మానవ వ్యక్తిగా గాని విద్యాపతిని గూర్చిన అటువంటి అభిప్రాయం కలగడం సమంజసం కాదని ఈ గ్రంథపు మూల రచయిత (శ్రీ రమానాథ్ ఝూ) విశ్వాసము! మానవ జీవితంలోని సర్వసాధారణాంశము లను రమణీయంగా ప్రదర్శించడమే కావ్య లక్ష్యంగా భావించే సంప్రదాయానికి చెందినవాడు విద్యాపతి! ఇంకొకలా చెప్పాలంటే కవిత—మానవ జీవితపు ఆదర్శీకృత ప్రతిబింబము—అందులో పాత్రల వ్యక్తి నిరూపణ-రసానుభూతుల చిత్రణ-పాత్రల నడవడికలు, ఇవన్నీ ఇంద్రియములకు మనస్సుకు రమణీయ మయే రీతిని - తదనుకరణగా లేదా, నటనగా ప్రదర్శించడమే ఆ కవితకు లక్ష్యము. శృంగార గేయాలలో వలెనే, ఈ శాంతరసాత్మక వైరాగ్య గేయాలలో కూడా విద్యాపతి రచన లోకవృత్త పరిశీలకుడు చేసే వస్త్వాశ్రిత రచనే కాని, స్వానుభవాన్ని మాత్రమే వర్ణించే ఆత్మాశ్రిత రచన అనుకొన పనిలేదు. వైరాగ్య

గేయాలలోను ఇతరత్రాను పరమ భక్తాగ్రేసరుని చిత్తవృత్తిని చూపే కవి, పరకీయా ప్రణయ చిత్రణలో స్వానుభవాన్నే చిత్రించాడని ఎలా అనుకోవడం ? శృంగార గేయాలలో వలెనే, ఈ వైరాగ్య గేయాలలో కూడా విద్యాపతి గడిచి పోయిన ఆత్మ చరిత్రాంశములను స్ఫురింపచేశాడనుకోనక్కరలేదు. శాంత రస దృష్టితో చూచినపుడు మానవ జీవితంలో సర్వసాధారణంగా కనబడే విషయాలే. విద్యాపతి పదావళి ఆ యా రసాలకు సంబంధించిన స్థాయిభావాలు ఆధారంగా కూర్చినవి. తన ఊహకందిన ఏ విషయమును గురించయినా కవిగా గట్టి సాను తాపముతో వ్రాయగలడు కనుక విద్యాపతి ఒక్కొక్క రసము తన హృదయములో పొంగి పొరలేటట్టు తన పదావళిలో నిబంధించాడు. ఈ పదావళిలో ప్రకటితము లయిన రసానుభూతులు ప్రతి (సగటు) మానవునికి సర్వ సామాన్యముగా జీవి తంలో ఎదుర్కొనే అనుభవాలే; కనుక అవి వార్ధక్యంలో పశ్చాత్తాపము చెందిన కవి స్వానుభవాలే అనుకోనక్కరలేదు, విద్యాపతివంటి ప్రతిభావంతుడయిన కవికి మానవునిలోని సామాన్య దౌర్బల్యాలు పరిశీలనకు అందుబాటు కావడం కాని, వాటిని సార్వజనీన సమ్మతములుగా సాహితీబద్ధము చేయడం కాని అపరూపం కాదు. పశ్చాత్తాపభావమూ, నైచ్యదృష్టి, క్షణభంగురతా, జీవితపు మిథ్యాత్వమూ శాంతరస దృష్టికి అందే సర్వసామాన్య మానవ దౌర్బల్యాలే. అందుచేత, విద్యాపతి తన కవితలో అనుసరించిన సాంప్రదాయికతను, కవి జీవిత యథార్థ ఘటనలూ దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే, విద్యాపతి శృంగార పదాలలో వస్త్వాశ్రయంగాను వైరాగ్య పదాలలో ఆత్మాశ్రయంగాను వ్రాశాడని తోచదు. శృంగార పదాలలో శృంగార రసలాగే వైరాగ్య పదాలలో శాంతరసం ఉట్టిపడుతూ ఉంటుందనేది నిర్వివాదాంశం. విద్యాపతికి మానవ జీవితంలోని నైచ్యమూ, వ్యర్థత్వమూ సమానంగా కూలంకషంగానే కనబడ్డాయి. శృంగార పదాలలోని నాయకునికి ప్రియురాలితో కామజీవితం పైని అతిశయమైన శ్రద్ధలాగే వైరాగ్య పదాల లోని నాయకుని ఆత్మనిరసనము కూడ విద్యాపతి వ్యక్తి జీవితానికి సంబం ధించినవి కావు. ఒక విశిష్టమైన ఘటనకు సార్వజనీనతను ఆపాదించడం కవిత్వం లక్ష్యం ! అది కామ శృంగారమయినా, అధ్యాత్మిక వైరాగ్యమయినా జీవితానందమయినా ఆత్మ నిరసనమయినా ఆ మహాకవికి కవితా శిల్పంలో కొట్టిన పిండే !

11

మధుర రాగరంజితములైన పదావళి కర్తగా విద్యాపతి యశస్సు సంస్కృత కావ్యలక్షణ సౌందర్యాలను పుణికి పుచ్చుకొని విస్మయావహంగా విస్తృత సీమాంతాలకు వ్యాపించింది. అంతవరకు వాటిని వినని నరనారీజనం కూడా ఈ పదావళిని ఒకసారి వినేసరికి వాటిలోని సార్వజనీన రాగరస సమ్మేళనానికి రసానంద పరవశులై తన్మయులు కావలసిందే. సంస్కృతమే నాగరకులయిన వారందరికి సమ్మతమయిన భాషగా చలామణి అవుతూ ఉండినపుడు మిథిలలో కూడా సంస్కృతం కాక వేరే భాషలో వ్రాసినా ఘోరపాపంగా భావించే కాలంలో ఆ దేశపు ప్రజలు నిత్యము వాడుకొనే భాషలో తన పదావళిని కూర్చిన సాహసికతా, ఆత్మ విశ్వాసమూ విద్యాపతివి! ఆనాటి ఛాందస విద్వాంసు లతనిని కవితకు పామరభాషను స్వీకరించినందుకు హేళనగా నిరసించి మాటాడినా, అతని నవ్యకవితా మార్గము బహు జనరంజకమై అతనికి అపూర్వ ఖ్యాతిని చేకూర్చడంతో, తిరిగి వారే తమ దౌర్బల్యాలను ఒప్పుకొని, విద్యాపతి అడుగుజాడలనే అనుసరించివలసిన వారయినారు. మిథిలలో నిపుణులైన పండితులందరికీ కూడా విద్యాపతి బాణీ ననుసరించి పాటలు వ్రాయడం ఒక ఆనువాయితి అయిపోయింది. వారు విద్యాపతిని అనుసరించడముకంటె ఒక అడుగు ముందుకు వెయ్యలేకపోయినా, మైథిలీ సాహిత్య చరిత్రలో విద్యాపతి నాటినుంచీ తెంపులేని వాహినిగా అతనిని అనుసరించే సంప్రదాయం ఒకటి ఏర్పడి పోయింది.

మిథిలకు బయట నేపాలులో విద్యాపతి ప్రభావాన్ని అనుసరించి మూడు శతాబ్దాలవరకు మైథిలీ సాహిత్యం వెలువడింది. భట్గాంవ్, ఖాట్మండులను పరిపాలించిన మల్లరాజులు మిథిలను తొలుతపాలించిన కర్ణాటకుల పరంపరకు చెందినట్లు చెప్పుకొంటారు—వారు మైథిలీ సాహిత్యాన్ని బాగా పోషించారు. మిథిలలో ఒయినబర రాజుల ఏలుబడి ఏష్యమయాక అక్కడి మెథిలీ విద్వాంసులు, కవులు పొరుగురాజ్యమైన నేపాలుకు వలసపోయి అక్కడి రాజపోషణను అనుభవించారు. విద్యాపతిని అనుకరించిన మైథిలీ సాహిత్యంలో ముఖ్యంగా విస్తృత సంఖ్యలో స్వచ్ఛ మైథిలీ భాషలో నాటకాలు వెలువడినాయి. ఆధునిక దేశభాషా నాటకా

లన్నిటిలోను ఆద్యములుగా చెప్పదగినవి మైథిలీ భాషలో నాటకాలే—వాటికి వరుస తప్పకుండా రంగస్థలంపై ప్రదర్శించడం కూడా ఒక విశేషము! 18 వ శతాబ్దపు మధ్యభాగంలో మల్లరాజుల పరిపాలన అంతమయి మరొక వంశం అధికారానికి వచ్చేవరకూ నేపాల్ రాజాస్థానములో మైథిలీయే సారస్వత వ్యాసంగానికి వినియుక్తమయిన భాష—ఆ రచయితలు అందరికి ఆద్య ఆరాధ్యుడు విద్యాపతియే. ఈ విస్తృత మైథిలీ సాహిత్యాన్ని గురించి నేపాలుకి బయట ఇంతవరకు వెల్లడి కావలసినంత కాలేదు కాని, అక్కడి పుస్తక భాండాగారాలలో ఆగ్రంథాలు భద్రముగా ఉన్నాయి.

విద్యాపతి ప్రభావం ప్రబలతరంగా కనబడేది వంగదేశపు మహాకవులందరిపైనా అనీ, వంగ సాహిత్య పరిణామపు తొలిదశలలో ఆ సాహిత్య వృద్ధికి పెంపుకు విద్యాపతి ప్రభావమే కారణమనీ వంగీయులంతా ఒప్పుకొంటారు. బెంగాలులో విద్యాపతి చరిత్ర శృంగారమయము. మిథిలకు ఏనాటినుంచో వంగదేశంతో సాంస్కృతిక సంపర్కాలుండేవి. బెంగాలీ విద్వాంసులు మిథిలకు పోయి తమ వైదుష్యానికి మిథిలలోని విద్వాంసుల ద్వారా వన్నెలు దిద్దుకోవడం సాంప్రదాయికాచారము! బెంగాలుకు ఆ విధంగా తిరిగి వచ్చిన వారందరూ విద్యాపతి పదావళిని కంఠస్థం చేసుకొని రావలసిందే! చైతన్య దేవునికి ఆయన అనుయాయులకి భక్తి తన్మయత్వం కలిగించేవి. సహజయాన భక్తిమార్గం వారు భగవత్ప్రేమ లేక భక్తిని భగవంతుని భర్తగా కామించడం ద్వారా అనుష్ఠిస్తారు విద్యాపతి శృంగార పదావళి చైతన్యదేవుని శిష్యులకు భక్తి సంకీర్తనలయాయి. విద్యాపతి బెంగాలు వైష్ణవులందరికీ ఆరాధ్యుడయిన 'వైష్ణవ మహాజను'డయినాడు (వారికి ఆదిగురువు జయదేవుడూ, ద్వితీయ గురుడు విద్యాపతి—రాధాకృష్ణులు ప్రకృతి పురుషులు, పరదైవ మిధునం!) విద్యాపతిని అనుసరించిన బెంగాలీ వైష్ణవ కవులు తమ కీర్తనలకు విద్యాపతి పదావళిలోని భాషను కూడా స్వీకరించారు. స్వచ్ఛ మైథిలీ వారి భాష కాదు కనుక మైథిలీ బెంగాలీలు కలిసిన వారి సంకీర్తనలలోని భాషకు 'బ్రజబులీ' అని పేరు వచ్చింది. చైతన్య దేవుని పరంపర వారందరికీ విద్యాపతి ఆదర్శ గురువైనాడు, 'బ్రజబులీ' వారి కవితా సంకీర్తన భాష అయింది, చైతన్య సంప్రదాయంతోపాటు విద్యాపతి పదావళి కూడా దేశాంతర వ్యాప్తిపొంది, ఒరిస్సా, అస్సాములోకవైపునా, ఇంకొకవైపు యమున ఒడ్డున ఉండే వ్రజభూమివరకు చేరుకున్నాయి ఆ ప్రాంతాల భక్తజనులందరికీ దైవప్రేమ లేక మధురభక్తి సంప్రదాయానికి అతడు ఆదిగురు

వులలో ఒకడయి, అతని పదావళి వారికి నిత్యము పాడుకొనే భక్తి సంకీర్తన లయినాయి బెంగాలులోనే వైష్ణవులంతా విద్యాపతిని ఆచార్యుడుగాను వంగదేశీయుడుగాను భావించారు. కొందరు వంగకవులు తమకీర్తనల భణితాలలో విద్యాపతి నామాన్ని చేర్చుకోడం ఘనతగా భావించారు. వారిలో ఒక కవి విద్యాపతి నామాన్నే తనకు పెట్టుకొన్నాడు. 'బ్రజబులి'లో విస్తృత సాహిత్యం వెలువడింది. అదంతా భారతీయ సాహిత్య చరిత్రలో ప్రతిష్ఠా కరమైన స్థానం అలంకరించదగినది. 'బ్రజబులి' మిథిలలో పుట్టినభాష అనీ, దానిని కవితకు వాడుకొన్నవారు మిథిలలో పుట్టినవారు కారనీ, అదంతా విద్యాపతి పదావళి ప్రభావం వల్ల ఉత్పన్నమైనదే అనీ ఆలోచిస్తే విద్యాపతి ప్రతిభా అది గంగోత్రిగా సంస్కృతి వాహిని ఎన్నెన్ని గతుల ప్రసరించిందో అని అద్భుతావిష్టులమై ఆ ప్రతిభకు మోడ్పు లర్పిస్తాము.

ఈ సందర్భంలో విద్యాపతి తన ప్రభావాన్ని రవీంద్రనాథఠాకూరు పైని కూడా ఆయన కవితా వ్యాసంగపు తొలిదశలో అనల్పంగా చూపకపోలేదని గుర్తించాలి. ఆ దశలో రవీంద్రుడు వ్రాసిన 'భానుసింఘేర్ పదావళి'లోని భాషను రవీంద్రుడే 'మైథిలీ భాష కనుకరణ' అని పేర్కొన్నాడు. మిథిలలో వలెనే బెంగాలుతో కూడా విద్యాపతి ప్రభావము ప్రవర్తిల్లిన సాహిత్య యుగం 19 వ శతాబ్దం వరకు సాగింది.

అస్సాంలో సుప్రసిద్ధులయిన శంకరదేవ, అతని శిష్యుడు మాధవదేవ— ఇద్దరూ కూడా విద్యాపతివల్ల సాక్షాత్ప్రభావితులై తమ రచనలను మైథిలీ భాషలోనే రచించారు. వారి రచనలు వైష్ణవ భక్తి ప్రచారానికుద్దేశించిన భాగవత నాటకాలైనా (అంకావళి) ప్రజలకుద్దేశించిన రచనలను ప్రజల భాషలోనే రచించిన విద్యాపతియే వారికి కూడ ఉద్బోధకుడు !

కవితానందమును ప్రజలకు వారు మాటాడుకొనే భాషలోనే అందజెయ్య వలెననే ఆదర్శగుణం జనాదరం పొంది, దేశాంతర వ్యాప్తిపొందింది. కవితా నైపుణ్యమును వినియోగించి, విద్యాపతి చూపిన ఒరవడినే అనుసరించి కొన్ని శతాబ్దులవరకు వివిధప్రాంతాల మహాకవులు ప్రజలకు సుబోధకమయే ప్రాంతీయ భాషలలోనే తమ గేయ కవితలను వ్రాసి చిరయశస్కులైన వారిలో సూరదాసు, మీరా, తులసీదాసు, కబీరు వంటి అనేకులను పరోక్షముగానైనా విద్యాపతివల్ల ఉద్బోధితులైన వారేమో అనుకొనవలసి వస్తుంది.

12

మైథిలీ సాంస్కృతిక పునరుజ్జీవనంలో పండిన వెలలేని పంట విద్యాపతి! ఆయన వృత్తివల్ల కవికాదు. మరి జీవితంలో వివిధ వ్యావృత్తులు కలవాడు. ఆయన దృక్పథము అనేక విధాల ఉదారము! తన అభిప్రాయాలనుబట్టి తన కాలము వారికంటె చాలా విధాల ముందే పుట్టిన భవిష్యద్ద్రష్టగా కలకాలం నిలబడతాడు. అతని తరువాతి శతాబ్దాలలో మిథిల సాంస్కృతికంగా చాలా వెనుకబడి పోవడం శోచనీయము. అందుచేతనే విద్యాపతి మానవోత్తమత్వము కాని, అతడు లక్ష్యించిన ఆదర్శములు కాని మరపు తెరల వెనుకకుపోయి, అతడు అసలు ఉండెనా లేదా అనే ఆశంకకు మూలమైన కథావశిష్టపు మనుషులలో కలిసిపోయాడు. అయితే, తన చుట్టూ ఉండే ప్రజలకు తన శ్రావ్య పదావళిని వినిపించిన నాటినుండీ కవిగా అతని యశస్సు ఎన్నడూ తరుగలేదు. కవిగా విద్యాపతి ఇంకా సజీవుడే, ఎప్పటికీ అమరజీవుడే! ఆయన భారతీయ సాహిత్య నిర్మాతలలో తనకు తానే సాటి అనదగినవాడు. భారతీయ సాహిత్య చరిత్రలో అమరజీవియై నిలిచిపోతాడు!

భారతీయ సాహిత్య నిర్మాతలు

ప్రాచీన, ఆధునిక భారతీయ సాహిత్య నిర్మాతలను గురించి తెలుసుకోవడం ద్వారా భారతీయ సాహిత్య చరిత్రలోని ప్రధాన ఘట్టాలను సామాన్య పాఠకుడు సైతం గ్రహించవచ్చు.

ఏ భారతీయ భాషలోనైనా దాని అభివృద్ధి వికాసములకు తోడ్పడిన సుప్రసిద్ధ రచయిత జీవిత కథనూ, ఆయన సాహిత్య సేవనూ ఈ శీర్షిక క్రింద అంగ్లంలో వెలువడే ప్రతి రచన నుంచీ గ్రహించవచ్చు.

- లక్ష్మీనాథ బెజ్ బరువా- హేమ్ బరువా
- రాజారామ్ మోహనరాయ్-సౌ. ఠాకూర్
- కేశవసుత్-ప్రభాకర్ మాచ్వే

ఇళంగో అడిగళ్ - ము. వరదరాజన్

- ప్రేమ్ చంద్ - ప్రకాశచంద్ర గుప్త
- ఈశ్వరచంద్ర విద్యాసాగర్- హెచ్. బెనర్జీ
- కబీర్ - ప్రభాకర్ మాచ్వే
- తోరూదత్ - పద్మినీ సెన్ గుప్త

వేమన - వి. ఆర్. నార్ల

వీరేశలింగం - వి. ఆర్. నార్ల

- గాలిబ్ - యం. ముజీబ్
- మీరాబాయి - ఉషా విల్సన్
- బసవేశ్వర - H. తిప్పేరుద్రస్వామి
- భారతేందు హరిశ్చంద్ర-మదన్‌గోపాల్

మానిక్‌బందోపాధ్యాయ - సరోజ్ మోహన్‌మిత్ర

- జీవనానందదాస్ - బి. దాస్ గుప్త

ప్రమథచౌధురి - ఎ. కె. ముఖోపాధ్యాయ

చండీదాస్ - సుకుమార్ సెన్

- కుమారన్ ఆశాన్ - కె. ఎం. జార్జి

కాజీనజ్రుల్ ఇస్లాం - గో. హాల్దా

- సరోజినీనాయుడు - పద్మినీ సెన్‌గ
- బి. ఎమ్. శ్రీ కంఠయ్య - ఏ. ఎన్. మూర్తి రావు

విద్యాపతి - రమానాథ్‌ఝా

- వళ్లత్తోల్ - జి. హృదయకుమారి

జయదేవ - యస్. కె. చటర్జీ

- కంబన్ - యస్. మహరాజన్

నమ్మాళ్వార్ - ఎ. శ్రీనివాసరాఘవన్

డా॥ సి. ఆర్. రెడ్డి-డి. ఆంజనేయులు

♦ పోతన – డి. వేంకటావధాని

♦ వేదం, వేంకటరాయశాస్త్రి - వి. వి. శాస్త్రి (జూనియర్)

♦ తారాశంకర్ బంద్యోపాధ్యాయ- మహాశ్వేతదేవి

♦ ఫకీర్ మోహన్ సేనాపతి – మాయాధర్ మన్‌సింహ

♦ బాణభట్టు – కె. కృష్ణమూర్తి

♦ రాహుల్ సాంకృత్యయన్ - ప్రభాకర్ మాచ్వే

♦ బంకిమ్ చంద్ర చటర్జీ – సుబోధ చంద్రసెన్ గుప్త

♦ భారతి - ప్రేమా నందకుమార్

♦ బుద్ధదేవబోస్ - అలోకరంజన్‌దాస్‌గుప్త

♦ గురజాడ - వి. ఆర్. నార్ల

♦ జ్ఞానదేవులు – పి. ఎమ్. దేశ్‌పాండే

♦ మహాకవి ఉళ్లూర్-సుకుమార్ ఆళికోడ్

♦ మాణిక్య వాచకర్-జి. వన్మీకనాథన్

♦ కల్హణుడు - సోమనాథ్ ధర్

♦ సరళదాసు - కృష్ణచంద్ర పాణిగ్రాహి

♦ నజీర్ అక్బరాబాదె- మహమ్మద్‌హసన్

♦ శ్రీ అరవిందులు - మనోజ్ దాస్

♦ పంజె మంగేశరావ్-వి. సీతారామయ్య

♦ నర్మదాశంకర్ - గులాబ్‌దాస్ బ్రోకర్

♦ వీరేశలింగం - వి. ఆర్. నార్ల

♦ పోతన – డి. వేంకటావధాని

♦ తుకారాం - బాలచంద్ర కేమాజే

♦ నామదేవుడు - ఎమ్. జి. దేశ్‌ముఖ్

♦ ఇవి తెలుగు చేయబడినవి.

Indian Institute ... ce
117728
20/12/04
SIMLA

విద్యాపతి ఠాకూర్ మైథిలీ కవులలో అగ్రగణ్యుడు క్రీ. శ, 1350-1460 ల నడుమ కాలంలో జీవించిన వాడు. పశ్చిమ బెంగాలు సరిహద్దునగల తూర్పు బీహార్ ప్రాంతంలో నివసించే యాభై లక్షల ప్రజలు నిత్య వ్యవహారంలో మాటాడుకునే మైథిలీ భాషలో విద్యాపతి తన కవిత్వం రచించాడు. అనేక తాళపత్ర గ్రంథాల నుంచి ఉద్ధరించిన 800 వైష్ణవ, శైవ భక్తి తత్త్వాలకు చెందిన పదావళిని రచించిన మహాకవిగా విద్యాపతి ప్రసిద్ధి కెక్కినాడు. ఆయన సంస్కృత, అవహట్ఠ (అపభ్రంశ) మైథిలీ భాషలలో విద్వాంసుడు. ఆయన గేయములు మానవ జీవిత మధుర దృశ్యాల ప్రతిబింబాలు; నారీజన సౌందర్య లాలిత్యాల వర్ణనలకు పట్టు గొమ్మలు! రవీంద్రనాథ ఠాగూరు "విద్యాపతి రసానంద శిల్పియైన కవి, అతడు సృష్టించిన మానవ జీవిత దృశ్యాల మాధుర్యసారము ప్రణయైక భరితము".... అని పేర్కొన్నారు. విద్యాపతి గేయములు రాగ నిబద్ధములు 50 ఏండ్లు ఆయన శివసింహ రాజుకు ఆస్థాన కవి! మధుర పదావళియే కాక, పురుష పరీక్ష, కీర్తి లత, గోరక్షా ప్రకాశ మొదలైన అనేక గ్రంథాలను కూడా రచించాడు!

ఈ మైథిలీ మహాకవి జీవిత సంగ్రహమును సుప్రసిద్ధ విద్వాంసుడు, మైథిలీ సాహిత్య విమర్శకుడు అయిన కీ. శే. పండిత రమానాథఝా రచించారు. ఆయన సాహిత్య అకాదెమీ మైథిలీ సలహా సంఘపు కార్య సచివులుగా అకాదెమి కార్య నిర్వాహకవర్గ సభ్యులుగా సాహిత్య సేవచేశారు. తమ వ్రాతప్రతిలో సర్దుబాట్లు కొన్ని చేసికొనవలెనని ఆయన అనుకొన్నా 1971 డిసెంబరులో దురదృష్టవశాత్తు సంభవించిన హఠాన్మరణం కారణంగా ఆయన కోరిక నెరవేరలేదు. ఆయన అమరస్మృతిపట్ల గౌరవ పురస్సరంగా ఈ జీవిత సంగ్రహపు మూల ప్రతిలో మార్పులు చేర్పులూ లేకుండా ప్రకటించడమయినది,

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

ముఖపత్ర చిత్రం: సత్యజిత్ రాయ్

రేఖా చిత్రం: కాంతిరాయ్

అట్టలోపలి వైపున అచ్చు వేసిన శిల్పచిత్రంలో కనబడేది శుద్ధోదన మహారాజుకు గౌతమబుద్ధుని తల్లియైన మహారాణి మాయాదేవి కన్న స్వప్నం గురించి జ్యోతిషికులు వ్యాఖ్య చేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను వ్రాసుకొంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారత దేశంలో లేఖన కళ చిత్రశిల్పంలో నిబద్ధమై లభించే దృష్టాంతాలలో ఇదే ప్రాచీన తమ

నాగార్జున కొండ క్రీ. శ. 2 వ శతాబ్దం.
జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీ,

Library IIAS, Shimla
TL 811.22 V 669 J
00117728